www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 1-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 196 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.9.12 తదుపరి ఏకాదశి, నక్షత్రం: శతభిషం రా.6.20 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.12.23-1.54, దుర్ముహూర్తం: ఉ.6.17-7.48, అమృతఘడియలు: ఉ.11.17-12.51, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## అమ్మో.. నకిలీ బొమ్మ!



ఆందోళన కలిగిస్తున్న డీప్ ఫేక్ వీడియోలు, చిత్రాలు

మహిళలను, పిల్లలను లక్ష్యంగా చేసుకుంటున్న వైనం

ఏఐ ఇంకా అభివృద్ధి చెందితే మరింత ముప్పు: నిపుణులు

చెక్ పెట్టేందుకు సర్కారు చర్యలు 2

ఐటీ రూల్స్‌కు పలు సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదా

భయపడొద్దు... పోలీసులున్నారు.. డీప్‌ఫేక్ బాధితులకు చిరంజీవి భరోసా 11

## 'ఎన్టీఆర్' వైద్య సేవల పునరుద్ధరణ

మంత్రి హామీతో 'ఆశా' నిర్ణయం

రూ.2,700 కోట్ల బకాయిలకు 'వన్ టైం సెటిల్‌మెంట్'

నెలాఖరులోగా చెల్లిస్తాం: మంత్రి 13

## లిక్కర్ స్కామ్ కేసులో 11 మంది ఆస్తుల జప్తు

సిట్‌కు ఏసీబీ కోర్టు అనుమతి

## నీ సంగతి చూస్తా

నువ్వు నాకు డబ్బులిచ్చావా?

బయటికొచ్చాక నాశనం చేస్తా

ఫిర్యాదుదారుపై కి'లేడీ' అరుణ

కోర్టు ప్రాంగణంలో చిందులు 14

## మరో పదేళ్ల రక్షణ బంధం

భారత్-అమెరికా కీలక ఒప్పందం

స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్‌కు ఈ ఒప్పందం కీలకం: రాజ్‌నాథ్

## హెచ్-1బీ దుర్వినియోగం

ఎక్స్‌లో అమెరికా కార్మిక శాఖ యాడ్

భారతీయులే అధికంగా లబ్ధి పొందారంటూ అక్కసు 2



**249** మండలాల్లోని **1,434** గ్రామాలు, **48** పట్టణాలపై తుఫాన్ ప్రభావం | **161** మండలాల్లో అత్యధిక వర్షపాతం | **1.38** లక్షల హెక్టార్లలో నష్టం

2.96 లక్షల టన్నుల ఉత్పత్తులకు దెబ్బ

1.74 లక్షల మంది రైతులపై ప్రభావం

దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు 26,575

నేలకూలిన విద్యుత్ స్తంభాలు 2,817

వేల కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం



కృష్ణా జిల్లాలో నేల వాలిన వరి

తక్షణం

# ఆదుకోండి!

### తుఫాన్ నష్టం రూ.5,244 కోట్లు.. కేంద్రానికి ప్రాథమిక నివేదిక

పూర్తి వివరాలు వచ్చాక నష్టం మరింత పెరుగుతుందని వెల్లడి

'మొంథా' ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వెంటనే కేంద్ర బృందాలను పంపాలని వినతి

విధ్వంసం తీవ్రత తెలిపే ఫొటోలు రిపోర్టుకు జత

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన తమను వెంటనే ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. 17 శాఖలు, వివిధ రంగాలకు మొత్తం రూ.5,244 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ ప్రాథమిక నివేదిక సమర్పించింది. తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వెంటనే కేంద్ర బృందాలను పంపాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రాథమిక నివేదికను శుక్రవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి పంపారు. ఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమేనని.. పూర్తి స్థాయిలో వివరాలు అందాక నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. ఏయే రంగాలకు ఎంత మేరకు నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని నివేదికలో ప్రభుత్వం పొందుపరిచింది. 249 మండలాల పరిధిలోని

మిగతా 12వ పేజీలో...

## నేటి సాయంత్రానికల్లా ముంపు నుంచి రైతుకు ఊరట


### పొలాల్లోని నీటి మళ్లింపునకు తక్షణ చర్యలు

ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

అత్యుత్తమ పనితీరు కనబరచిన 100 మందిని సన్మానించుకుందాం

సాయంపై ప్రధాని మోదీతో మాట్లాడతా: సీఎం చంద్రబాబు 12

## పార్టీ అండ లేకుండా నెగ్గగలరా?



చాలా మంది ఎమ్మెల్యేలు వ్యక్తిగత ఇమేజ్‌తో గెలిచామనుకుంటున్నారు

అలాంటివాళ్లు నిరభ్యంతరంగా బయటికి వెళ్లి పోటీ చేయొచ్చు: సీఎం

సిద్ధాంతాలపై అవగాహన లేనివారికి టికెట్లిస్తే తిరువూరులాంటి పరిస్థితులే ఎదురవుతాయి

ఆ ఇద్దరినీ క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవండి

విడివిడిగా వివరణ తీసుకుని నాకు నివేదిక ఇవ్వండి

లండన్ నుంచి వచ్చాక ఇద్దరితో మాట్లాడతా

విభేదాలు కొలిక్కిరాకుంటే కఠిన చర్యలే

తిరువూరు పంచాయితీపై సీఎం సీరియస్

ఇక వారంలో ఒక రోజు కార్యాలయానికి వస్తా

లండన్ నుంచి రాగానే పార్టీ కమిటీలు వేస్తా

పార్టీ ఆఫీసులో 4 గంటలు.. నేతలతో సుదీర్ఘ చర్చ

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 'పార్టీ సిద్ధాంతాలపై అవగాహన లేని వారికి టికెట్లు ఇస్తే ఎలా ఉంటుందో తిరువూరులో పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. పార్టీ లేకపోతే వారి పరిస్థితేంటో తెలుసుకోకుండా.. పార్టీ లైన్ దాటి ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందే' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. చాలా మంది ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత ఇమేజ్‌తో గెలిచామని అనుకుంటున్నారని.. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని ఆక్షేపించారు. అలాంటి వారు నిరభ్యంతరంగా బయటకు వెళ్లి

మిగతా 12వ పేజీలో...

## పోలవరం నిర్వాసితులకు నేడు వెయ్యి కోట్ల పరిహారం

14

మేయర్ దంపతుల హత్య కేసులో..

## ఐదుగురికి ఉరిశిక్ష

చిత్తూరు కోర్టు సంచలన తీర్పు

మేనల్లుడే ప్రధాన హంతకుడు

ఆర్థికంగా అత్తామామ సహకరించడంలేదని

చాంబరులో కత్తులు, పిస్టళ్లతో దాడిచేసి హత్య

మరో నలుగురితో కలిసి చింటూ నరమేధం 11

బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం..

## 27 మందిపై కేసు

ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందూరి గోపీకృష్ణ, వైసీపీ సోషల్ మీడియాపై నమోదు

బెల్ట్ షాపుల్లో మద్యం తాగడం వల్లనే ప్రమాదమంటూ తప్పుడు పోస్టులు 13

ప్రజలను తప్పుదారి పట్టించి, అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతోనేనని ఫిర్యాదు

# కశ్మీరు విలీనం కాకుండా.. పటేల్‌కు నెహ్రూ మోకాలడ్డు!

» ఈ తప్పిదానికి దశాబ్దాలు బాధలు పడ్డాం: మోదీ

» పటేల్ 150వ జయంతి సందర్భంగా నివాళి



ఏక్తా నగర్ (గుజరాత్), అక్టోబరు 31: దేశ విభజన పాపం కాంగ్రెస్‌దేనని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. కశ్మీరును భారత్‌లో విలీనం చేయకుండా నాటి ఉపప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ను ప్రథమ ప్రధాని నెహ్రూ అడ్డుకున్నారని ఆక్షేపించారు. పటేల్ 150వ జయంతినాడు 'జాతీయ ఏకతాదినం' సందర్భంగా శుక్రవారం గుజరాత్‌లోని ఏక్తా విగ్రహం వద్ద మోదీ ఆయనకు నివాళులు అర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన తప్పిదానికి దశాబ్దాలపాటు దేశం మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. "దేశాన్ని మాత్రమే గాక వందేమాతరం గీతాన్ని సైతం ఆ పార్టీ చీల్చింది. మతప్రాతిపదికన అందులోని ఓ భాగాన్ని తొలగించింది. బ్రిటిషర్లు వందేమాత్రం నినాదాన్ని అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. కానీ ఆ పాటను తొక్కిపెట్టడంలో కాంగ్రెస్ విజయం సాధించింది' అన్నారు. జాతీయ ఏకతాదినం సందర్భంగా ప్రతి చొరబాటుదారునూ తరిమివేయాలని ప్రజలు ప్రతినబూనాలని పిలుపిచ్చారు. మావోయిజాన్ని కూకటివేళ్లతో పెకలించేదాకా తన ప్రభుత్వం విశ్రమించదన్నారు. సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి, పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పించారు.

## ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి: ఖర్గే

న్యూఢిల్లీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించాలంటూ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించాలి. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఎందుకంటే వల్లభాయ్ పటేల్‌కు సముచిత గౌరవం ఇవ్వాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా భావిస్తే తప్పనిసరిగా ఇది జరగాల్సిందే. ముమ్మాటికీ దేశంలోని ఘర్షణలకు, శాంతి భద్రతల విఘాతానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లే కారణం. గతంలో పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించారు' అని ఖర్గే అన్నారు. శుక్రవారం ఢిల్లీలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు మల్లికార్జున ఖర్గే నివాళులర్పించారు. ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది.

## సొంత యూట్యూబ్ చానెళ్లు ప్రారంభించండి

» ప్రాజెక్టుల ప్రగతిపై నిత్యం వీడియోలు అప్‌లోడ్ చేయాలి

» ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్ల అభివృద్ధి సంస్థలకు గడ్కరీ ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 31: జాతీయ రహదారుల ప్రగతిని తెలిపేందుకు సొంతంగా యూట్యూబ్ చానెళ్లను ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థలను కేంద్ర జాతీయ రహదారులు, రవాణాశాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. ఆ యూట్యూబ్ చానెళ్లలో వివిధ దశల్లో ఆయా రహదారుల పురోగతిని తెలిపే వీడియోలను నిరంతరం అప్‌లోడ్ చేయాలని శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో చెప్పారు. ప్రజా పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపునకే ఈ విధానం తెస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారుల పొడవునా క్యూఆర్ కోడ్‌తో కూడిన హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్న గడ్కరీ.. ఆ కోడ్ స్కాన్ చేస్తే సంబంధిత రహదారి ప్రాజెక్టు వివరాలను ప్రయాణికులూ తెలుసుకోవచ్చునన్నారు. ఒకవేళ రోడ్డు బాగా లేదని సోషల్ మీడియాలో ప్రజలు ఫిర్యాదు చేస్తే.. తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, నిర్వహణలో భాగస్వాములంతా బాధ్యతలు పంచుకోవాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## కక్షిదారుల న్యాయవాదులకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయలేవు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 31: కక్షిదారులకు ఇచ్చిన వృత్తిపరమైన సలహాలపై ప్రశ్నించే నిమిత్తం దర్యాప్తు సంస్థలు న్యాయవాదులకు సమన్లు జారీ చేయలేవని సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. కక్షిదారుల వివరాలు కోరుతూ న్యాయవాదులకు సమన్లు ఇవ్వడమనేది నిందితుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లే అవుతుందని ఆక్షేపించింది. భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)లోని సెక్షన్ 132లో పేర్కొన్న మేరకు.. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే దర్యాప్తు సంస్థలు న్యాయవాదులను పిలిపించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఆమోదంతోనే దర్యాప్తు అధికారులు క్రిమినల్ దర్యాప్తుల్లో న్యాయవాదులకు సమన్లు జారీ చేయవచ్చని పేర్కొంది. సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ సమన్లు జారీ చేయడంపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకొని విచారించింది.

## పాక్, అఫ్గాన్ కాల్పుల విరమణ కొనసాగింపు

ఇస్తాంబుల్, అక్టోబరు 31: కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలని పాక్, అఫ్గాన్ నిర్ణయించాయి. రెండు దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో జరుగుతున్న శాంతి చర్చల్లో ఈ మేరకు నిర్ణయించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలుపై నవంబరు 6న మరో కీలక సమావేశం జరగనుందని టర్కీ విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. అక్టోబరు 11న అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులతో మొదలైన ఉద్రిక్తతలు రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీసేలా మారాయి. మరోవైపు, అఫ్గాన్‌లోని కునార్ నదిపై డ్యామ్ నిర్మాణానికి సహకారం అందిస్తామని భారత్ తెలిపింది. నీటి నిర్వహణ, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల్లో తమ సహకారం కొనసాగుతుందని స్పష్టం చేసింది. వాయువ్య పాకిస్థాన్‌లోకి ప్రవహించే ఈ నదిపై డ్యామ్ కట్టడాన్ని పాక్ వ్యతిరేకిస్తోంది. గతంలోనూ హెరాత్ ప్రావిన్స్‌లో సల్మా డ్యామ్ విషయంలో అఫ్గాన్‌కు సహకరించినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

## మొఘలుల కాలం నాటి పెయింటింగ్‌కు రూ.119.49కోట్లు

» లండన్‌లో నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ధర



న్యూఢిల్లీ, అక్టోబరు 31: మొఘలుల కాలం నాటి పెయింటింగ్ ఒకటి వేలంలో రికార్డు సృష్టించింది. అక్బర్‌కు అత్యంత ఇష్టమైన చిత్రకారుడు బాసవాన్ గీసిన 'చిరుతపులుల కుటుంబం' చిత్రం రూ.119.49కోట్లకు అమ్ముడుపోయింది. అక్టోబర్ 28న లండన్‌లో ఈ వేలం నిర్వహించారు. వేలం నిర్వాహకులు ఊహించినదాని కన్నా ఈ చిత్రం 14రెట్లు ఎక్కువ ధర పలికింది. ఇది క్రీ.శ 1575-80 మధ్య కాలానికి చెందినదని నిర్వాహకులు తెలిపారు. పర్షియన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ సద్రుద్దీన్ ఖాన్, ఆయన భార్య క్యాథరిన్ వ్యక్తిగతంగా సేకరించిన పురాతన పెయింటింగ్స్ సహా 95 వస్తువులను అక్టోబరు 28న లండన్‌లో వేలం వేయగా వీటికి రూ.533.79కోట్లు వచ్చాయి. నాలుగు ఖండాల నుంచి 20దేశాలకు చెందిన వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. సద్రుద్దీన్ ఖాన్ 1933లో ఫ్రాన్స్‌లో జన్మించారు. 1960-80మధ్య కాలంలో మొఘలులు, తురుష్కులు ఇతర రాజవంశాలకు చెందిన పురాతన వస్తువులను సేకరించారు. ఇవన్నీ స్విట్జర్లాండ్‌లోని వారి ఇంట్లో ఉన్నాయి. కాగా, ఇండియాకు సంబంధించి ఎంఎఫ్ హుస్సేన్ గీసిన గ్రామ్ యాత్ర చిత్రాన్ని గత మార్చిలో న్యూయార్క్‌లో వేలం వేయగా రూ.122కోట్లకు అమ్ముడుపోయింది. దీని తర్వాత అత్యంత ఖరీదైన పెయింటింగ్‌గా బాసవాన్ గీసిన 'చిరుత కుటుంబం' చిత్రం రికార్డులకెక్కింది.

# అమ్మో.. నకిలీ బొమ్మ!

(సెంట్రల్ డెస్క్)



గుర్తుందా.. 2023లో హీరోయిన్ రష్మిక మందన్నా ఒక లిఫ్ట్‌లో ఎక్కుతున్న వీడియో వైరల్ అయ్యింది! చాలా మంది ఆ వీడియోలో కనిపిస్తున్నది నిజంగా రష్మికాయేనని నమ్మారు!! తీరా చూస్తే అది డీప్ ఫేక్ వీడియో అని, ఏఐతో తయారుచేశారని తేలింది!! మనదేశంలో ఒక సెలబ్రిటీ డీప్ ఫేక్ వీడియో అంతలా వైరలవడం తొలిసారి. ఆ తర్వాత ఎంతో మంది సెలబ్రిటీల వీడియోలు అలా వైరల్ అయ్యాయి! ఇప్పుడు సెలబ్రిటీలవే కాదు.. సోషల్ మీడియాలో మామూలు అమ్మాయిలు పోస్ట్ చేసే ఫొటోలను తీసుకుని.. వాటిసాయంతో అశ్లీల డీప్ ఫేక్ వీడియోలు సృష్టిస్తున్న ఘటనలు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి! "నీ ముగ్గురు అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర ఏఐ వీడియోలను సోషల్ మీడియాలో పెట్టకుండా ఉండాలంటే డబ్బు చెల్లించు" అంటూ సైబర్ నేరగాళ్ల హెచ్చరికలకు భయపడి.. హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనే ఇందుకు తాజా ఉదాహరణ! ఛత్తీస్‌గఢ్ రాజధాని నయారాయ్‌పూర్‌లోని ట్రిపుల్ ఐటీలో 'ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్' మూడో సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి.. ఏఐ సాయంతో తన క్లాస్‌మేట్లలో ఏకంగా 36 మంది అమ్మాయిల అశ్లీల చిత్రాలు, వీడియోలను రూపొందించి పోలీసులకు దొరికిపోయాడు. అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ డివైజ్‌లను తనిఖీ చేసిన పోలీసులు.. అలాంటి ఫొటోలు, వీడియోలు 1000కి పైగా ఉండడం చూసి నివ్వెరపోయారు! వ్యక్తిగత వీడియోల సంగతి పక్కనపెడితే.. రాజకీయ నాయకులు, సెలబ్రిటీల ఫేక్ వీడియోలు ఇటీవలికాలంలో ఏ స్థాయిలో వైరల్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఒక ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ప్రమోట్ చేస్తున్నట్టుగా రూపొందించిన ఫేక్ వీడియో ఇటీవల వైరలైంది. జనరేటివ్ ఏఐ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని ఈ దశలోనే ఈ స్థాయిలో ఫేక్ చిత్రాలు, వీడియోలు వైరల్ అవుతున్నాయంటే.. కృత్రిమ మేధ అభివృద్ధి చెందేకొద్దీ పరిస్థితి మరెంత ప్రమాదకరంగా తయారవుతుందోనన్న ఆందోళన పెరుగుతోంది. ఇప్పుడు రూపొందిస్తున్న ఏఐ వీడియోలను జాగ్రత్తగా పరిశీలిస్తే అవి కృత్రిమ మేధ సాయంతో తయారుచేసినవనే విషయం అర్థమైపోతుంది. అసహజ నీడలు, కదలికలు.. అవి ఫేక్ వీడియోలనే విషయాన్ని ఇట్టే పట్టిచ్చేస్తాయి. కానీ, ఏఐ టెక్నాలజీ అభివృద్ధి చెందేకొద్దీ అలాంటి అసహజ కదలికలు, నీడలు లేకుండా వీడియోలు తయారుచేసే ప్రమాదం ఉంది. గూగుల్ సంస్థ తాను అభివృద్ధి చేస్తున్న 'వియో' అనే ఏఐ వీడియో మోడల్ వివరాలను 2024 డిసెంబరులో ప్రపంచానికి పరిచయం చేసింది. దాని సాయంతో రూపొందించే చిత్రాలు, వీడియోలు వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంటున్నాయి. ఇదే వేగంతో ఏఐ అభివృద్ధి చెందితే.. గరిష్ఠంగా ఏడాది-రెండేళ్లలోనే ఏది ఏఐ వీడియోనో, ఏది నిజమైనదో చెప్పడం నిపుణులకు తప్ప సాధారణ ప్రజలకు కష్టమవుతుంది!!

### పిల్లలనూ వదలట్లేదు..

తమను నిరాకరించిన అమ్మాయిలపై పగతీర్చుకోవడానికి కొందరు ఈ టెక్నాలజీని వాడుతుంటే.. పిల్లలను శృంగారదృష్టితో చూసే వికృత మనస్కులు కూడా ఏఐ సాయంతో అలాంటి వీడియోలను రూపొందిస్తుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నిజానికి జనరేటివ్ ఏఐ టెక్నాలజీని వాడేవారు దాంతో అశ్లీల కంటెంట్‌ను సృష్టించకుండా ఉండడానికి.. ఏఐ సంస్థలు పలు రక్షణ చర్యలు తీసుకుంటున్నాయి. వాటిని క్లాసిఫయర్స్ అంటారు. అవి రెండు రకాలు.. ఒకటి ఇన్‌పుట్ క్లాసిఫయర్స్, రెండు అవుట్‌పుట్ క్లాసిఫయర్స్. ఇన్‌పుట్ క్లాసిఫయర్లు.. వీడియో కంటెంట్‌ను రూపొందించడానికి వినియోగదారులు ఇచ్చే ప్రాంప్ట్‌లను తనిఖీ చేస్తాయి. అనుచితమైన ప్రాంప్ట్‌లు (హింస, శృంగారానికి సంబంధించినవి) ఉంటే వాటిని బ్లాక్ చేస్తాయి. అలాంటి కంటెంట్ జనరేట్ చేయడం తప్పని చెబుతాయి. ఇక.. వినియోగదారులు ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా తయారైన చిత్రాలు/వీడియోలు సురక్షితంగా ఉన్నాయా లేవా అని తనిఖీ చేసే బాధ్యత అవుట్‌పుట్ క్లాసిఫయర్లది. జనరేటివ్ ఏఐను అభివృద్ధి చేస్తున్న ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఇన్ని రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసినా.. వాటిలో ఉండే చిన్నచిన్న లోపాలను ఆధారంగా చేసుకుని చాలామంది అశ్లీల కంటెంట్‌ను తయారుచేస్తున్నారు. 2024లో.. ప్రఖ్యాత అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్ చిత్రాలను ప్రముఖ జనరేటివ్ ఏఐ మోడళ్లతోనే అశ్లీలంగా మార్చడం ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలో.. జనరేటివ్ ఏఐని అభివృద్ధి చేస్తున్న కంపెనీలు దీనిపై దృష్టి సారించాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. ఆయా కంపెనీలు తమ ఏఐ మోడళ్లను అనుమతి పొందిన వ్యక్తులకు, వ్యాపారసంస్థలకు మాత్రమే షరతులతో అందుబాటులోకి తేవాలని, ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించేలా చూడాలని వారు చెబుతున్నారు.


### కఠిన చట్టాల దిశగా..

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఈ సమస్యకు చెక్ పెట్టే సమర్థమైన, కఠిన చట్టాలు ఏవీ ప్రస్తుతం లేవు. ఈ నేపథ్యంలోనే పలు దేశాల ప్రభుత్వాలు ఆ దిశగా దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం కూడా.. "ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనలు (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్), 2021" చట్టానికి పలు సవరణలను ప్రతిపాదించింది. నకిలీ కంటెంట్‌ను సులువుగా గుర్తించేందుకు వీలుగా లేబులింగ్, మార్కింగ్‌ను తప్పనిసరి చేసింది. అంటే.. ఏఐ జనరేటెడ్ వీడియోలు, చిత్రాలపై ఆ విషయం తెలిసేలా మార్కింగ్ చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఉంటుంది. అందుకోసం ఆయా ప్లాట్‌ఫామ్‌లు.. సదరు కంటెంట్‌ను అప్‌లోడ్ చేసిన వినియోగదారుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. వీడియోలైతే.. తెరమీద 10 శాతం స్థలం ఆక్రమించేలా, ఆడియోలైతే మొదట్లో 10% సమయం.. అది సింథటిక్ కంటెంట్ అని తెలిసేలా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. ఏఐ కంటెంట్ సోర్స్ తెలిపేలా మెటా డేటాను ఎంబెడ్ చేయాలి (దీనివల్ల... ఏవైనా అనుచిత వీడియోలు వైరల్ అయినప్పుడు దర్యాప్తు సంస్థలకు దాని మూలం త్వరగా తెలుసుకునే వీలుంటుంది). సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలపై ఉన్న ఏదైనా కంటెంట్ చట్టవిరుద్ధమనదైతే.. న్యాయస్థానాలు దాన్ని తొలగించాలంటూ ఆదేశించినా, ప్రభుత్వం ఆదేశించినా సత్వరమే (ఆదేశాలు అందిన 36 గంటల్లోపు) దాన్ని తొలగించాలి.

### ఈ సమస్యలకు పరిష్కారమేదీ?

అనుచిత ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించడానికి ప్రభుత్వాలు చేసిన చట్టాలు సోషల్ మీడియాకు వర్తిస్తాయి కాబట్టి.. అవి అలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగిస్తాయి. అలా కాకుండా.. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్స్ ద్వారా వైరల్ చేస్తే అప్పుడేం చేయాలనే ప్రశ్నకు సమాధానం లేదు. ఇక.. సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలపై నిత్యం సెకనుకు కొన్ని వేల లక్షల వీడియోలు, చిత్రాలు అప్‌లోడ్ అవుతుంటాయి. వాటన్నింటినీ పరిశీలించి.. అందులో ఏఐ కంటెంట్ ఏదో, మామూలుదేదో గుర్తించే వ్యవస్థ.. దానికి లేబులింగ్, మార్కింగ్ ఉందా లేదా గుర్తించే వ్యవస్థ.. సామాజిక మాధ్యమాల వద్ద ప్రస్తుతానికి లేదు. వాటిని గుర్తించడం ఏఐ టూల్స్‌కు కూడా కష్టం. అంతేకాదు.. ఉద్దేశపూర్వకంగా సింథటిక్ కంటెంట్‌ను సృష్టించేవారు, డిక్లరేషన్ కూడా తప్పుగా సమర్పిస్తే? దాన్ని గుర్తించడానికి సామాజిక మాధ్యమాలు అత్యంత అధునాతనమైన ఆటోమేటెడ్ టూల్స్‌ను వినియోగించాల్సి వస్తుంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని. మరి ఈ సమస్యలను ప్రభుత్వం ఎలా అధిగమిస్తుందో చూడాలి.

## లోకం తీరు




## 3వ తరగతి నుంచే 'ఏఐ' పాఠాలు!

» వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: దేశ విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. మారుతున్న టెక్నాలజీ యుగంలో కృత్రిమ మేధ(ఏఐ) పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి నుంచే పాఠ్యాంశాల్లో 'ఏఐ'ను చేర్చనున్నట్లు కేంద్ర విద్యా శాఖ ప్రకటించింది. విద్యార్థులకు పునాది స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం వెనుక ముఖ్య ఉద్దేశం.. 'ఏఐ అనేది ఒకటి ఉంది' అని, ఆ ఆధునిక సాంకేతికను నేటి రోజువారీ జీవితంలో ఎలా ఉపయోగిస్తున్నారనే విషయాలను పిల్లలకు తెలియజేయడమని పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగానికి (డీవోఎస్ఈఎల్) చెందిన సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దీనిపై డీవోఎస్ఈఎల్.. సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) ప్రతినిధులు, ఇతర విద్యా రంగ నిపుణులతో చర్చలు జరిపింది. కృత్రిమ మేధ(ఏఐ), కంప్యూటేషనల్ థింకింగ్(సీటీ) కరిక్యులమ్‌ను అభివృద్ధి చేసేందుకు సీబీఎస్ఈ ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ కార్తీక్ రామన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది డిసెంబరు నాటికి వనరుల మెటీరియల్స్, హ్యాండ్‌బుక్‌లు, డిజిటల్ వనరుల అభివృద్ధి పూర్తవుతుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. మొదట అసలు ఏఐ అంటే ఏంటి? అనే దానిపై పిల్లలకు అవగాహన కల్పిస్తామని పాఠశాల విద్యా విభాగం అధికారి పేర్కొన్నారు. ఆ తర్వాత విద్యార్థులు పైతరగతులకు వెళ్లే కొద్దీ.. క్రమంగా సంబంధిత కాన్సెప్ట్‌లు నేర్చుకుంటారని, 11, 12 తరగతుల నాటికి ఎంపిక సబ్జెక్టులుగా చదువుకుంటారని వివరించారు.

## పాక్ పీఎల్-15లకు దీటుగా మిటియోర్ క్షిపణులు!

» యూరోపియన్ మిసైల్ కొనుగోలు యోచనలో భారత్

న్యూఢిల్లీ, అక్టోబరు 31: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకునే దిశగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే తమ ప్రధాన యుద్ధ విమానమైన రఫేల్ కోసం భారీ సంఖ్యలో మిటియోర్ క్షిపణులను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా నుంచి కొనుగోలు చేసిన పీఎల్-15 క్షిపణులతో పాకిస్థాన్ మన యుద్ధ విమానాలపై దాడికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో పీఎల్-15లకు దీటుగా బదులిచ్చేందుకు, ఎప్పటి నుంచో కొనుగోలు చేయాలని అనుకుంటున్న మిటియోర్ మిస్సైల్స్‌ను రంగంలోకి దించాలని భారత్ నిర్ణయించింది. గగనతలంలోని టార్గెట్లపై ప్రయోగించే ఈ క్షిపణులు 200 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలవు. భారత వైమానిక దళం వద్ద ప్రస్తుతం ఉన్న యుద్ధ విమానాల్లో రఫేల్ ఒక్కటే ఈ మిటియోర్ క్షిపణులను ప్రయోగించగలదు. యూరోపియన్ సంస్థ ఎండీఎంఏ తయారు చేసిన మిటియోర్ క్షిపణులను కొనుగోలు చేయడానికి రూ.1500 కోట్ల విలువైన ప్రతిపాదనలు రక్షణ మంత్రిత్వ శాఖ వద్ద చర్చల దశలో ఉన్నాయని, త్వరలో జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. మరోవైపు, భారత్‌లో రఫేల్ యుద్ధ విమానాల తయారీపై ఫ్రాన్స్ ఆసక్తి చూపిస్తోందని ఆ దేశ రాయబారి థియరీ మాథౌ వెల్లడించారు. ఓ చర్చాకార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రఫేల్‌పై మరో కొత్త ఒప్పందానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మా పరిశ్రమ పూర్తిగా భారత్‌లో తయారీ చేపట్టే ఆలోచనలో ఉందని నేను స్పష్టం చేస్తున్నాను. డసాల్ట్ ఏవియేషన్ సంస్థ దీనిపై త్వరలోనే భారత్‌తో చర్చిస్తుందని అనుకుంటున్నా' అని ఆయన పేర్కొన్నారు.

# మరో పదేళ్ల రక్షణ బంధం

## భారత్-అమెరికా కీలక ఒప్పందం.. ఇరుదేశాల రక్షణమంత్రుల సంతకాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: భారత్-అమెరికా రక్షణ బంధంలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. కీలకమైన రక్షణరంగంలో వచ్చే పదేళ్లపాటు ఇరుదేశాల సహకారానికి సంబంధించిన ఒప్పందం కుదిరింది. దీనిపై ఇరుదేశాల రక్షణమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, పీట్ హెగ్‌సెత్ శుక్రవారం కౌలాలంపూర్‌లో సంతకాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన భారీ సుంకాలతో ఇరుదేశాల సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్న తరుణంలో ఈ ఒప్పందం.. అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు కీలక అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు. 2015లో కుదిరిన భారత్-అమెరికా రక్షణ ఒప్పందం పదేళ్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో.. దాని పునరుద్ధరణ కోసం రాజ్‌నాథ్, హెగ్‌సెత్ సమావేశమయ్యారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఏషియాన్ ప్లస్ (ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య, భాగస్వామ్య దేశాల) రక్షణ మంత్రుల సమావేశం దీనికి వేదికగా నిలిచింది. ఒప్పందంపై రాజ్‌నాథ్‌సింగ్ స్పందిస్తూ.. 'భారత్-అమెరికా రక్షణ సహకారానికి ప్రస్తుత ఒప్పందం విధానపరమైన సమగ్ర దిశానిర్దేశం చేయనుంది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిబంధనలతో కూడిన ఇండో పసిఫిక్‌కు భారత్-అమెరికా సహకారం ఎంతో ముఖ్యమైనది' అని పేర్కొన్నారు. పీట్ హెగ్‌సెత్ స్పందిస్తూ.. తాజా ఒప్పందంతో ఇరుదేశాల రక్షణ బంధం మునుపెన్నడూ లేనంత బలోపేతమైందని, ప్రాంతీయ స్థిరత్వానికి, సవాళ్లను ఎదుర్కోవటానికి ఇది ఒక మైలురాయి వంటిదని కొనియాడారు. భారత రక్షణరంగ సంస్థ హెచ్‌ఏఎల్, అమెరికా కంపెనీ జీఈ ఏరోస్పేస్ సంయుక్తంగా ఎఫ్-414 యుద్ధవిమానాల ఇంజన్లను భారత్‌లో తయారుచేయటంపైనా చర్చలు జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, మలేసియా రక్షణమంత్రి మహమ్మద్ ఖాలెద్ నోర్దిన్‌తోనూ రాజ్‌నాథ్‌సింగ్ విడిగా సమావేశమై చర్చలు జరిపారు.



ఒప్పందంపై సంతకం చేస్తున్న హెగ్‌సెత్, రాజ్‌నాథ్

### పదేళ్ల ప్రస్థానంలో బంధం పటిష్ఠం

భారత్‌ను ప్రధాన రక్షణరంగ భాగస్వామిగా అమెరికా గుర్తించటంతో పదేళ్ల కిందట ఇరుదేశాల మధ్య రక్షణ ఒప్పందం కుదిరింది. దీంట్లో భాగంగా అమెరికా నుంచి భారత్‌కు సైనికపరమైన సామగ్రి, టెక్నాలజీ బదిలీ సులువైంది. గత కొన్నేళ్లలో ఇరుదేశాలు మరిన్ని సైనిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. మరమ్మతులకు, సరఫరాలకు ఉభయ దేశాల సైనిక స్థావరాలను పరస్పరం ఉపయోగించుకోవటానికి వీలు కల్పించే 'లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్' 2016లో కుదిరింది. ఇరుదేశాల సైన్యాల మధ్య సమన్వయంతోపాటు భారత్‌కు ఉన్నతస్థాయి మిలిటరీ టెక్నాలజీని అమెరికా కంపెనీలు విక్రయించటానికి వీలు కల్పించే 'కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్' 2018లో కుదిరింది. భౌగోళిక సమాచారం తాలూకు పటాలను ఇచ్చిపుచ్చుకోవటం, రవాణాకు పరస్పరం సహకరించుకోవటం లక్ష్యంగా 2020లో 'బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్' కుదిరింది.

### యువ అమెరికన్ల కలలు భగ్నం!

» హెచ్-1బీ వీసాల దుర్వినియోగంతో భారతీయులకే ఎక్కువ లబ్ధి

» 'ఎక్స్'లో అమెరికా కార్మిక శాఖ యాడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 31: హెచ్-1బీ వీసాను దుర్వినియోగం చేయడం ద్వారా అమెరికాలో కంపెనీలు స్థానిక యువతకు బదులు విదేశీ కార్మికులతో ఉద్యోగాలను భర్తీ చేశాయని ఆ దేశ కార్మిక శాఖ ఆరోపించింది. ఇందులో భారతీయులే అత్యధికంగా లబ్ధి పొందారంటూ తన అక్కసును వెళ్లగక్కింది. ఈ మేరకు 51 సెకన్ల నిడివితో రూపొందించిన వీడియో యాడ్‌ను తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేసింది. 'హెచ్-1బీ వీసాను దుర్వినియోగం చేసి, విదేశీ కార్మికులను ఉద్యోగాల్లో నియమించుకొని యువ అమెరికన్ల అమెరికా కలను భగ్నం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, కార్మిక మంత్రి లోరీ చావెజ్-డిరెమర్ నాయకత్వంలో ప్రాజెక్ట్ ఫైర్‌వాల్ ద్వారా వీసా దుర్వినియోగానికి కంపెనీలను బాధ్యుల్ని చేస్తున్నాం. నియామకాల్లో అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్థానిక యువత తమ అమెరికా కలను తిరిగి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఆ యాడ్‌లో కార్మిక శాఖ పేర్కొంది. అందులో పొందుపరిచిన గ్రాఫ్ ప్రకారం... హెచ్-1బీ వీసాల్లో 72% భారతీయులకు, చైనాకు 12శాతం, ఇతరులకు 14 శాతం దక్కుతున్నాయి.

# కోటి ఉద్యోగాలు..

» పీఎం-కిసాన్ సాయం రూ.3 వేలు పెంపు

» బిహార్ కోసం ఎన్డీయే మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నితీశ్, జేపీ నడ్డా

పట్నా, అక్టోబరు 31 : బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం అధికార ఎన్డీయే కూటమి ఎన్నికల మేనిఫెస్టోను చేసింది. బిహార్ యువతకు కోటి ఉద్యోగాలను హామీ ఇవ్వడంతోపాటు, కోటి మంది మహిళలను లక్షాధికారులను చేస్తామంటూ లఖ్‌పతిదీదీ పథకాన్ని కొత్తగా ప్రకటించారు. ఉచిత విద్యను వాగ్దానం చేశారు. 'సంకల్ప పత్ర్' పేరిట రూపొందించిన ఈ మేనిఫెస్టోను పట్నాలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం నితీశ్‌కుమార్, హమ్(ఎస్) నేత, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, ఎల్‌జేపీ (రామ్ విలాస్) నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్, ఆర్‌ఎల్‌ఎమ్ నేత ఉపేంద్ర కుష్వాహా తదితర ఎన్డీయే భాగస్వామ్య పక్ష నేతలు ఆవిష్కరించారు. జిల్లాకు ఒక మెగా స్కిల్ సెంటరు చొప్పున ఏర్పాటుచేసి ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పని చేయడానికి తగ్గినట్టు యువతకు శిక్షణ ఇప్పిస్తామని, బిహార్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మలుస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ముఖ్యమంత్రి రోజ్‌గార్ యోజన పథకాన్ని మహిళల కోసం ప్రకటించారు. వ్యాపారాలు చేసుకోవడానికి ప్రతి మహిళకు ఈ పథకం కింద రూ.రెండు లక్షలు ప్రభుత్వ సాయం అందిస్తామని తెలిపారు. ఏటా రూ.లక్ష సంపాదించే కనీసం కోటిమంది మహిళలను తయారుచేయడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. బాగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీలు) రూ.10 లక్షల ప్రభుత్వ సాయం అందించడంతోపాటు ఈ వర్గాల ఆర్థిక, సామాజిక వాస్తవ స్థితి అధ్యయనానికి సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తితో ఒక కమిటీని నియమిస్తామని తెలిపారు. రైతుల కోసం కొత్తగా కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించారు. దీని కింద పంట సీజన్‌లో రైతు కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని పెంచుతూ, రూ.3 వేలు అదనంగా అందిస్తామని హామీ ఇచ్చారు. మూడు విడతల్లో రూ.9వేలు ఇస్తామని తెలిపారు. పేదల కోసం ఐదు గ్యారంటీలను ప్రతిపాదించారు. ఉచిత రేషన్.. 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్... రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం.. పక్కా గృహ నిర్మాణానికి రూ.యాభై వేలు సాయం.. అర్హులైన కుటుంబాలకు సామాజిక పింఛన్లను హామీ ఇచ్చారు. ఈ హామీలన్నీ నెరవేర్చాలంటే రూ. 36,892 కోట్లు అదనంగా వార్షిక బడ్జెట్‌లో పెట్టాల్సి ఉంటుందని అంచనా.

## ఈ సీజన్‌లో 46 లక్షల వివాహాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: దేశ వ్యాప్తంగా శనివారం(నవంబరు 1) నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం అవుతోంది. సుమారు 45 రోజుల పాటు ఉండే ఈ సీజన్‌లో 46లక్షల వివాహాలు జరుగుతాయని, ఇందుకోసం రూ.6.5 లక్షల కోట్ల మేరకు లావాదేవీలు జరిగే అవకాశం ఉందని.. తద్వారా కోటి మందికిపైగా ఉపాధి లభించవచ్చని అఖిల భారత వాణిజ్య మండలి(సీఏఐటీ) ఆధ్వర్యంలోని సీఆర్‌టీడీఎస్ అధ్యయనం వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో 48లక్షల వివాహాలు అయినట్లు తెలిపింది. దీని కోసం రూ.5.9లక్షల లావాదేవీలు జరిగినట్లు వివరించింది. వివాహాల సందర్భంగా ఈ ఏడాది స్వదేశీ వస్తు వినియోగం 70శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ చెప్పారు. 'వోకల్ ఫర్ లోకల్ వెడ్డింగ్స్' ప్రచారం జోరుగా సాగుతోందన్న ఆయన.. దీనివల్ల లైటింగ్, కృత్రిమ అలంకరణ వస్తువులు, బహుమతులు వంటివి దేశీయంగానే తయారు కానున్నాయని వివరించారు. ఆడంబరంగా జరిగే వివాహాలతో బంగారం, వెండి ధరలు కూడా పెరుగుతున్నాయన్నారు.

## మైనార్టీలకు ఉచిత టెట్ కోచింగ్

» మంత్రి ఫరూక్

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించబోయే టెట్ పరీక్షకు హాజరయ్యే మైనార్టీ యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీస్(సీఈడీఎం) ద్వారా మైనార్టీలకు ఉచిత కోచింగ్ అందిస్తామని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు మొదటి వారం నుంచి తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టెట్ పరీక్ష కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోచింగ్ అందిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని మైనార్టీ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. తమ వివరాలను సీఈడీఎం వెబ్ సైట్ www.apcedmmwd.org లో నమోదు చేసుకోవాలని.. మరింత సమాచారం కోసం 0866-2970567, 7386789966 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



# పసిఫిక్ మహా సముద్రంలో లానినా

## ఫిబ్రవరి వరకూ కొనసాగే అవకాశం

» నవంబరులో రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

» 4 అల్పపీడనాలతో అక్టోబరులో 49 శాతం అధిక వర్షపాతం

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా సముద్రంలోని తూర్పు, మధ్య, భూమధ్య రేఖకు అనుకుని ఉన్న ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా (ఉపరితల ఉష్ణోగ్రతలు చల్లగా ఉంటాయి) నమోదవుతున్నాయి. ఈ ఏడాది మే వరకు పసిఫిక్ మహాసముద్రంలో లానినా కొనసాగింది. అనంతరం తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. అయితే తటస్థ పరిస్థితుల తర్వాత తిరిగి ఎల్‌నినో వైపుగా వాతావరణం మారుతుందని తొలుత అంచనా వేశారు. అయితే అనూహ్య మార్పులతో ఈ ఏడాది సెప్టెంబరు నుంచి బలహీనమైన లానినా వస్తోందని వాతావరణ నిపుణులు చెబుతూ వస్తున్నారు. దీనికి అనుగుణంగానే అక్టోబరులో పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర శుక్రవారం వెల్లడించారు.వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ లానినా కొనసాగుతుందని, ఆ తర్వాత తటస్థ పరిస్థితులు ఏర్పడేందుకు 55 శాతం అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సాధారణంగా లానినా ఏర్పడేటప్పుడు భారత్ సహా అనేక దేశాల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. లానినా కారణంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడు, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తుంటాయి. నవంబరులో ఈ ఐదు ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెలలో ఐదు ప్రాంతాల్లో 118.7 మి.మీ. వర్షపాతం కురవాలి. అయితే తమిళనాడు, కోస్తాంధ్రలోని దక్షిణ ప్రాంతంలో మాత్రం సాధారణ వర్షపాతం కంటే తక్కువగా కురుస్తుందని శుక్రవారం విడుదల చేసిన బులెటిన్‌లో ఐఎండీ పేర్కొంది. ఏపీలో ఎక్కువ ప్రాంతాలతో సహా దేశంలో చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయి. అక్టోబరు నెలలో సా. దారణం కంటే 49% ఎక్కువ వర్షపాతం కురిసింది. ఏపీలో అక్టోబరు 1 నుంచి శుక్రవారం వరకు 161.5 మి.మీ.కు గాను 294.1 మి.మీ.ల (సాధారణం కంటే 82% ఎక్కువ) వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లాలో 140, నెల్లూరులో 131, విజయనగరంలో 124, పల్నాడులో 119, గుంటూరులో 109% ఎక్కువ వర్షపాతం నమోదైంది.

### రెండు రోజుల్లో అల్పపీడనం

» బంగ్లాదేశ్ వైపే ప్రభావం

» నేడు పిడుగులతో కూడిన వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్‌లో గురువారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శుక్రవారానికి ఉత్తర అండమాన్ సముద్రం, దక్షిణ మయన్మార్ పరిసరాల్లో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది మరింత బలపడి మయన్మార్, బంగ్లాదేశ్ వైపు పయనించే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే మూడు రోజుల్లో బంగాళాఖాతం మీదుగా తూర్పుగాలులు తమిళనాడు, కోస్తాంధ్ర దిశగా వీయనున్నాయని, దీంతో వర్షాలు పడతాయన్నారు. శుక్రవారం రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజులు కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.


అనకాపల్లి జిల్లా మునగపాకలో వరదనీటి మధ్య జరిగిన వివాహ వేడుక


ఉధృతంగా పారుతున్న కంభం చెరువు అలుగు

## పెళ్లి మండపాన్ని తాకిన వరద నీరు

మునగపాక, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వరద నీరు పెళ్లి మండపాన్ని తాకింది. అనకాపల్లి జిల్లా మునగపాకలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి సంతబయలు ప్రాంతంలోని వినాయక మందిరం ప్రాంగణంలో శుక్రవారం తెల్లవారుజామున సూరిశెట్టి వెంకట్, కావ్య వివాహం జరగాల్సి ఉంది. గురువారం సాయంత్రం వేడుకలు మొదలయ్యాయి. రాత్రి 11 గంటలకు విందు పూర్తయ్యాక అందరూ ఇళ్లకు వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు ముహూర్తం. మూడు గంటలకు వధూవరులతో పాటు ఇరు కుటుంబాలు, బంధువులు ముస్తాబై మండపం వద్దకు వచ్చారు. ఆ సమయానికి పక్కనున్న కాలువ నీరు మండపం చుట్టూ చేరడం చూసి అవాక్కయ్యారు. అయితే కల్యాణ వేదికకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకపోవడంతో ముహూర్త సమయానికి వివాహం జరిపించారు.

## నిండుకుండలా కంభం చెరువు

కంభం,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఆసియా ఖండంలోనే రెండో అతి పెద్దదైన ప్రకాశం జిల్లాలోని కంభం చెరువు ఐదేళ్ల తర్వాత పూర్తిగా నిండింది. చెరువు సామర్థ్యం 39 అడుగులు కాగా ప్రస్తుతం 18 అడుగుల మేర పూడిక పేరుకుపోయింది. మిగిలిన 21 అడుగుల మేర నీరు చేరింది. 20 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా చెరువు అలుగుపై 3అడుగుల మేర నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

## 'శ్రీవాణి' ద్వారా రాష్ట్రంలో 5 వేల ఆలయాల నిర్మాణం

» రూ.750 కోట్లు కేటాయిస్తూ టీటీడీ తీర్మానం

» తొలి విడతలో రూ.187 కోట్లు జారీ: ఈవో

తిరుమల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల ఆలయాలను నిర్మించనున్నట్టు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఇందుకోసం రూ.750 కోట్లు కేటాయిస్తూ టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని చెప్పారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో శుక్రవారం జరిగిన ఆయుధపూజలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆలయాల నిర్మాణానికి తొలి విడతగా రాష్ట్ర దేవదాయ శాఖకు రూ.187 కోట్లు విడుదల చేయనున్నట్టు వివరించారు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో అందుబాటులో ఉన్న స్థలం ఆధారంగా ఆలయం నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలు వంతున మూడు కేటగిరీల్లో కేటాయింపులు ఉంటాయని వెల్లడించారు. ఆలయాల నిర్మాణానికి గ్రామాల ఎంపిక, స్థల ఎంపిక, నిర్మాణ సంస్థల గుర్తింపు, వారితో ఎంవోయూ వంటివి దేవదాయ శాఖ ద్వారా జరుగుతాయన్నారు. నిర్మాణానికి సంస్థలు ముందుకు రాని చోట గ్రామ కమిటీల ద్వారా పనులు చేపడతారని చెప్పారు. కాగా టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టులో ప్రస్తుతం రూ.2,300 కోట్ల నిధులు ఉన్నాయని, దీనిపై వచ్చే వడ్డీతోనే భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నట్టు ఈవో వివరించారు.

# ఉల్లి డబ్బులేవీ?!

» చెల్లించాల్సింది రూ.17 కోట్లు.. ఇప్పటికి ఇచ్చింది 2.11 కోట్లే

» 2 నెలలుగా రైతుల నిరీక్షణ

» మార్క్‌ఫెడ్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

కర్నూలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లికి సంబంధించిన డబ్బుల కోసం రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. సరుకు విక్రయించి రెండు నెలలు కావస్తున్నా ఇంకా ఖాతాల్లో సొమ్ములు జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలకు ఉల్లి దెబ్బతిని దిగుబడి భారీగా తగ్గిపోయింది. రైతుల కష్టాలను 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీంతో సీఎం చంద్రబాబు సారథ్యంలోకి కూటమి ప్రభుత్వం స్పందించి ఉల్లి క్వింటా మద్దతు ధర రూ.1,200 ప్రకటించడమే కాకుండా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆగస్టు 31 నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ నేరుగా ఉల్లి కొనుగోలు చేసింది. మార్క్‌ఫెడ్, లైసెన్స్‌డ్ వ్యాపారులు కలిసి 2,800 మంది రైతుల నుంచి దాదాపు 1.55 లక్షల క్వింటాళ్ల ఉల్లి సేకరించారు. దీనికి గాను రైతులకు రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. వారం, పది రోజుల్లోగా ఖాతాలో జమ చేస్తామని రైతులకు మార్క్‌ఫెడ్ అధికారులు భరోసా ఇచ్చారు. ఉల్లి అమ్మకాలు చేసిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఈ-క్రాప్ జిరాక్స్ కాపీలు తీసుకున్నారు. అయితే 2నెలలు కావస్తున్నా నేటికీ రైతులకు డబ్బులు చెల్లించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. కేవలం 350మందికి రూ.2.11 కోట్లు జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఇంకా 2,445 మంది రైతులకు రూ.14.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉల్లి డబ్బు బకాయిలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కాగా, మెజార్టీ రైతులకు ఏపీజీబీ ఖాతాలు ఉన్నాయని, గ్రామీణ బ్యాంకులు వీలినం కారణంగా కొత్త బ్యాంకు ఖతాలు రావడంతో ఈ సమస్య తలెత్తిందని, త్వరలోనే రైతుల ఖాతాలో నిధులు జమ చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు పేర్కొన్నారు.


ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు (ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# నిర్దోషికి న్యాయం..!

చేయని నేరానికి శిక్ష అనుభవించినవారికి నష్టపరిహారం అందించాలన్న సుప్రీంకోర్టు ఆలోచనను మెచ్చవలసిందే. తప్పుడు సాక్ష్యాలతో, అభియోగాలతో శిక్షపడిన వ్యక్తికి జరిగిన నష్టాన్ని ఎంతోకొంత భర్తీ చేయడం అవసరమే. పరిహారం చెల్లించడం అంటే, కాస్తంత న్యాయం చేయాలని ప్రయత్నించడమే కాదు, పాపం చేశామనీ, పొరపాటు జరిగిందనీ ఒప్పుకోవడం కూడా. అనంతరకాలంలో నిర్దోషిగా బయటకు వచ్చిన బాధితుడికి జైలులో అతడు కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణించి, గణించాలన్నది సముచితమైన ప్రతిపాదన. బాధితుడికి ఆర్థికంగా ఒరిగేదానికంటే, వ్యవస్థలన్నీ కలసికట్టుగా చేసిన తప్పును ఈ రూపంలో ఒప్పుకోవడం మరింత ఉపశమనం కల్పిస్తుంది.

బలహీనులు, నిస్సహాయుల మీద పెద్దలు కక్షకట్టి తప్పుడు కేసుల్లో ఇరికించడం, ప్రశ్నించేవారిని పాలకులు జైళ్లలోకి నెట్టడం ఈ దేశంలో అనాదిగా జరుగుతున్నదే. పేదల విషయంలో అంత సత్వరంగా స్పందించని న్యాయస్థానాలు రాజకీయ, సినీరంగప్రముఖులు ఇమిడివున్న కేసుల్లో తక్షణ న్యాయం అందించడం ఉన్నదే. న్యాయపీఠంమీద కూర్చున్న కోవిదులకు ఏవి తప్పుడు కేసులో తెలియకపోదు కూడా. ఒకానొక కేసు సుప్రీంకోర్టుకే మరీ అన్యాయంగా కనిపించినందున పరిహారం ప్రతిపాదన దానికి నచ్చినట్టు ఉంది. మహారాష్ట్రలో ఒక మైనర్‌పై అత్యాచారం చేసి, హత్యచేశాడన్న ఆరోపణమీద ఆరేళ్ళు జైల్లో మగ్గి, ఆ తరువాత, థానేకోర్టు ఉరిశిక్ష వేయడంతో మరో ఆరేళ్ళు ఆ భయం నీడలోనే సర్వోన్నతన్యాయస్థానంలో పోరాటం సాగించిన ఒక నిరుపేదను కోర్టు అంతిమంగా నిర్దోషిగా తేల్చింది. అతడిని ఈ కేసులో అక్రమంగా ఇరికించారని, దర్యాప్తు సక్రమంగా జరగలేదని న్యాయస్థానం నిర్ణయానికి వచ్చింది. తాను జైల్లో కోల్పోయిన జీవితాన్ని పరిగణనలోకి తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని ఆ బాధితుడు కోరుకున్నాడు. అన్యాయం జరిగినందున అతడు నష్టపరిహారానికి అర్హుడనీ, జైలు జీవితం అతని ప్రాథమిక హక్కులను కొల్లగొట్టిన వాస్తవాన్ని లెక్కలోకి తీసుకోవాలని అతని న్యాయవాది వాదించారు. ఒక వ్యక్తిని సుదీర్ఘకాలం జైల్లో మగ్గనిచ్చి, ఆ తరువాత కేవలం నిర్దోషి అని ప్రకటించడంతో వ్యవస్థ బాధ్యత తీరిపోదని సుప్రీంకోర్టు కూడా భావించింది. నిర్దోషి అని నిర్ధారించడంతో పాటుగా దోషాన్ని సరిదిద్దడం కూడా అవసరమనుకుంది. బాధితుడి అభ్యర్థన నెరవేర్చడానికి తదనుగుణమైన మార్గదర్శకాలు రూపొందించాలన్న న్యాయవాది వాదనతోనూ ఏకీభవించింది. అనేక సంక్లిష్టమైన అంశాలు, ప్రక్రియలూ ఇమిడివున్నందున ఈ అంశంపై ఒక నిర్ణయానికి రావడంలో సహకరించమని అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను న్యాయమూర్తులు కోరారు. దిగువ కోర్టులు ఏకంగా ఉరిశిక్షలు వేయడం మీద సుప్రీంకోర్టు పలుమార్లు అసహనాన్ని ప్రకటించడమే కాదు, ఇటీవలి కాలంలోనే అటువంటి కేసులు కొన్ని కొట్టివేసింది కూడా. ఆ సందర్భాల్లో పోలీసులనూ, ప్రాసిక్యూషన్‌నూ తప్పుబట్టడం కూడా చూశాం.

తప్పుడు అభియోగాలు, అరెస్టులు, శిక్షలనుంచి అమాయకులను రక్షించాలన్న తన ప్రయత్నానికి ప్రభుత్వం సహకరించాలని కోర్టు కోరుతోంది. పలుదేశాల్లో ఈ తరహా నష్టపరిహారాలు, తగిన నిబంధనలు ఉన్నందున ఈ దేశంలోనూ వాటిని పాలకులు తలుచుకుంటే అమలుచేయవచ్చును. కానీ, క్షమాపణలకు కూడా నోచుకోని అమాయకులకు ఏకంగా పరిహారాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు సిద్ధపడతాయనుకోలేం. సగంమంది శిక్షలు పడకుండానే జైల్లో మగ్గిపోతున్న దేశంలో ఇంత ఉదాత్తంగా వ్యవహారం సాగుతుందా అన్నది ప్రశ్న. క్రిమినల్ కేసుల్లో నిందితులు నిర్దోషులుగా తేలితే దర్యాప్తు అధికారులను బాధ్యులను చేయాలన్న పదేళ్ళనాటి సుప్రీంకోర్టు ఆదేశం వెంటనే అటకెక్కిపోయింది. అమాయకులపై తప్పుడు కేసులు పెట్టడం ద్వారా అసలు నిందితులను ఉద్దేశపూర్వకంగా వదిలేసిన అధికారులు నిజానికి తీవ్రమైన శిక్షలకు అర్హులు. దోషులు స్వేచ్ఛగా తిరుగుతూ మరింత తెగించేందుకు వీరి చర్య ఉపకరిస్తోంది, వారిని ప్రోత్సహిస్తోంది. నిర్దోషులైనవారు చీకటిగోడలమధ్య మగ్గిపోతూ ప్రాథమికహక్కులను కోల్పోవడమే కాదు, విలువైన కాలాన్నీ, పరువు మర్యాదలను కూడా నష్టపోతారు. ఇలా అక్రమ కేసుల్లో అన్యాయమైపోయినవారిని ఆదుకోవడానికి లా కమిషన్ 2018లోనే కొన్ని సూచనలు చేసింది. అలాగే, లోక్‌సభ ముందుకు ఒక ప్రైవేటు బిల్లు వచ్చి కూడా చివరకు మురిగిపోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండివుంటే భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్) లో ఇప్పటికే తదనుగుణమైన నిబంధనలు చేరివుండేవి. అక్రమ అరెస్టులమీదే మనుగడ సాగించే రాజకీయవ్యవస్థనుంచి సహకారం ఆశించడం వృథా.

---

# కులమతాల ఉచ్చుల్లో ‘విఫల రాష్ట్రం’

బిహార్ గురించి మాట్లాడడమూ లేదా రాయడమూ బాధాకరమైన విషయమే. స్వతంత్ర భారతదేశంలో బిహార్ కథ సంపూర్ణ నిర్లక్ష్యం, వ్యర్థ ప్రగల్భాల చరిత్రే. 1947లో భారతదేశ సమస్త రాష్ట్రాలు ఒకే ప్రారంభ స్థానంలో ఉన్నాయి. స్వాతంత్ర్య వేళ, లేదా భారత గణతంత్ర రాజ్యం ప్రభవించిన పొద్దులో తమను వెనుకనే వదిలివేసి స్వతంత్ర దేశం ముందుకు సాగిపోయిందని ఏ రాష్ట్రమూ చెప్పదు, చెప్పలేదు. నాడు కేంద్రంలోనూ, దాదాపుగా అన్ని రాష్ట్రాలలోనూ అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కనుక దేశవ్యాప్తంగా ఎల్లెడలా ఒకే విధానాలు, కార్యక్రమాలు అమలయ్యాయి. నిజానికి కొన్ని ప్రగతిశీల భావాలను తొలుత బిహార్‌లోనే ప్రయోగాత్మకంగా అమలు పరిచారు. అవి అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. భూ సంస్కరణలు, భూముల పంపిణీ అందుకు ఉదాహరణలు.



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

ప్రజాహితాన్ని ఔదలదాల్చిన నాయకులు బిహార్‌లో ఉండేవారు. సుపరిపాలనను సమర్థంగా అందించిన పాలనా వ్యవస్థ, దీక్షాదక్షతలతో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిన సివిల్ సర్వెంట్లు ఉండేవారు. దేశంలోనే మహా సస్యశ్యామల క్షేత్రాలు బిహార్‌లో ఉండేవి. ఆరు రుతువుల్లోనూ నిండుగా ప్రవహించే జీవనది గంగమ్మ చెంతనే ఉన్నది. సహజ వనరులు అపారం. భారత్‌లో తొలి ఉక్కు కర్మాగారాలు అవిభక్త బిహార్‌లోనే ప్రారంభమయ్యాయి. దేశంలోని నాలుగు ప్రముఖ హైకోర్టుల్లో ఒకటి పట్నాలో ఉండేది. దృఢమైన న్యాయవ్యవస్థ వర్ధిల్లేది. మరి బిహార్ ఎందుకు విఫలమయింది?

బిహార్‌పై అధికారిక సమాచారం మహా నిరుత్సాహం కలిగిస్తుంది. వాస్తవ పరిస్థితులు అంతకంటే అధ్వానమైనవని పరిశీలకులు ఘంటాపథంగా చెప్పుతారు. ఈ శోచనీయ పరిస్థితులకు ప్రతి ప్రభుత్వమూ నిందార్హమైనదే. నితీశ్‌కుమార్ నవంబర్ 24, 2005 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్నారు. (మధ్యలో 278 రోజులు మినహా. ఆ స్వల్పకాలిక ముఖ్యమంత్రిని నితీశ్ స్వయంగా ఎంపిక చేశాడు). అంటే నితీశ్ 20 సంవత్సరాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన తరువాత సుదీర్ఘకాలం పాలించిన నేత లాలూప్రసాద్ యాదవ్ (లేదా ఆయన సతీమణి) 1990 నుంచి 2005 దాకా బిహార్‌లో లాలూ పాలన నడిచింది. 35 సంవత్సరాల వయసులోపు బిహారీలకు ఒకే ఒక్క ముఖ్యమంత్రి– నితీశ్ కుమార్– మాత్రమే తెలుసు. బిహార్ అసెంబ్లీకి ఇప్పుడు జరగనున్న ఎన్నికలు 1990ల నాటి లేదా అంతకు ముందటి సంవత్సరాలలోని ప్రభుత్వాల గురించి కాదు. నితీశ్ నాయకత్వం, ఆయన ఇరవై సంవత్సరాల పాలనపై 2025 ఎన్నికలలో బిహారీలు తీర్పు ఇవ్వనున్నారు.




**కులం కుటుంబానికే పరిమితమవ్వాలి. మతాన్ని పూజా ప్రదేశాలలోనే ఆచరించాలి. రాజకీయ వ్యవహారాలనూ పాలనా వ్యవస్థలనూ ఎట్టి పరిస్థితులలోనూ ప్రభావితం చేయకుండా కుల మతాలను కట్టడి చేయాలి. బిహార్ ప్రజలు ఈ సత్యాన్ని గ్రహించి జాగృతమయినప్పుడే తమకుతాము వేసుకున్న ఆ ఉచ్చుల నుంచి బయటపడగలుగుతారు.**

2025లో బిహార్ జనాభా 13.43 కోట్లు అని అంచనా. 1 కోటి నుంచి 3 కోట్ల మంది బిహారీలు తమ రాష్ట్రం వెలుపలి ప్రాంతాలకు వలసపోయారని అంచనా. బిహార్‌లో నిరుద్యోగిత, పేదరికానికి ప్రధాన కారణాలు: యువజనుల నిరుద్యోగిత రేటు 10.8 శాతం. విద్యాస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందో నిరుద్యోగిత రేటు కూడా అంత అధికంగా ఉండడం ఒక వైరుధ్యం. కేవలం 1,35,464 మంది బిహారీలు మాత్రమే తమ రాష్ట్రంలోని పరిశ్రమలలో ఉద్యోగులుగా ఉన్నారు. వీరిలో కేవలం 34,700 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు. భారతదేశంలో అత్యధిక పేదరికం రేటు బిహార్‌లో ఉందని 2024లో నీతి ఆయోగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 64శాతం కుటుంబాల నెలసరి ఆదాయం పదివేల రూపాయల కంటే తక్కువగా ఉన్నది. నెలసరి ఆదాయం రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్న కుటుంబాలు 4శాతం మాత్రమే. మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎమ్‌పీఐ– ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలలో బహుళ లేమిని ఒకేసారి పరిశీలించడం ద్వారా పేదరికాన్ని అంచనా వేస్తుంది) అత్యంత చెత్త పనితీరు కనపరిచే రాష్ట్రం బిహార్.

బిహార్ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులకు నితీశ్‌కుమార్ ప్రభుత్వానిదే బాధ్యత. భారత్ జనాభాలో 9శాతం బిహార్‌లో ఉండగా, స్థూల దేశీయోత్పత్తిలో ఆ రాష్ట్రం వాటా 3.07 శాతమే. 2023–24లో బిహారీల తలసరి ఆదాయం రూ.32,174 (జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,06,744లో మూడో వంతు) మరింత ఆందోళనకరమైన విషయమేమిటంటే బిహార్ తలసరి ఆదాయం జాతీయ సగటు ఆదాయం పెరుగుదల రేటు కంటే తక్కువ రేటులో పెరుగుతోంది. రెండిటి మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఆర్థికాభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నప్పటికీ బిహార్ పేద సమాజంగా, విఫల రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ఆ రాష్ట్ర రాజకీయాలే అందుకు కారణం, సందేహం లేదు. బిహార్ ప్రభుత్వమూ, దాని వ్యవస్థలూ తమకుతాము వేసుకున్న కులం, మతం ఉచ్చుల్లో చిక్కుకుపోయాయి. బిహార్ ప్రజలలో తీవ్ర విభేదాలకు మతం ఒక పెద్ద కారణం. రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యంతో పరిపాలనలో ప్రతి అంశాన్ని మతం ప్రభావితం చేస్తోంది. ముస్లింలు నమ్మకద్రోహులు, కృతఘ్నులు అని, తత్కారణంగా వారి ఓట్లను తాను ఆశించడం లేదని గిరిరాజ్‌సింగ్ అనే బీజేపీ నేత వ్యాఖ్యానించాడు. ముస్లింలు 17శాతంగా ఉన్న రాష్ట్రంలో ఆయన ఈ వ్యాఖ్య చేశాడు మరి.

బిహార్ ప్రజల పిచ్చాపాటీలో కులమే ప్రధాన అంశం. రాజకీయాల గురించిన చర్చ కూడా కులం చుట్టూనే నడవడం పరిపాటి. హిందువులు ఓబీసీలుగా, ఎమ్‌బీసీలుగా, ఈబీసీలుగా చీలిపోయి ఉన్నారు. ఈబీసీలలోని 12 కులాలలో నాలుగు మాత్రమే ప్రధానమైనవిగా పరిగణన పొందుతున్నాయి. కుల మతాలకు మితిమీరిన ప్రాధాన్యమివ్వడం వల్ల బిహార్ ప్రజలలో పరస్పర అనుమానాలు, విరోధ భావాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయి. బిహార్ రాజకీయాలలో మార్పు వచ్చి తీరాలి. ఆ మార్పును ఎవరు సాధిస్తారు? ఈ ప్రశ్నకు భిన్న సమాధానాలు వస్తాయి. మార్పును తీసుకువచ్చే నాయకుడు నితీశ్‌కుమార్ మాత్రం కానే కాదని ఇంగిత జ్ఞానం ఉన్న ప్రతి ఒక్కడూ చెప్పగలడు. ఆయన తన ఇరవై సంవత్సరాల పాలనా అలవాట్లలో పాదుకుని పోయి వున్నాడు. అనూహ్య రీతుల్లో ప్రవర్తించడం ఆయనకు పరిపాటి. ఇప్పుడు ఆరోగ్య సమస్యలు కూడా ఆయనను చుట్టుముట్టాయి. నితీశ్ తననుతాను మార్చుకుని బిహార్ పాలనలో, సమాజంలో మౌలిక మార్పులు తీసుకురాగలరని భావించడం, ఆశించడం మూర్ఖత్వమే అవుతుంది. బీజేపీతో జత కట్టిన ప్రతి ప్రాంతీయ పార్టీ పతనమయింది. ఉనికినీ కోల్పోయింది. నితీశ్ నాయకత్వంలోని జనతాదళ్(యు) భవిష్యత్తు అందుకు భిన్నంగా ఉండదు.

కులం కుటుంబానికే పరిమితమవ్వాలి. మతాన్ని పూజా ప్రదేశాలలోనే అనుష్ఠానించాలి. రాజకీయ వ్యవహారాలనూ పాలనా వ్యవస్థలనూ ఎట్టి పరిస్థితులలోనూ ప్రభావితం చేయకుండా కులమతాలను కట్టడి చేయాలి. బిహార్ ప్రజలు ఈ సత్యాన్ని గ్రహించి జాగృతమయినప్పుడే తమకుతాము వేసుకున్న ఆ ఉచ్చుల నుంచి బయటపడగలుగుతారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

---

# మురికితనం కరుకుతనం పాలైన మేధ

తొలి ప్రేమ నవ యవ్వన కాలాన్ని దాటదు. తరుణప్రాయంలో అంకురించిన మేధా ఆసక్తులు తాత్కాలికమైనవి కాక జీవితపర్యంతం వర్ధిల్లడం కద్దు. అటవీ సామాజికుల చరిత్రకారునిగా నేను నా విద్వత్ వృత్తి జీవితానికి శ్రీకారం చుట్టాను. బ్రిటిష్ వలసపాలనలో మొరటుగా ధ్వంసమైన జీవితాలు వారివి. క్రమంగా నా ఆసక్తులు, పరిశోధనలు, రచనా వ్యాసంగాలు విభిన్న అంశాల వైపుగా వికసించాయి. అయినప్పటికీ నేను తొట్టతొలుత సాగుచేసిన మేధా క్షేత్రంతో నా అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నాను. నిజానికి గత వారం రోజులూ ఒక యువ పరిశోధకుడి డాక్టొరల్ థీసిస్ చదువుతూ గడిపాను. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రంగా విలసిల్లుతున్న ప్రాంతాల సామాజిక, పర్యావరణ చరిత్రను శోధించిన సిద్ధాంత వ్యాసమది. అది నన్ను బాగా ప్రభావితం చేసింది. ఎంతగా అంటే ఈ కాలమ్‌లో దాని గురించి రాసి తీరాలనే బలీయమైన ప్రేరణను నాలో పాదుకొల్పింది.




బ్రిటిష్ పాలనలో సింగ్‌భూమ్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో సంభవించిన పరివర్తనల పూర్వాపరాలను ఆ థీసిస్ విశ్లేషించింది. ఈస్టిండియా కంపెనీ క్రమంగా ఆ ప్రాంతంపై సైనిక, పాలనా పరమైన నియంత్రణను సాధించిన వైనాన్ని తొలుత వివరించింది. ఆ తరువాత ఆ ప్రాంత ప్రాకృతిక ఆవరణాన్ని, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను వలసపాలన ఎలా పునర్వ్యవస్థీకరించిందో పేర్కొంది. వలసపాలకుల అటవీ విధానం వ్యాపార ప్రయోజనాలకు ఇచ్చిన ఎనలేని ప్రాధాన్యం, కొత్త పాలకులతో సంప్రతింపుల బాధ్యతలు నిర్వర్తించే గ్రామ పెద్ద హోదాలో చోటు చేసుకున్న మార్పులు, తమ జీవితాలలో వలసపాలన తెస్తున్న మార్పులపట్ల ఆదివాసుల ప్రతిస్పందనలు మొదలైన అంశాలను ఆ థీసిస్ విపులంగా స్పృశించింది. పర్యావరణం, సమాజం, రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరిస్తూ మేధా చరిత్రపై కూడా తగు శ్రద్ధ చూపిన అధ్యయనమది. సింగ్‌భూమ్ గిరిజనులపై యూరోపియన్ అధికారులు, భారతీయ మానవ శాస్త్రవేత్తల మేధా కృషిని నిశితంగా విశ్లేషించింది.

ఈ యువ చరిత్రకారుని పరిశోధనా కృషిలో ఆరు విశిష్ట వైదుష్య లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది– జార్ఖండ్, విశాల భారత ప్రాంతాల ఆదివాసుల జీవనరీతులపై గతించిన కాలంలో విఖ్యాతులు, విస్మృతులు వెలయించిన రచనలపై సమగ్ర సాధికారత; రెండోది– విస్తృత శ్రేణి ప్రాథమిక ఆధారాలను కనుగొని, ఉపయోగించుకున్న సమర్థత. జాతీయ, రాష్ట్ర, జిల్లా ఆర్కైవ్‌లలో లభించే సమాచారాన్ని ఈ పరిశోధకుడు కూలంకషంగా అధ్యయనం చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అలాగే శతాధిక సంవత్సరాల క్రితం ప్రచురితమైన పుస్తకాలు, వ్యాసాలను కూడా విస్తృతంగా సంప్రతించాడు;

మూడోది– పరిశోధిస్తున్న ప్రాంతంలో క్షేత్ర కృషి ద్వారా అనుబంధ జ్ఞానాన్ని సముపార్జించేందుకు సుముఖత. ‘ఒక చరిత్రకారుడికి మందమైన నోట్‌బుక్‌తో పాటు మందమైన బూట్లు కూడా అవసరం’ అన్న ఫ్రెంచ్ చరిత్రకారుడు మార్క్ బ్లాచ్ (1866–1944) సూక్తిని ఈ యువ విద్వజ్ఞుడు మనసా, కర్మణా పాటించాడు (గతాన్ని సమగ్రంగా, విశ్వసనీయంగా అర్థం చేసుకోవడానికి ప్రపంచంలో కఠినమైన, ఆచరణాత్మక పని; శ్రద్ధాయుతమైన, కఠిన మేధో ప్రయత్నం రెండూ అవసరమని మార్క్ బ్లాచ్ ప్రవచించారు); నాల్గవది– తన వాదనలకు మద్దతుగా ప్రాథమిక ఆధారాల నుంచి స్ఫుటమైన, భావస్ఫోరకమైన ఉటంకింపులపై పరిపూర్ణ శ్రద్ధ పెట్టాడు; ఐదవది– తన విశ్లేషణాత్మక అధ్యయనాలను స్పష్టమైన, సూటియైన, ఆకర్షణీయమైన వచనంలో రాశాడు. ఎక్కడా ప్రత్యేక పరిభాషను ఎక్కువగా ఉపయోగించలేదు; ఆరవది– బహుళ దృక్కోణాలను అంగీకరించే వివరణాత్మక విశ్లేషణ. వాదనల సూక్ష్మ విస్తరణ ప్రశస్తంగా ఉన్నది. వలసపాలనాయుగ అధికారులు, వర్తమాన ఆదివాసీహక్కుల కార్యకర్తలలో సాధారణంగా ద్యోతకమవుతుండే గతానుగతిక భావాలను ఈ యువ పరిశోధకుడు పునరుక్తం చేయలేదు. నాటి వలస పాలకులకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన ఆదివాసీ తిరుగుబాట్లు, ప్రస్తుత కాలపు ఆందోళనలు, ఉద్యమాల మధ్య ఉన్న ఘటనాత్మక సామ్యాలు, సూత్రబద్ధమైన సంబంధాలపై ఆలోచనాత్మక విమర్శలు చేశాడు. తమ ప్రశాంత, సంప్రదాయబద్ధమైన జీవితాలలో ఆధునిక రాజ్య వ్యవస్థలు పురికొల్పిన అల్లకల్లోలానికి వ్యతిరేకంగా నాడు, నేడు ఆదివాసుల తిరుగుబాట్లను సుసంబంధంగా విశ్లేషించాడు. ఆసేతుహిమాచలం 500కు పైగా ఉన్న ఆదివాసీ సమూహాల జీవన రీతులలో విస్తారమైన వైవిధ్యాన్ని విస్మరించి సమస్త వనవాసీలను ఒక సజాతీయ సమాజంగా చిత్రించేందుకు గత కాలంలోనూ వర్తమానంలోనూ ప్రయత్నించిన రచనలలోని లోపాలను ఈ యువ మేధావి నిశితంగా విమర్శించాడు.

తమ జీవనావరణాలలోకి రాజ్య వ్యవస్థల చొరబాట్లను ఆదివాసీలు ప్రతిఘటించిన తీరుతెన్నులను, కొంత మంది ఆదివాసీ పెద్దలు సొంత తెగ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని పెంపొందించుకునేందుకు రాజ్యాధికారులతో కుమ్మక్కయిన వైనాలను ఈ చరిత్రకారుని సొంత పరిశోధన వివరించింది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గుణ విశేషాలు విస్తృతంగా ఉన్న ఈ థీసిస్‌లో లోపాలు, లొసుగులు లేకపోలేదు. తన అధ్యయనాలతో ప్రత్యక్ష సంబంధమున్న కొన్ని కీలక గౌణ ఆధారాలను సంప్రతించడాన్ని ఈ పరిశోధకుడు ఉపేక్షించాడు. భారతీయ మానవశాస్త్ర చరిత్రపై టీఎన్ మదన్ రచనలను ఉపయోగించుకోలేదు. జానపద గాథలు, మౌఖిక చరిత్రను మరింతగా ఉపయోగించుకుని ఉంటే పరిశోధన ఇంకా ప్రశస్తంగా ఉండేదని నేను భావిస్తున్నాను. ప్రాథమిక ఆధారాల నుంచి చేసిన ఉటంకింపులు కొన్ని సుదీర్ఘంగా ఉండి అసలు కథనాన్ని అనవసర ప్రాధాన్యాలకు మళ్లించాయి.

అయినప్పటికీ నేను చదివిన భారతీయుల డాక్టొరల్ థీసిస్‌లలో ఇది చాలా ప్రతిభావంతమైనది. పరిపూర్ణమైన పరిశోధన, సందేహం లేదు. ఇటువంటి ఉత్కృష్ట విద్వత్ ప్రమాణాలతో కూడిన థీసిస్ సాధారణంగా కొద్ది కాలంలోనే పుస్తకరూపంలో లోకం ముందుకు రావడం పరిపాటి. పర్యావరణ, సామాజిక చరిత్ర అధ్యయనంలో పథ నిర్దేశం చేసిన నందిని సుందర్ పుస్తకం ‘Subalterns and Sovereigns, మహేష్ రంగరాజన్ గ్రంథం ‘Fencing the Forest’ రెండిటి విషయంలోనూ థీసిస్ సమర్పణ, పుస్తక రూపంలో ప్రచురణకు మధ్య చాలా కొద్ది సంవత్సరాల వ్యవధి మాత్రమే ఉన్నది. ఇటీవలికాలంలో ప్రచురితమై, విశేష మేధా చర్చలకు ఆస్కారమైన భవానీ రామన్, ఆదిత్య బాలసుబ్రమణియన్, నిఖిల్ మేనన్, దిన్యార్ పటేల్‌ల చారిత్రక మోనోగ్రాఫ్‌లు కూడా డాక్టొరల్ థీసిస్‌గా ఆరంభమైనవే.

> **డాక్టర్ ఉమర్ ఖలీద్‌ను నేను ఎప్పుడూ కలుసుకోలేదు. ఆయనతో ఎన్నడూ సంభాషించలేదు. డిసెంబర్ 2019లో ఒక రోజున ఇరువురమూ, ఒక వివక్షాపూరిత చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నాము– ఆయన ఢిల్లీలో, నేను బెంగళూరులో. మా జీవన ప్రస్థానాలు భిన్న పథాలలో ఉండడం పట్ల, అందుకు కారణాల విషయమై నేను అప్పుడప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నా పరిశోధనా కృషి, రచనా వ్యాసంగం నిరాటంకంగా కొనసాగడానికి, ఉమర్ కొనసాగించలేకపోవడానికి కారణం నా మొదటి పేరు ఉమర్ కాకుండా, రామచంద్ర కావడమేనా?**

ప్రస్తావిత పుస్తకాలు అన్నీ విద్వత్ ప్రపంచంలో విస్తృత అధ్యయనానికి నోచుకున్నాయి. మేధా చర్చలకు ప్రేరణ అయ్యాయి. నేను విపులంగా చర్చిస్తున్న థీసిస్ కూడా పుస్తక రూపంలో ప్రచురితమైతే నందినీ సుందర్, మహేశ్ రంగరాజన్ తదితరుల పుస్తకాల వలే విశేష ప్రశంసలకు పాత్రమవుతుందనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. విషాదమేమిటంటే నేను పేర్కొన్న థీసిస్ 2018లోనే న్యూఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి సమర్పించడం జరిగింది. అయితే అది ఇప్పటికీ పుస్తక రూపం పొందలేదు. ఎందుకని? ఆ పరిశోధకుడి పేరు ఉమర్ ఖలీద్ కావడమే, సందేహం లేదు. క్రూర రాజ్యవ్యవస్థకు సంకోచించే న్యాయవ్యవస్థ తోడవడంతో ప్రతిభావంతుడైన ఆ యువ చరిత్రకారుడు (నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి) ఐదు సంవత్సరాలకు పైగా కారాగారంలో కునారిల్లుతున్నాడు. బెయిల్ మంజూరు చేయక పోవడమే కాదు. అసలు అతడిపై ఎటువంటి ప్రాథమిక అభియోగాలు కూడా మోపకుండా ఆ చైతన్యశీల చింతనాపరుడిని జైలు నిర్బంధంలో కొనసాగిస్తున్నారు!

డాక్టర్ ఉమర్ ఖలీద్‌ను నేను ఎప్పుడూ కలుసుకోలేదు. ఆయనతో ఎన్నడూ సంభాషించలేదు. అయితే డిసెంబర్ 2019లో ఒక రోజున ఇరువురమూ ఒక వివక్షాపూరిత చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నాము– ఆయన ఢిల్లీలో, నేను బెంగళూరులో. మా జీవన ప్రస్థానాలు భిన్న పథాలలో ఉండడం పట్ల, అందుకు కారణాల విషయమై నేను అప్పుడప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నా పరిశోధనా కృషి, రచనా వ్యాసంగం నిరాటంకంగా కొనసాగడానికి, ఉమర్ కొనసాగించలేకపోవడానికి కారణం నా మొదటి పేరు ఉమర్ కాకుండా, రామచంద్ర కావడమేనా?

స్వయంగా ఆధునిక భారతదేశ చరిత్రకారుడిని అయినందున ఈ కాలమ్‌లో డాక్టర్ ఉమర్ ఖలీద్ గురించి తెలియజేశాను. ఆయన విద్వత్ కృషి లోతు, విశాలత, ఉత్కృష్టతను అర్థం చేసుకుని ప్రశంసించగల స్థాయిలో ఉన్నందునే నేనీ వ్యాసాన్ని రాశాను. కాగా ఈ కాలమ్‌ను ముగిస్తూ నా మనసులోని మాటను చెప్పదలిచాను. తమ రాజకీయ యజమానుల ఆదేశాల మేరకు పోలీసులు ముందూ వెనుక చూడకుండా ఆలోచనారహితంగా మోపిన అవిశ్వసనీయ ఆరోపణలతో కారాగారాలలో కృశిస్తున్న అనేక మంది ఉత్తమ వ్యక్తులు, మానవీయ మేధాశీలురుల్లో డాక్టర్ ఉమర్ ఖలీద్ ఒకరు. ఈ భారతీయులలో కొంత మంది తమ తమ అధ్యయన క్షేత్రాలలో వినూత్న భావ పథాలను నిర్మించిన ఉత్కృష్టులు. తమ వ్యక్తిగత జీవితాలలోను, ఎంచుకున్న కార్యరంగంలోను అహింసా పద్ధతులకు, భారత రాజ్యాంగ సంస్థాపక విలువలకు సంపూర్ణంగా నిబద్ధమైన పలువురు సామాజిక సేవకుల, పౌర సమాజ క్రియాశీలుర జీవితాలు కూడా రాజ్య క్రౌర్యాన్ని చవిచూస్తున్నాయి. బహుళత్వ వాదం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నందునే వారు నిరంకుశ పాలకులతో విభేదించి జైళ్లపాలయ్యారు. అటువంటి ఉదాత్తులు ఇంకా ఎంతో మంది వివిధ సమస్యల నెదుర్కొంటున్నారు. తోటి భారతీయులు అయిన ఈ సజ్జనులు, ముఖ్యంగా యువ మేధావులు మన గణతంత్ర రాజ్య సమున్నతికి అనితరసాధ్యమైన సేవలు అందించగల మంచి వయసులో ఉన్న కాలంలో చీకటి గుయ్యారాలు, మురికి కూపాలు, ఆరోగ్యకరం కాని పరిస్థితులకు నెలవులు అయిన కారాగారాలలో మగ్గిపోవలసిరావడం మానవతకు మచ్చ కాదా? ఇది దేశానికి మేలు చేస్తుందా? ఇప్పటికే చాలా సమయం మించిపోయింది. ఇంతవరకు నిరాకరిస్తూ వస్తోన్న న్యాయాన్ని ఆ మానవీయులకు సమకూర్చేందుకు మన న్యాయమూర్తులు ఇప్పటికైనా సాహసించాలి. సమాజ జీవితంలో సముదాత్త విలువలను పరిమళింపచేయాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

---

# ప్రజానాయకుడంటే ఇలాగే ఉండాలి!



పాలకుడంటే... ఇలాగే ఉండాలి
పరామర్శలకు వచ్చినపుడో
ప్రకృతి విపత్తులు వచ్చినపుడు
ప్రత్యేకతలను పక్కన పెట్టాలి
ప్రభంజనంలో కలిసి పోవాలి
సామాన్యుడుగా మారిపోయి
మనుషులలో మమేకం కావాలి
బాధితుల లోకంలోకి వెళ్లిపోతే
పీడితుల బాధలు అర్థమౌతాయి..!

నిజమైన ప్రజానాయకుడంటే
ప్రజల ఈతి బాధలను చూడాలి
ఆత్మీయుడిలా హస్తాన్ని అందించి
రక్త బంధువులా భరోసాను ఇవ్వాలి
అప్పుడే బాధితులకు ఆనంద బాష్పాలు..!

నేతలు ప్రతి మనిషిని ప్రేమించాలి
ముఖ్యంగా ఆరుకాలాలు పాటు
మట్టిని ఆరాధించే రైతును ప్రేమించాలి
అందరికీ కడుపు నిండా అన్నం పెట్టే
అన్నదాతలను అమితంగా ప్రేమించాలి..!

బురదలోన కర్షకుడిలా దిగి పోవాలి
బువ్వ మొక్కలు పడుతున్న కంకుల
ఆవేదనను శంఖం చెవులతో వినాలి
రైతుల కన్నీరును.. చిత్తడిగా తడిసి
రెక్క నుంచి జారుతున్న బొట్లుగా చూడాలి
అప్పుడే రైతుల బాధలు అర్థమౌతాయి
రైతన్నలకు సమన్యాయం జరుగుతుంది..!

ఏ దేశమైనా సుభిక్షంగా ఉండాలంటే
రైతులను ప్రజాప్రతినిధులు ప్రేమించాలి
విరివిగా రాయితీలిచ్చి వరి దుబ్బులుగా నిలబెట్టాలి!

– జి. సూర్యనారాయణ

---

# ఆత్మగౌరవ దండోరా సభ

నూట నలభై రెండు కోట్ల ప్రజలున్న దేశంలో సర్వోన్నత న్యాయాధిపతి తన సింహాసనం మీద కూర్చుని వాదోపవాదాలు వింటున్న సమయం అది. నిండు కోర్టులో కట్టుదిట్టమైన భద్రత ఉన్న చోటు అది. ఆ న్యాయాధిపతిపై బూటు విసరడమనే జుగుప్సాకరమైన దాడి ఎందుకు జరిగింది? దీనికి ప్రేరేపించిన కళంకాయనులు ఎవరనేది ప్రపంచానికి తెలిసిపోయింది. ఆ చర్యకు పాల్పడిన వ్యక్తి సమాధానం అలాంటిది. అంతేకాదు, అది ఆ వ్యవస్థ సమాధానం కూడా. న్యాయాన్ని న్యాయంగా చూడలేని ఒక అన్యాయాల పునాది మీద విలసిల్లుతున్న భావజాలం అది. వీరి అనాగరిక చర్యలకు సర్వోన్నత న్యాయస్థానానికి సైతం మినహాయింపు లేదనటానికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుంది?

మనది కాని నేలమీద పడి బతుకుతున్నామనే అగౌరవాన్ని సంకేతాలుగా పంపదలుచుకున్న అసహన వ్యవస్థ అప్రజాస్వామిక దాడి అది. ఒక వ్యక్తి చర్య ఏ మాత్రం కాదు. అది వ్యవస్థీకృత నియంతృత్వం, దాని పాలన పెంచి పోషిస్తున్న సనాతనవాద ప్రభావం. దానికి పౌర సమాజాన్ని గౌరవించే సహనం ఉండదు. రాజ్యాంగాన్ని గౌరవించే మనసు ఉండదు. మత వైరుధ్యం కుల రాక్షసత్వం నరనరానా నింపుకుని అసమ సమాజ నిర్మాణానికి అనునిత్యం వెంపర్లాడుతుంటుంది. అందుకని న్యాయం అందరిదిగా ఉండడానికి కూడా ఒప్పుకోదు ఈ ధర్మం.

ఈ దాడి విషయంలో చట్టం తన పని తాను చేయటానికి నిరాకరించటం దగ్గరే అసలు కథ మొదలవుతుంది. పౌర సమాజం ఆలోచించటానికి కారణం కూడా అయింది. సుప్రీంకోర్టు జడ్జి అంటే రాజ్యాంగం ప్రతిబింబించే ఈ దేశ స్ఫూర్తి. అలాంటి వ్యక్తి మీద దాడి జరగటం అంటే రాజ్యాంగం మీద దాడి జరగడమే. ఇంత జరిగినా ఈ దేశ పాలనా వ్యవస్థకు చీమ కుట్టినట్టు కూడా లేదు. ఆ స్థానంలో దళిత సీజేఐ కాకుండా అగ్రహారం నుంచి వచ్చిన సీజేఐ అయితే పరిస్థితులు ఇలా ఉంటాయా? అనే ప్రశ్న దళిత సమాజాన్ని ఆవేదనకు గురిచేసింది.

రాజ్యాంగమే సుప్రీం గనుక ఆ వ్యవస్థ మీద దాడి జరిగినప్పుడు బాధ్యత వహిస్తూ న్యాయశాఖ మంత్రి రాజీనామా చేయాలి కదా! భద్రతా వైఫల్యమయితే శాఖాపరమైన చర్యలు ఏమి తీసుకున్నారో తెలియదు. రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే పరిమితమైనవి గనుక రాజకీయ పార్టీలు అందుకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి. ఆయన దళితుడు గనుక, వాటి నుంచి ఇంతకన్నా ఆశించలేం.

దేశం తలవంచుకునే ఘటన... ఈ దాడి. ఇది అక్టోబర్ 6న జరిగినా, నేటికీ న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు నమోదు చేయకపోవడంలో ఆంతర్యం తెలియంది కాదు. హేయమైన ఈ దాడిని దేశమంతా ఖండించింది. ‘ఇటువంటి ఘటనలు నన్ను ప్రభావితం చేయలేవు’ అన్న సీజేఐ మాటలు విని క్షమించి వదిలివేయాల్సిన దాడి కాదు ఇది. చెప్పిందల్లా చెయ్యకపోతే ఇలాంటి దాడులు చేస్తామనే భావదారిద్ర్యం నుంచి రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత పౌర సమాజం మీద ఉన్నది.

సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ‘మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి’ ఇరవై ఐదు రోజులుగా ఉద్యమం చేస్తున్నది. ఈ పోరాటంలో భాగంగా నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఈ ప్రదర్శన రాజ్యాంగ పరిరక్షణ కోసం, దళితుల ఆత్మగౌరవం కోసం జరుగుతున్నది. దళితుల ఆత్మగౌరవ దండోరా ప్రదర్శనలో పాల్గొనడం ప్రజాస్వామికవాదులుగా మనందరి బాధ్యత.


● డప్పోల్ల రమేశ్

---

# అమృతలత పురస్కారాల ప్రదానం

అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు, ఇందూరు అపురూప అవార్డ్స్–2024–25 ప్రదానోత్సవం నవంబరు 2 (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ మామిడిపల్లిలోని శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో జరుగుతుంది. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ సి. మృణాళిని, విశిష్ట అతిథిగా వి. ప్రతిమ, సభాధ్యక్షురాలుగా నెల్లుట్ల రమాదేవి పాల్గొంటారు. అమృతలత జీవన సాఫల్య పురస్కారాన్ని 2024కి గాను కథ, నవల విభాగంలో వసుంధర, శాంతినారాయణ; జర్నలిజం విభాగంలో వల్లీశ్వర్; 2025కి గాను అనువాదం విభాగంలో నలిమెల భాస్కర్, కవిత్వ విభాగంలో జి. వెంకటకృష్ణ, కథ/నవల విభాగంలో పెద్దింటి అశోక్ కుమార్ స్వీకరిస్తారు. సాహితీవేత్తలకు, వివిధ రంగాలకు చెందిన వారికి ఇచ్చే ఇందూరు అపురూప అవార్డులను 2024కి గాను సూరం శంకర్ (గజల్), పంచరెడ్డి లక్ష్మణ్ (కవిత్వం), స్వయంప్రకాశ్ (సంపాదకత్వం), ఎన్. విజయాకిషన్‌రెడ్డి (కవిత్వం), కుసుమలతారెడ్డి (పర్యావరణం); 2025కి గాను వసంతా వివేక్ (బహుముఖ ప్రజ్ఞ), వి. నర్సింహారెడ్డి (ఆధ్యాత్మిక సాహిత్యం), పి. సుజాత (బోధనారంగం), సుమీలా శర్మ (క్రీడలు/నాట్యం), బోచర్కర్ ఓంప్రకాశ్ (అవధానం) అందుకుంటారు. వివరాలకు: 98488 68068.

– అమృతలత






# వరద తగ్గుముఖం

» 39,878 క్యూసెక్కులకు తగ్గిన మునేరు
» ఊపిరిపీల్చుకున్న అధికారులు


వరద ముంపు నుంచి బయటపడిన పెనుగంచిప్రోలు కాజ్‌వే

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/కంచికచర్ల) : మునేరు శాంతించింది. తెలంగాణాలోని వరంగల్, జనగామ, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మునేరు, పాలేరు వాగులు వెనక్కి తగ్గాయి. గురువారం రాత్రి వరకు 1.65 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద శుక్రవారం సాయంత్రానికి 39,878 క్యూసెక్కులకు తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో నీటమునిగిన చిల్లకల్లు-చైరా కాజేవ్ పైకి తేలింది. రాకపోకలను ఇంకా అనుమతించలేదు. పెనుగంచిప్రోలు కాజ్‌వేను మూసివేసినప్పటికీ వాహనాల రాకపోకలను అనుమతించారు. గురువారం రాత్రికి 1.65 లక్షల క్యూసెక్కులకు వరద చేరటంతో ఏ క్షణమైనా నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి మునేరు చేరే పరిస్థితి కనిపించింది. 11 గంటల తర్వాత నుంచి వరద ప్రవాహం క్రమంగా తగ్గడం మొదలైంది. శుక్రవారం ఉదయం 6 గంటలకు 92 వేల క్యూసెక్కులకు, మధ్యాహ్నం 12 గంటలకు 67 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 52 వేల క్యూసెక్కులకు వరద తగ్గింది. సాయంత్రానికి 39,878 క్యూసెక్కులకు చేరింది. రాత్రికి మరింత తగ్గుముఖం పడుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## గోకరాజుపల్లికి చెందిన దంపతులు దుర్మరణం

కుమారుడిని చూసేందుకు వెళ్లి అనంతలోకాలకు.. ● నేడు స్వగ్రామానికి పార్థీవదేహాలు

వీరులపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎంతో శ్రమించి, ఒక్కగానొక్క కొడుకును చదివించి విదేశాలకు పంపి ఉద్యోగంలో స్థిరపడేలా చేశారు. వృద్ధాప్యంలో కుమారుడి వద్ద కొన్ని రోజులు సంతోషంగా గడిపేందుకు వెళ్లిన ఆ దంపతులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. కుటుంబ పెద్దలిద్దరూ చనిపోవడంతో బంధువులంతా గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఈ ఘటనతో వీరులపాడు మండలం గోకరాజుపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. గోకరాజుపల్లి గ్రామంలో పంచుమర్తి శేషగిరిరావు (63), ఆయన భార్య అనసూయ (59) నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు శ్రీనివాస్ ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. కుమారుడిని చూసేందుకు దంపతులిద్దరూ నాలుగు నెలల క్రితం అమెరికా మిగతా 6లో..


పంచుమర్తి శేషగిరిరావు-అనసూయ దంపతులు (ఫైల్)

# కన్నీరుమునేరు


దెబ్బతిన్న వరిపైరును చూపుతున్న రైతు గింజుపల్లి శ్రీనివాసరావు

ఫొటోలో దిగాలుగా కనిపిస్తున్న రైతు అనిగండ్లపాడుకు చెందిన గింజుపల్లి శ్రీనివాసరావు. 30 ఎకరాలు కౌలుకు తీసుకుని మాగాణి వరి సాగు చేశాడు. వారం, పది రోజుల్లో కోతకు రావాల్సి ఉంది. ఈలోగా మైసమ్మగండి ద్వారా విరుచుకుపడిన మునేటి వరదకు 20 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. పంట రెండు రోజులుగా నీటిలో నానుతుండటంతో చేతికొచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు సగటున రూ.45 వేలు పెట్టుబడి కాగా, పంట అంతా కళ్ల ముందే నాశనం కావటంతో శ్రీనివాసరావు ఆవేదన చెందుతున్నాడు. మిగతా రైతులది కూడా ఇదే దుస్థితి. మునేరుకు పడిన మైసమ్మ గండిని పూడ్చటంలో అంతులేని నిర్లక్ష్యం చూపడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మైసమ్మ గండి వల్లే మునేరు ఉగ్రరూపం

### పాలకులు, అధికారుల అలసత్వానికి నిదర్శనం

- గత ఏడాదే పడిన గండి.. పూడ్చాలని కోరిన రైతులు
- కాలక్షేపం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- గురువారం నాటి వరదలకూ ఆ గండే కారణం
- 2వేల ఎకరాలకుపైగా వరదార్పణం
- ఇప్పటికైనా పూడ్చాలని రైతుల వేడుకోలు

● **గత ఏడాది సెప్టెంబరు 1 :** మునేటికి వచ్చిన భారీ వరదకు వత్సవాయి మండలం వేమవరం ఎగువన భారీగండి పడింది. దీనినే మైసమ్మ గండి అంటారు. 2.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావటంతో వత్సవాయి మండలం అళ్లూరుపాడు-వేమవరం గ్రామాల మధ్య మునేరు కోతకు గురై ఈ గండి పడింది. వేలాది ఎకరాల మాగాణి భూములు ముంపునకు గురయ్యాయి. వందల ఎకరాల్లో ఇసుక మేట వేసింది. గత ఏడాది రైతులకు పంట దక్కకపోగా, ఖర్చుకు వెనకాడకుండా ఇసుక మేటలు తొలగించి, గోతులు పూడ్చి, మాగాణి భూములను బాగు చేసుకున్నారు.

● **ఈ ఏడాది అక్టోబరు 30 :** ఈ ఏడాది కూడా రైతులు ఎంతో ఆశతో వేలాది ఎకరాల్లో మాగాణి వరి సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలలోపు పెట్టుబడి అయింది. పంట కూడా ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. పక్షంరోజుల్లో కోతలు ప్రారంభంకానున్నాయి. మైసమ్మ గండి పుణ్యమా అంటూ పరిస్థితి తలకిందులైంది. మొంథా తుఫాన్ వల్ల తెలంగాణాలోని వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడటంతో బుధవారం రాత్రి నుంచి మునేటికి వరద ప్రారంభమైంది. గురువారం ఉగ్రరూపం దాల్చిన మునేరు.. మైసమ్మ గండి ద్వారా మాగాణి భూములపై విరుచుకుపడింది. ఆయా గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాలకుపైగా మాగాణి వరి ముంపునకు గురైంది. కంకి వేసిన పంట రెండు రోజులుగా నీటిలో నానుతోంది. పంట పనికిరాదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. రోజుల తరబడి ముంపునకు గురికావటం వల్ల కనీసం గడ్డి కూడా చేతికిరాదని చెబుతున్నారు. వరద తగ్గుముఖం పడితే కానీ నష్టం అంచనాకు రాలేని పరిస్థితి.

- (ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

### గండి పూడ్చరా?

గండిని పూడ్చండి, లేకుంటే మళ్లీ ప్రమాదం పొంచి ఉంది మహాప్రభో.. అంటూ రైతులు ఎప్పటి నుంచో వేడుకుంటున్నారు. లేదంటే మునేరుకు భారీ వరద వచ్చిన ప్రతిసారీ పంటలను కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. గతంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో పాటు నెట్టెం రఘురామ్, టీడీ జనార్దన్ తదితర నేతలు, అధికారులు ఈ గండిని పరిశీలించారు. అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ మాత్రం రాలేదు. నిధులు కూడా మంజూరు కాలేదు. గండిని పూడ్చలేదు.



భిక్షాటన చేసేవారిని సామాజిక భద్రత పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. మానసిక, శారీరక దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతూ రోడ్ల వెంబడి, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర జనసంచార కూడళ్లలో బిచ్చమెత్తుకునే వారిని గుర్తించేందుకు సమాయత్తమవుతోంది. వీరికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వృత్తి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిద్ధమవుతోంది.

# భిక్షాటన చేసే వారికి సామాజిక భద్రత

## మార్గదర్శకాలు ప్రకటిస్తూ జీవో జారీ

» పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ
» ఉపాధి కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ కూడా..
» భిక్షాటన చేసేవారిని గుర్తించే పనిలో టాస్క్‌ఫోర్స్
» జిల్లాలో వెయ్యికి పైగానే ఉన్నట్టు అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : రాష్ట్రంలో భిక్షాటనను రద్దుచేస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. వ్యవస్థీకృత భిక్షాటనను పూర్తిగా నిర్మూలించి, బలవంతపు భిక్షాటన నుంచి దివ్యాంగులు, చిన్నారులను కాపాడాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదముద్ర వేసిన జీవో 58ను న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి ప్రతిభాదేవి విడుదల చేశారు. సమన్వయంతో ఈ చట్టాన్ని అమలు చేసే బాధ్యతను సంక్షేమ, పోలీసు శాఖలపై ఉంచింది.

**మార్గదర్శకాలు ఇవే..**

భిక్షాటన చేసే వారిని గుర్తించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలు, నగరాల్లోని సంక్షేమ శాఖల ఉద్యోగులు, స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లోని భిక్షాటకులను గుర్తించాలి. వీరిని ప్రభుత్వం ఏర్పాటుచేసే పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, మెరుగైన వైద్యసేవలు అందించాలి. మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పించన్లు, మిగతా 6లో..

# పత్తి రైతు చిత్తు

## మొంథా ప్రభావానికి భారీ నష్టం


చెట్టు చివరి వరకూ నలుపొచ్చిన పత్తి కాయలు

**జిల్లాలో 81,875 ఎకరాల్లో పత్తి సాగు**

» ఎకరాకు రూ.50 వేలు తగ్గకుండా పెట్టుబడి
» వర్షాలకు నల్లగా మారి రాలిపోతున్న కాయలు
» పంటపై ఆశలు వదులుకున్న రైతాంగం
» అడ్డుగా మారిన సీసీఐ నిబంధనలు
» రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మొంథా తుఫాను, అధిక వర్షాలు రైతుల వెన్నువిరిచాయి. ఎకరాకు మూడు, నాలుగు క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. కాయలు నల్లగా, గుడ్డిగా మారటంతో కూలీల ఖర్చు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనల వల్ల రైతులకు మద్దతు ధర వచ్చే పరిస్థితి కనిపించట్లేదు. తీవ్ర నష్టాలను మూటగట్టుకుని, పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన పత్తి రైతులు.. రాష్ట్ర ప్రభుత్వ చేయూతపై గంపెడాశలు పెట్టుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల /విజయవాడ సిటీ) : జిల్లాలో ఈ ఏడాది 81,875 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు రూ.50 వేలకు తగ్గకుండా పెట్టుబడి అయ్యింది. రెండు నెలలుగా కురుస్తున్న అధిక వర్షాలు పత్తి చేలను నట్టేట ముంచాయి. చెట్ల అడుగు భాగం తొలికాపు పూర్తిగా దెబ్బతింది. గాలి తగలక ఫంగస్ తెగులు వ్యాపించింది. పక్వానికి వచ్చిన కాయలు విచ్చుకోకుండా ముడుచుకుపోయాయి. నల్లగా మారిపోయాయి. తెల్లగా దూదిగా రావాల్సిన పత్తి.. గట్టి ఉండలుగా, నల్లకాయలుగా వస్తోంది. ఈ పత్తిని బయట వ్యాపారులకు క్వింటా రూ.2 వేల నుంచి రూ.4 వేలలోపు విక్రయిస్తున్నారు. క్వింటా పత్తి తీయటానికి రూ.2 వేలకు పైగా ఖర్చు అవుతోంది. కూలీల ఖర్చు కూడా రావట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెట్టుకు 30కి పైగా కాయలు గుడ్డిగా మారాయి. కొన్ని కింద రాలిపోయాయి. మలికాపుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

**సీసీఐ నిబంధనలు సడలించాలి**

రాష్ట్రంలోని 30 కేంద్రాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సీసీఐ పేర్కొంది. అయితే, సీసీఐ నిబంధనలు సడలించని మిగతా 6లో..



**ఏక్తా ర్యాలీ**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో ఏక్తా ర్యాలీ నిర్వహించారు. బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు సాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు.

# వైద్యవిద్యలో నూతన ఒరవడి




» తొలి హెల్త్ యూనివర్సిటీ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం
» ఉన్నత ప్రమాణాల వైద్యులనందించడంలో ఘనత

8

**నేడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం**


జిల్లాల పునర్విభజనకు సంబంధించి కూటమి ప్రభుత్వం చూపిస్తున్న 'ఒక నియోజకవర్గం.. ఒకే డివిజన్' విధానాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్వాగతిస్తున్నారు. మూడు నియోజకవర్గాల సమస్యను తక్షణం పరిష్కరించటానికి 'ఆంధ్రజ్యోతి' ఉదహరించిన గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్ల ఏర్పాటును ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సానుకూలంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి సిద్ధమవుతున్నారు.

# రెవెన్యూ డివిజన్లు కరెక్టే..

## ఆంధ్రజ్యోతి కథనంపై ప్రజాప్రతినిధుల హర్షం

» గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్లకు స్వాగతం
» యంత్రాంగంతో చర్చిస్తామని హామీ
» ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, కృష్ణాజిల్లాలో గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు రెండేసి డివిజన్ల పరిధిలో ఉన్నాయి. వీటిని ఎలా సరిచేయాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం నాటి సంచికలో 'రెవెన్యూ డివిజన్లు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. పరిష్కార మార్గాలను సూచించింది. ఈ కథనంపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సానుకూలంగా స్పందించారు. ఈ పరిష్కార మార్గాలను యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేలా కృషి చేయాలని భావిస్తున్నారు. అలాగే, మంత్రుల కమిటీతో పాటు వ్యక్తిగతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. పెనమలూరు కూడా ఎన్టీఆర్ జిల్లాలోనే మిగతా 6లో..



### మైలవరం డివిజన్‌తోనే పరిష్కారం



ప్రభుత్వం 'ఒక నియోజకవర్గం.. ఒక డివిజన్' విధానాన్ని తీసుకు రావడాన్ని స్వాగతిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఉండగా, మైలవరం డివిజన్‌ను ఏర్పాటు చేయాలని పోరాడాను. ఏది ఏమైనప్పటికీ విభజన చిక్కుముడులను విడదీయటానికి ప్రభుత్వం సూచించిన ఆలోచన మంచిది. ఇందులో భాగంగానే మైలవరం డివిజన్‌ను ప్రతిపాదించాలని 'ఆంధ్రజ్యోతి' కూడా సూచించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.
- వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే



### స్వాగతిస్తున్నాం

గన్నవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం. ఆంధ్రజ్యోతి సూచించిన విధంగా ఇది మంచి ప్రతిపాదన. గన్నవరాన్ని విజయవాడలో కలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రతిపాదనలను అందించాను. నా నియోజకవర్గంలో బాపులపాడు, ఉంగుటూరు మండలాలు ఉన్నాయి. వీటిని విజయవాడలో కలిపితే ఎలా ఉంటుందన్న దానిపై పరిశీలన చేయాలని డీఆర్‌సీ సమావేశంలో చెప్పాను. కానీ, అధికార యంత్రాంగం సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పటి వరకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. ప్రభుత్వం 'ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్' అనే విధానంలో ఉంది కాబట్టి.. గన్నవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది. విమానాశ్రయంతో పాటు పోలీసు సబ్ డివిజన్ కూడా ఇక్కడ ఉంది. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం, ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వం దృష్టికి మళ్లీ తీసుకెళ్తాను.- యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం ఎమ్మెల్యే








రన్ ఫర్ యూనిటీ ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

## పటేల్ నుంచి ప్రేరణ పొందాలి

» డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 560కి పైగా సంస్థానాలను ఏకం చేయడంలో బలమైన ఏకీకృత దేశానికి పునాది వేయడంలో కీలకపాత్ర పోషించారని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) మోహిత్ సోనాకియా అన్నారు. ప్రజాజీవితంలో పటేల్ అంకితభావం, జాతి నిర్మాణం సమగ్రత ఆదర్శాల నుంచి ప్రేరణ పొందాలని ఆయన సిబ్బందిని కోరారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి రాష్ట్రీయ ఏకతా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం)ను ఉత్సాహంగా, దేశభక్తితో జరుపుకుంటున్న సందర్భంగా విజయవాడ డివిజన్ సిబ్బంది, అధికారులు శుక్రవారం పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. డివిజనల్ ప్రధాన కార్యాలయంలో అధికారులు సిబ్బంది చేత డీఆర్ఎం రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. బలమైన ఏకీకృత దేశానికి పునాది వేయడంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్రను ఆయన వివరించారు. ప్రజా జీవితంలో సర్దార్ పటేల్ అంకిత భావం, జాతి నిర్మాణం సమగ్రత ఆదర్శాల నుండి ప్రేరణ పొందాలని సిబ్బందిని కోరారు. వేడుకల్లో భాగంగా, డివిజన్ సామూహిక బలం ఏకత్వ స్ఫూర్తికి ప్రతీకగా 'ఐక్యత పరుగు'ను నిర్వహించింది.



ఆటోమోటివ్, ఈవీ కాన్ఫరెన్స్ ప్రారంభ జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

## భవిష్యత్‌లో ఈవీ మార్కెట్ అపూర్వవృద్ధి

» ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ అధ్యక్షుడు ప్రసన్న రామమూర్తి

కానూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) మార్కెట్ వృద్ధి అపూర్వంగా ఉంటుందని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ సిస్టమ్స్ ఇంజనీరింగ్(ఐఎన్‌సీవోఎస్ఈ) అధ్యక్షుడు ప్రసన్న రామమూర్తి చెప్పారు. కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే ఆటోమోటివ్ అండ్ ఈవీ కాన్ఫరెన్స్-2025 ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రసన్న రామమూర్తి జ్యోతిని వెలిగించి ప్రారంభించి ప్రసంగిస్తూ.. ఈవీల వల్ల ఉద్గారాలు, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి కీలకమైనవని తెలిపారు. ఆటోమోటివ్ రంగం ఆర్థిక వృద్ధి, అవిష్కరణలు, జీడీపీ, ఉద్యోగ సృష్టికి ఇది సహాయపడుతుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలు, సరసమైన మోడళ్ల లభ్యత కారణంగా ఈవీ మార్కెట్ భవిష్యత్ గొప్పగా ఉంటుందని పేర్కొన్నారు. ఎఫ్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపకుడు డి.రామకృష్ణ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(ఐసీసీ) పూర్వ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు ఎం.రాజయ్య, ఉపాధ్యక్షుడు వి.నాగభూషణరావు, సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు, వీసీ ఏవీ రత్నప్రసాద్, పీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు, సమన్వయకర్తలు అనూష, ఎన్.విజయానంద్‌తో పాటు ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చాక్లెట్ల ఆశ చూపి బాలికపై అత్యాచారం

» నిందితుడిపై పోక్సో కేసు

» మరో బాలికపైనా లైంగికదాడి



వెంకట కృష్ణ

ఐ.పోలవరం/అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో 11 ఏళ్ల బాలికకు చాకెట్లు ఇచ్చి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. ఐ.పోలవరం మండలం బాణాపురానికి చెందిన రాయపురెడ్డి సత్య వెంకటకృష్ణ (బాబి) గతంలో చదివిన హైస్కూలుకు వస్తుండేవాడు. ఈ క్రమంలో అక్కడ చదివే ఓ బాలికకు చాక్లెట్లు ఇచ్చి లోబరుచుకున్నాడు. ఆమె తండ్రి రెండేళ్ల కిందట అనారోగ్యంతో మరణించగా, తల్లి రొయ్యల కంపెనీలో పనిచేస్తూ కుమారుడు, కుమార్తెలను పోషిస్తోంది. ఈ కుటుంబంతో ఉన్న చనువుతో తరచూ బాలిక ఇంటికి కూడా నిందితుడు రాకపోకలు సాగించేవాడు. ఈ వ్యవహారాన్ని గమనించిన బాలిక తల్లి వెంకటకృష్ణపై గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు, బాలికను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు ప్రారంభించారు. వెంకటకృష్ణను శుక్రవారం అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. బాలిక అత్యాచార ఘటనలో నిందితుడిని చట్టపరంగా శిక్షిస్తామని అమలాపురం డీఎస్పీ ప్రసాద్ చెప్పారు. విచారణ సమయంలో మరో బాలికపైనా నిందితుడు అత్యాచారం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. కాగా, బాధిత బాలిక కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బుచ్చిబాబు అన్నారు. బాలికపై అత్యాచార ఘటనను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారని, బాధిత కుటుంబానికి అండగా ఉండాలని ఆదేశించారని కోనసీమ జనసేన నాయకుడు బండారు శ్రీనివాస్ తెలిపారు. కాగా, బాలికపై అత్యాచార ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలని కోనసీమ జిల్లా ఎస్పీకి లేఖ రాశారు.

## 18న దేశవ్యాప్త ఆందోళనలు: సీపీఐ రామకృష్ణ

అనంతపురం విద్య: దేశంలో దళితులు, బలహీన వర్గాలపై జరగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఈ దాడులను నిరసిస్తూ ఈ నెల 18న దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం సీపీఐ ఆందోళనకు సిద్ధమైందని తెలిపారు. మొంథా తుఫాను బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## శ్రీవారి మెట్టు దారిలో చిరుత

తిరుమల: శ్రీవారి మెట్టు నడక దారిలో శుక్రవారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఉదయం 8.30 గంటల సమయంలో 150వ మెట్టు వద్ద చిరుత నడక దారిని దాటి అడవిలోకి వెళ్లింది. గమనించిన భక్తులు భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్, విజిలెన్స్, ఎస్పీఎఫ్ సిబ్బంది ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. భక్తులకు కర్రలు అందజేసి తిరుమలకు గుంపులు గుంపులుగా పంపారు.

## అవయవదానంతో ముగ్గురికి ప్రాణదానం

తాడేపల్లి టౌన్ : బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానం ముగ్గురికి పునర్జన్మ ఇచ్చింది. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన గుడివాడ హరి విజయకుమార్(46) వ్యక్తిగత పనుల నిమిత్తం శుక్రవారం మంగళగిరికి రాగా ఫిట్స్ వచ్చి పడిపోవడంతో మణిపాల్ ఆసుపత్రికి తరలిచారు. మెదడులో రక్తస్రావం కావడంతో బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. విజయకుమార్ కుటుంబ సభ్యుల అంగీకారంతో ఒక కిడ్నీ కాలేయాన్ని మణిపాల్ ఆసుపత్రిలో అవసరమైన వారికి అమర్చారు. మరొక కిడ్నీని విజయవాడ కామినేని ఆసుపత్రికి, కళ్లను ఎల్‌వి ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు తరలించినట్టు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ కె.రాంబాబు, మణిపాల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.





» 41 రోజుల కఠిన దీక్షతో అమ్మ కటాక్షం

» నేటి నుంచి భవానీ మండల దీక్షల స్వీకరణ

# జై భవానీ..

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో భవానీ దీక్షల స్వీకరణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. 41 రోజుల కఠిన దీక్షతో అమ్మవారి కటాక్షం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుతం మండల దీక్షలు (41 రోజులు) ప్రారంభమవుతాయి. తరువాత మరో 20 రోజులకు అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. కొందరు భక్తులు 11 రోజుల దీక్ష కూడా స్వీకరిస్తారు. దీక్షాకాలం పూర్తి అయ్యాక ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలోనే విరమణ చేస్తారు. వీలుకాని భక్తులు తాము ఉంటున్న ప్రదేశాలలోనే అమ్మవారి ఆలయానికి వెళ్లి విమరణ చేయాల్సి ఉంటుంది. కాగా చాలామంది భక్తులు దసరా ఉత్సవాల ప్రారంభం సమయంలో 11 రోజుల దీక్ష తీసుకుని విరమణ చేశారు. నవంబరు 1 ఉదయం 8.45 గంటల నుంచి 5వ తేదీ వరకు భవానీ మండల దీక్ష ధారణలు ప్రారంభమవుతాయి. అర్ధమండల దీక్షలు నవంబరు 21 నుంచి 25 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 4వ తేదీ కలశజ్యోతి ఉత్సవం, డిసెంబరు 11 నుంచి 15 తేదీ వరకు భవానీదీక్ష విరమణలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, శతచండీయాగం, గిరి ప్రదక్షిణలు జరుగుతాయి. ఈ సందర్భంగా దుర్గగుడిలో డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తారు.

### అమ్మ అనుగ్రహం

భవానీ దీక్షల కోసం అత్యంత జాగ్రత్త పాటించాల్సి ఉంటుంది. అమ్మ అనుగ్రహం పొందాలనుకునేవారు ఎంతో భక్తితో మాలను ధరిస్తారు. నిత్యం అమ్మవారి నామస్మరణ చేయాలి. ఇతరులను 'భవానీ' అని పలకరిస్తారు. వారి హృదయంలో కనకదుర్గమ్మ కొలువై ఉన్నట్టు భావించాలి. దీక్షా కాలంలో చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉండాలి.

### శక్తి స్వరూపిణి..

అత్యంత శక్తిస్వరూపిణి అమ్మవారి అనుగ్రహం కోసం భక్తతలు దీక్షను చేపడుతారు. భక్తిశ్రద్ధలతో నియమాలను అనుసరిస్తారు. ఎరుపు రంగు వస్త్రాలు ధరిస్తారు. దీక్ష చేపడితే సకల ఫలాలు దక్కుతాయని హిందూ ధర్మ గ్రంథాలు చెబుతున్నాయి. సంతాన ప్రాప్తి, మనో ధైర్యం కలిగేందుకు మనస్సు నిర్మలంగా ఉండేందుకు, శుభాలు కలిగేందుకు, అమ్మవారి కటాక్షం పొందేందుకు ఈ దీక్ష చేపడతారు. దీక్ష చేపడితే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకం ఉంది. దీక్షలో ఉన్నంత కాలం అమ్మవారికి నిత్యం రెండు పూటలా పూజా కార్యక్రమాలు చేపడతారు. చివరిరోజు అమ్మవారి ఆలయానికి చేరుకుని దీక్ష విరమిస్తారు. 41 రోజుల పాటు అనుసరించిన మంచి నడతను దీక్ష విరమించిన తరువాత కూడా కొనసాగించ గలిగితేనే దీక్ష స్వీకరణకు అర్థముంటుందని చెబుతారు.

### దీక్షా నియమాలు..

వీలైతే ఇంట్లో అమ్మవారికి త్రికాల పూజలు, భజనలు చేయడం, సాత్విక ఆహారాన్ని స్వీకరించడం, నేలపై పడుకోవడం, చన్నీటి స్నానం చేయడం, నుదుటన ఎర్రటి కుంకుమ బొట్టును పెట్టుకోవడం, బ్రహ్మచర్యం పాటించడం వంటి పలు నియమాలను అనుసరించడం ద్వారా దీక్షకు పరిపూర్ణత వస్తుందని చెబుతారు. శాంభవి, శాంకరి, కనకదుర్గాంబ, కంచి కామాక్షి, కాళి, పార్వతి, శంభురాణి, భవాని, సురపూజితగా భక్తులు కొలుస్తారు. శక్తిలోపం లేకుండా ఉన్నంతలో ఆమెకు అర్ఘనాదులను సమర్పిస్తారు. తమపై అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటారు. దుర్గగుడి మహామండపం 6వ అంతస్తులో శనివారం ఉదయం 8.45 గంటల నుంచి భవానీ మండల దీక్షా స్వీకరణలు ప్రారంభం కానున్నట్టు ఈవో వీకే శీనా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆపరేషన్ నార్కోస్.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై రైల్వే నిఘా

రైల్వేస్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ నార్కోస్' కింద విజయవాడ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), దక్షిణ మధ్య రైల్వే, ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), క్రైమ్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (సీఐబీ), క్రైమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్‌లు (సీపీడీఎస్)తో కలిసి నిర్వహించిన వేగవంతమైన, సమన్వయ కార్యకలాపాలలో రైళ్లు, రైల్వే ప్రాంగణాల ద్వారా అక్రమంగా రవాణా అవుతున్న ఎండు గంజాయిని విజయవంతంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్లు అక్టోబర్ 24-30 మధ్య డివిజన్‌లోని కీలక స్టేషన్లలో జరిగాయి. రైల్ మదద్ సమాచారం, ప్రయాణికుల ఫిర్యాదులపై చర్య తీసుకుంటూ, ఉమ్మడి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అసాధారణ నిఘా అంతర్-సంస్థ సమన్వయాన్ని ప్రదర్శించాయి. సుమారు రూ.8.79 లక్షల విలువైన190.3 కిలోగ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నేరస్థులను అరెస్టు చేశారు. సామర్లకోట, బాపట్ల, రాజమండ్రి, గూడూరు, ఒంగోలు రైల్వే స్టేషన్లలో ఈ దాడులు జరిగాయి. నిషిద్ధ వస్తువులను స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యల కోసం నేరస్థులను అప్పగించారు.




గంజాయి పట్టుకున్న పోలీసులు (ఫైల్)



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పలువురు భక్తులు పొంగళ్లు సమర్పించారు. కాగా, వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.

# కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు!

» పోడియం వద్ద పాలకపక్షం ఆందోళన » 3 నెలలపాటు వైసీపీ సభ్యుడు సస్పెన్షన్

జగ్గయ్యపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ సభ్యుడు వట్టెం మనోహర్ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని లేపాయి. పాలకపక్ష టీడీపీ, జనసేన పార్టీ నేతలు చైర్‌పర్సన్ పోడియం ముందుకు వచ్చి వైసీపీ సభ్యుడి వ్యాఖ్యలు ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పాలని ఆందోళన చేశారు. దానికి అతను అంగీకరించకపోవటం 3 నెలల పాటు చైర్‌పర్సన్ సస్పెండ్ చేశారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వైసీపీ సభ్యుడు వట్టెం మనోహర్ పారిశుధ్య విభాగంలో ఉపయోగించే కత్తులు, పళ్ల దంతెలు, పలుగు, కొడవళ్లకు సంబంధించి నాలుగు అంశాలుగా సుమారు రూ.20లక్షలు వెచ్చించిన అంశాలపై అభ్యంతరం తెలిపారు. చైర్మన్ రాఘవేంద్ర జోక్యం చేసుకుని నాలుగు అంశాలను పొరపాటుగా వేర్వేరుగా చేర్చారని, 4 అంశాలు కలిపి రూ.4.99లక్షలకు ఆమోదం తెలపాలన్నారు. దీనిపై వట్టెం తాను గుర్తిస్తే పొరపాటు అని చెబుతున్నారన్నారు. గత ఏడాది వరదలకు ప్రభుత్వం ఇచ్చిన రూ.50లక్షల గ్రాంట్ పోను మిగిలిన రూ.33లక్షలు సాధారణ నిధులు నుంచి చెల్లింపులపైన వట్టెం అభ్యంతరం తెలిపారు. మంచినీటి సరఫరా పేరుతో లక్షల రూపాయాల అవినీతి చేశారన్నారు. గతంలో జరిగిన అంశాలను టీడీపీ కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, కన్నెబోయిన రామలక్ష్మి ప్రస్తావించబోతుండగా వట్టెం చైర్‌పర్సన్‌గాని టీడీపీ కౌన్సిలర్లకు గాని అర్హత లేదనటంతో చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలను వెనక్కి తీసు కోవాలని పలుసార్లు సూచించినా ససేమిరా అన్నారు. దాంతో పాలకపక్ష కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ వెంకట్ పోడియం ముందు బైఠాయించారు. వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినా టీడీపీ, జనసేన కౌన్సిలర్లు తగ్గలేదు. చివరకు చైర్మన్ రాఘవేంద్ర మనోహర్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించి, ఐదు నిమిషాలు సభను వాయిదా వేశారు.



కౌన్సిలర్ మనోహర్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని చైర్‌పర్సన్ పోడియం వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

అధ్యక్ష స్థానంపై గౌరవం లేకుండా మాట్లాడటంతో వట్టెం మనోహర్‌ను కౌన్సిల్ అభిప్రాయం మేరకు మూడు నెలల పాటు సస్పెండ్ చేశామని చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. సమావేశంలో మాట్లాడే అర్హత లేదనటం దారుణమని చెప్పారు. బాధగా ఉన్న కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన బాధ్యతను తెలిపేందుకు చర్యలు తీసుకున్నామని సమర్ధించుకున్నారు. వచ్చే మూడు నెలలు పురపాలక సంఘానికి స్వర్ణయుగమని అమృత్ 2.0 కింద రూ.11కోట్లతో చేపట్టే పనులకు, రూ.7 కోట్ల డీఎంఎఫ్ గ్రాంట్‌తో చేపట్టనున్న పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మురుగు నీటి సరఫరా వ్యవస్థ ప్రక్షాళన కోసం ఎస్టీపీలకు రూ.25కోట్లు మంజూరై తున్నట్టు తెలిపారు. వచ్చే రిపబ్లిక్ దినోత్సవం నాటికి తిరంగా పార్కును కేసీపీ సిమెంట్స్ సహకారంతో పూర్తి చేయించి వినియోగంలోకి తేబోతు న్నట్టు చెప్పారు. మంచినీటి సరఫరా, హెడ్ వాటర్ వర్క్సులో కలిగే ఇబ్బందులు, అంతరాయాలపై ఇంజనీరింగ్ అధికారులు కనీస సమాచారం ఇవ్వకపోవటంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు!

» రూ.9,79,359 రికవరీకి డ్వామా పీడీ ఆదేశం

ఉంగుటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ విచారణ కార్యక్రమం ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అధ్యక్షతన జరిగింది. 2024-25సం. మండలంలోని 27పంచాయతీల పరిధిలో 13.34కోట్ల పనులు జరగ్గా గ్రామాల్లో కొద్దిరోజులుగా సామాజిక తనిఖీ బృందం తనిఖీచేసి సిద్ధంచేసిన నివేదికలను ప్రజావేదికలో అందజేసింది. వీటి ఆధారంగా పనుల్లో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. బాధ్యులనుంచి రూ.9,79,359లు రికవరీకి ఆదేశించారు. దీంతో పాటు సిబ్బందికి రూ.1.67000/లు జరిమానా విధించారు. కాగా రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎలుకపాడు సీనియర్ మేట్ అజ్మీర గోపిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, అంబుడ్స్‌మెన్ కె.శ్రీనివాసరావు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్లు కరెక్టే..

(5వ పేజీ తరువాయి)

ఉండాలన్న అభిప్రాయాన్ని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బొడే ప్రసాద్ వెలిబుచ్చారు. మైలవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పోరాడారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతిపాదనను ఆయన కూడా స్వాగతించారు. మైలవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ఆయన కూడా జిల్లా యంత్రాంగానికి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నారు.

### పోలీస్ సబ్ డివిజన్ల ప్రకారం..

గన్నవరంలో పోలీసు శాఖ సబ్ డివిజన్ ఉంది. కాబట్టి అక్కడ రెవెన్యూ డివిజనల్ కేంద్రం ఏర్పాటుకు ఇబ్బందులు ఉండవు. ఒక నియోజకవర్గం వేర్వేరు నియోజకవర్గాల పోలీసు స్టేషన్ల సమస్యలు కూడా తప్పుతాయి. మైలవరంలో పోలీసు సబ్ డివిజన్ లేదు. తిరువూరులో ఉన్న ఆ సబ్ డివిజన్‌ను మైలవరంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉండటంతో పాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

### విజయవాడ రూరల్ మండలానికి భవిష్యత్తులో పరిష్కారం

ప్రభుత్వం చెబుతున్న 'ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్' అనే అంశం విజయవాడ రూరల్ మండలం విషయంలో కుదిరేలా లేదు. ఎందుకంటే విజయవాడ రూరల్ మండలం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోనిది. ఒకే రెవెన్యూ డివిజన్ (విజయవాడ డివిజన్) పరిధిలో ఉంది. గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తే.. విజయవాడ రూరల్ మండలం రెండు నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. ఈ పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గ పునర్విభజనతో ఈ సమస్యకు చెక్ పడుతుంది. ఎందుకంటే విజయవాడ రూరల్ మండలం ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటుచేసే అవకాశం ఉంది. ఈ మండలంలో 1.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇది పెడన నియోజకవర్గంతో సమానం. కాబట్టి భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజనలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

## పత్తి రైతు చిత్తు

(5వ పేజీ తరువాయి)

పక్షంలో పత్తి రైతులకు పెద్దగా ఒనగూరేదేం ఉండదు. ఈ సీజన్‌కు కేంద్రం పత్తికి ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.8,110. గత ఏడాది మద్దతు ధర రూ.7,521 కాగా, కేవలం రూ.589 పెంచారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రైతులకు మద్దతు ధర దక్కటం కష్టం. రంగుమారిన, గుడ్డి, కాయ పత్తిని సీసీఐ లెక్కల్లో పరిగణించదు. రైతులు బయట తక్కువ ధరకు అమ్ముకోవాల్సిందే. తేమ శాతం విషయంలోకూడా సీసీఐ నిబంధనలు కట్టుదిట్టంగా ఉన్నాయి. 12 శాతానికి మించి తేమ ఉంటే పత్తిని కొనుగోలు చేయరు. ఈ నిబంధనను పకడ్బందీగా అమలు చేస్తామని సీసీఐ పేర్కొంది. నిబంధనలు సడలించాలని, తమకు మద్దతు ధర లభించి, ప్రయోజనం కలిగేలా ఉండాలని రైతులు కోరుతున్నా సీసీఐ ఆలకించట్లేదు.

### రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రభుత్వంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం సాయం ప్రకటించి, తమను ఆదుకోవాలని కోరుతున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు తమ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా వేడుకుంటున్నారు.

### - జిల్లాలో 95 ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసం

మొంథా తుపాను ప్రభావానికి జిల్లాలోని విజయవాడ, మైలవరం ఆర్అండ్‌బీ డివిజన్లలో 239.43 కిలోమీటర్ల మేర 95 రోడ్లు దెబ్బతిన్నాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. విజయవాడ డివిజన్‌లో 37.02 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 132.39 కిలోమీటర్లు మేర జిల్లా ప్రధాన రహదారులు, మైలవరం డివిజన్‌లో 11.66 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 58.360 కిలోమీటర్ల మేర జిల్లా ప్రధాన రహదారులు దెబ్బతిన్నట్టు వివరించారు. అలాగే, కృష్ణాజిల్లాలోని 86 రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులపై చెట్లు నేలకొరిగాయని ఆర్ అండ్‌బీ అధికారులు ధ్రువీకరించారు.

## భిక్షాటన చేసే వారికి..

(5వ పేజీ తరువాయి)

రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు జారీచేసి సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావాలి. ప్రధానంగా వ్యవస్థీకృత భిక్షాటనకు పాల్పడే వారిని అరెస్టు చేయాలి. వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేయాలి. వారి చెరలో ఉన్న చిన్నారులు, దివ్యాంగులకు విముక్తి కల్పించాలి. భిక్షాటన దుష్పలితాలపై విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

### జిల్లాలో వెయ్యికి పైగానే..

జిల్లాలో వెయ్యికి పైగానే భిక్షాటన చేసే వారున్నారని అధికార యంత్రాంగం ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో వారందరినీ గుర్తించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా విజయవాడ నగరంలోనే 600కు పైగా భిక్షాటకులు ఉన్నట్టు కార్పొరేషన్ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. కొన్నేళ్లుగా స్మైల్ అనే స్వచ్ఛంద సంస్థ సీతారామపురంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి పలువురు భిక్షాటకులకు ఆశ్రయం కల్పించింది. రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో అత్యధికంగా భిక్షాటకులు ఉంటారని, బెంజిసర్కిల్, ఏలూరు రోడ్డు, బీసెంట్ రోడ్డు, వన్‌టౌన్ మార్కెట్, రైతుబజార్లు, పెట్రోల్ బంకులు, ఆలయాల వద్ద కాస్త తక్కువసంఖ్యలో ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఎంతోమంది నగరంలో భిక్షాటన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వీరి సంఖ్య ఎక్కువగానే ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

వెళ్లారు. 15 రోజుల కిందట శ్రీనివాస్ భార్య. తన కారులో శేషగిరిరావు, అనసూయను ఎక్కించుకుని బంధువుల ఇంటికి వెళ్తుండగా మార్గంమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన శేషగిరిరావు, అనసూయను ఆసుపత్రిలో చేర్పించారు. 15 రోజులుగా చికిత్స పొందుతున్న వారు గత సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ భార్యకు, అతని కుమారుడికి గాయాలయ్యాయి. శేషగిరిరావు, అనసూయ పార్థీవదేహాలను శనివారం గోకరాజుపల్లికి తీసుకొస్తున్నారని బంధువులు తెలిపారు.

## కోపా స్కాలర్‌షిప్‌లకు ఆహ్వానం

సత్యనారాయణపురం : కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కాపు అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కోపా) దరఖాస్తులను కోరుతున్నట్టు కోపా అధ్యక్షకార్యదర్శులు దావులూరి కైలాసరావు, దుట్టా రమేష్ తెలిపారు. ముత్యాలంపాడులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత 28 సంవత్సరాలుగా ఉమ్మడి కృష్ణాజిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకారవేతనాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్, డిప్లమో తదితర కోర్సులలో చదువుతన్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9440239989, 7093639919 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాతయ్య

## రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటలను విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. తిరుమలగిరి గ్రామంలో సాంబశివ టీఎంసీ యూనిట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో పత్తిలో తేమ శాతం అధికంగా ఉండటంతో 18 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారని దీనిపై మంత్రి అచ్చంనాయుడుతో ఫోన్‌లో సంప్రదించగా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు చేసేలా చూస్తామని తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కట్టా నరసింహారావు, దూళిపాళ్ల లక్ష్మణరావు, ఏడీఏ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు గాజుల అలంకరణ

భారతీనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గుణదల హనుమాన్ నగర్‌లో శుక్రవారం కనకదుర్గ ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప ఆధ్వర్యంలో జరిగాయి. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.



## ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాలి

### ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కృష్ణలంక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయి పేరుతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం సరికాదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు బకాయిలను విడుదల చేయాలని, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు పెట్టే బాధలు నుంచి విముక్తి కల్పించాలని పేర్కొన్నారు. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం అనేక ఉత్తర్వులను విడుదల చేసినప్పటికీ కళాశాలల యాజమాన్యాలు వాటిని తుంగలో తొక్కి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని దుయ్యబట్టారు. ఫీజు బకాయిల కోసం ఒత్తిడి చేస్తున్న విద్యాసంస్థలపై ఫిర్యాదు చేసేందుకు బాధితుల కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేకమైన గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసిందని శ్రీనివాస్ తెలిపారు.

## జగన్ విమర్శలు అర్థరహితం

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విపత్తు సమయంలో జగన్ చేసిన విమర్శలు అర్థరహితమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న) అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాను సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో జగన్ రెడ్డి ప్రజలను పక్కదారి పట్టించేందుకు తన రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు ప్రచారం చేయటం, తన మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయటం అలవాటుగా మారిందన్నారు. జగన్ లాంటి వ్యక్తి రాజకీయాలలో ఉండటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని విమర్శించారు.

# పారిశుధ్య సమస్యలు తలెత్తనీయొద్దు

### నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహాత్మాగాంధీరోడ్డు, సిరీస్ కంపెనీ, రామచంద్రనగర్, మహానాడు రోడ్డు, బెంజిసర్కిల్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు ప్రాంతాల్లో పలువురు అధికారులతో కలిసి కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో ఎటువంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, రహదారులన్నీ పరిశుభ్రంగా ఉండాలని, చెత్త వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికి సేకరించిన వ్యర్థాలను జిందాల్ ప్లాంట్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించి గోతులు లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కృష్ణలంక జాతీయ రహదారి సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అధికారులు తదితరులు పాల్గొన్నారు



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

## ఎంపీ శివనాథ్‌కు న్యాయవాదుల సత్కారం



ఎంపీ కేశినేని శివనాథ్‌ను సత్కరిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎంపీ కేశినేని శివనాథ్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల బెజవాడ బార్ అసోసియేషన్ భవనం ఆధునికీకరణకు రూ.30 లక్షలు ఎంపీ నిధుల నుంచి కేటాయించిన సందర్భంగా గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వద్ద ఎంపీ శివనాథ్‌ను కలిసి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలియజేశారు. బార్ అసోసియేషన్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, బార్ అధ్యక్షుడు ఏకే బాషా, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, న్యాయవాదులు ఉన్నారు.





వీఎంసీ కార్యాలయంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది, జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్, డైరెక్టర్

## వీఎంసీలో ఘనంగా సర్దార్ పటేల్ జయంతి

కార్పొరేషన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్ తదితరులు సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (జనరల్) రవీంద్రరావు మాట్లాడుతూ అక్టోబరు 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, పర్యవేక్షణ ఇంజనీర్ (ప్రాజెక్ట్) పి. సత్యకుమారి, ఈఈ శ్రీనివాస్, మేనేజర్ ప్రభావతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో**

మొగల్రాజపురం: స్థానిక జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవం పురస్కరించుకుని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా, సిబ్బంది, పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు 33కేవీ పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ హైస్కూల్ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. మసీదు వీధి, శంకర్ మఠం వీధి, బాబురావు వీధి, బీచ్ రోడ్డు, లాల్ బహదూర్ రోడ్డు, పెద్ది వారి వీధి, గుండు కోటయ్యవీధి, కల్పానా ప్రింట్స్ రోడ్, రెహమాన్ వీధి, వల్లూరు వారి వీధి, పచ్చమేడ బజార్, గుంటూరు వారి వీధి, రాణిగారితోట ప్రాంతంలో కొంత ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్‌కు రాష్ట్ర జట్లు పయనం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నవంబరు 1 నుంచి 6వరకు జరగనున్న 22వ జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు పయనమైనట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ పురుషుల, మహిళల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులకు అధ్యక్షుడు వి.శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీనగర్ కు పయనమైన పురుషులు, మహిళల జట్లు





## తుఫాను బాధితులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ

కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న తుఫాను ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని అధికారులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. విజయవాడ రెవెన్యూ డివిజన్‌లోని 27 పునరావాస కేంద్రాల్లో ఉన్న 348 కుటుంబాలకు జేసీ ఇలక్కియా, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య నిత్యావసరాలు అందజేశారు.

**గుణదల:** స్థానిక రెండో డివిజన్లోని వాణిపబ్లిక్ స్కూల్ వద్ద ఆశ్రయం పొందుతున్న కొండప్రాంత వాసులకు వరద సాయం అందించే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బాధితులకు 25కేజీల బియ్యం, రూ.3వేల నగదు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, రెండో డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, సుఖసాని కృష్ణ ప్రసాద్, ఎమ్మార్వో రోహిణీ దేవి, సివిల్ సప్లయిస్ ఏఎస్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

## ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌పై అక్రమ కేసు కొట్టివేత

విజయవాడ లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేపట్టిన ఆందోళనలపై వైసీపీ ప్రభుత్వం అక్రమంగా నమోదు చేయించిన కేసును శుక్రవారం ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించి శుక్రవాం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోర్టుకు హాజరయ్యారు. గతంలోనే వాదనలు విన్న న్యాయమూర్తులు శుక్రవారం తుది తీర్పును ఇస్తూ ఆ కేసును కొట్టి వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబించిన అరాచక పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆందోళనను అణిచివేయడానికి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేసిందన్నారు. ఈ అక్రమ కేసులను కోర్టు కొట్టివేయడం పట్ల గద్దె సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై అవగాహన



మాట్లాడుతున్న రాష్ట్ర సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టర్ అన్నపూర్ణ

మొగల్రాజపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై ఒకరోజు అవగాహన కార్యక్రమం శుక్రవారం బిషప్ అజరయ్య హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్ పి.వనజ, ఎన్.అమ్మినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతిలో బుద్ధిమాద్యం, వినికిడి లోపం, దృష్టిలోపం, అంగ వైకల్యం ఉన్న పిల్లలు స్క్రైబ్ ను ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ జారీ చేసే అధికారి హర్ష మాట్లాడుతూ సర్టిఫికెట్ ఎలా పొందాలి, దాని ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా వికలాంగుల సంక్షేమ ఏడీ కామేశ్వరరావు, జిల్లా ఐఈడీ కో- ఆర్డినేటర్ కె.నారాయణ మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వ్యక్తులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. జిల్లా, మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ లెవల్ టేబుల్ టెన్నిస్‌లో వసుధకు ప్రథమస్థానం

లబ్బీపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్టేట్ లెవల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో శారద విద్యాసంస్థల విద్యార్థిని కె.వసుధ ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 19జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా వసుధ చాంపియన్ షిప్ సాధించింది. ఈ సందర్భంగా వసుధను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రమేష్‌బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



వసుధను అభినందిస్తున్న శారద విద్యాసంస్థల చైర్మన్ రమేష్ బాబు, శారదా దేవి





## యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

### ప్రముఖ సైకాలజిస్టు ఫౌజియా తరోణమ్

లబ్బీపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోషల్ మీడియాను దుర్వినియోగం చేయకుండా తమ ప్రగతికి మెట్లుగా ఉపయోగించుకోవాలని ప్రముఖ సైకాలజిస్టు ఫౌజియా తరోణమ్ పేర్కొన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం, ఫిక్కీ ఫ్లో విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో డిజిటల్ ప్రపంచంలో శక్తిని అన్‌లాక్ చేయడంలో మహిళల పాత్ర అనే అంశంపై మూడురోజుల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, ఇతరులకు ఉపాధి అవకాశాలను కల్పించి దేశపురోభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రిన్సిపాల్ వి.వి.సుబ్రహ్మణ్యం, అట్లూరి సుమ. వి.సంధ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 9 నెలలు పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబూరావు విమర్శించారు. నగరంలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద ప్రభుత్వం, కాంట్రాక్టర్ తీరుకు నిరసనగా కాంట్రాక్ట్ కార్మికులు, సీఐటీయూ, కేవీపీఎస్ శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, వీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే రాబోయే రోజుల్లో అంబేడ్కర్ స్మృతివనం మొత్తం బంద్‌చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు ప్రతి నెల జీతాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ సెంట్రల్ అధ్యక్షుడు కె.దుర్గారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జి.క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శి కాజా సరోజ పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు, సీఐటీయూ, కేవీపీఎస్ ధర్నా



డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సౌమ్యలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## నూతన దంపతులకు సీఎం చంద్రబాబు ఆశీర్వాదం

భారతీనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీ భవన్ (ఢిల్లీ) స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ కుమారుడు డాక్టర్ రాజశేఖర్ వివాహం డాక్టర్ సౌమ్యతో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ కాలనీలోని అర్జా శ్రీకాంత్ నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎంపీ కేశినేని శివనాథ్, శ్రీరామచంద్రనగర్ కాలనీ అధ్యక్షుడు పి.సీతారామచౌదరి, కనకదుర్గ నగర్ కాలనీ అధ్యక్షుడు జి.నారాయణరావు, కొరెన్సీనగర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, గణేష్ నగర్ కాలనీ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, నాగార్జుననగర్ కాలనీ అధ్యక్షుడు సుబ్బారావు, మూడో డివిజన్ టీడీపీ అధ్యక్షుడుగద్దె రమేష్, తదితరులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం పలికారు.

## ఎంటీపీ రిజిస్ట్రేషన్ లేకుండా అబార్షన్ చేస్తే చర్యలు

● ఎన్టీఆర్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని

విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేని ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు గర్భిణులకు అబార్షన్ నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు తప్పనిసరిగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టపరిధిలో రిజిస్టర్ అయ్యుండాలని, అదే విధంగా రిజిస్టర్ అయిన ఆసుపత్రులు కాలపరిమితి ముగుస్తున్న సందర్భంగా రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. సంబంధిత రిజిస్టర్‌లు, నివేదికలు నిర్వహణ చేయడంతో పాటు ప్రతి నెలా జరిగిన అబార్షన్‌ల వివరాల జాబితాను డీఎంహెచ్‌వో ఆఫీసుకు స మర్పించాలన్నారు. అబార్షన్ చేయించుకోవాలనుకునే గర్భిణులు కూడా ఎంటీపీ చట్టం పరిధిలో రిజిస్టర్ అయిన ఆసుపత్రులకు మాత్రమే వెళ్లాలన్నారు.

## కేయూ రెక్టార్ బసవేశ్వరరావుకు శిక్షక్ సమ్మాన్ అవార్డు



మురళీ మనోహర్ జోషి నుంచి అవార్డు అందుకుంటున్న బసవేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావుకు ప్రతిష్ఠాత్మకమైన శిక్షక్ సమ్మాన్ అవార్డును శుక్రవారం ఢిల్లీలో అందుకున్నారు. ఎఫ్‌డబ్ల్యుఏ అకడమిక్ వార్షికోత్సవంలో బసవేశ్వరరావుకు ఈ అవార్డును కేంద్ర మాజీ మంత్రి పద్మభూషణ్ డాక్టర్ మురళీ మనోహర్ జోషి అందజేశారు. ఎఫ్‌డబ్ల్యుఏ అధ్యక్షుడు రిజ్వీ తదితరులు పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో విశేష సేవలందిస్తున్నందుకు బసవేశ్వరరావుకు ఈ అవార్డును అందజేశారు. వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, డైరక్టర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లో రాజధాని రైతుల అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీ ఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. రాజధాని ప్రాంతవాసులు, రైతుకూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని నోడల్ అధికారి తెలియజేశారు. సీఆర్‌డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారుల ఫిర్యాదులకు కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం తగదని నోడల్ అధికారి సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, బి.శ్రీనివాస నాయక్, జి.భీమారావు, జోనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.మధుసూధనరావు, ఏపీసీఆర్‌డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



# వైద్యవిద్యలో నూతన ఒరవడి

● తొలి హెల్త్ యూనివర్సిటీ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం
● ఉన్నత ప్రమాణాల వైద్యులనందించడంలో ఘనత
● నేడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

జీవనశైలిలో చోటుచేసుకున్న అనూహ్య మార్పులతో కొత్త రోగాలు, వైరస్‌లు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే నిపుణులైన వైద్యులు చాలా అవసరం. వైద్యవిద్యా రంగంలో ప్రపంచ ధోరణులను అన్వయించుకుంటూ ఆధునిక వైద్యశాస్త్రం బాటలో విద్యార్థులను తీర్చిదిద్దితేనే నేడు వైద్య రంగంలో రాణించగలరు. అధికశాతం మంది వైద్యవిద్యనభ్యసిస్తున్నా, ఎంత మంది నాణ్యమైన వైద్యులుగా బయటకు వస్తున్నారనేది ప్రశ్నార్థకం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ ఉన్నత ప్రమాణాల వైద్య విద్య నందిస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కేంద్రంగా 1986లో ఎన్టీఆర్ యూనివర్సిటీని స్థాపించారు. 1998లో దీనికి డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అని పేరు మార్చారు. 19 ఏళ్ల విద్యా ప్రయాణంలో అనేక అత్యుత్తమ ఫలితాలు సాధించిన యూనివర్సిటీ ద్వారా పట్టభద్రులైన వేలాది మంది డాక్టర్లు దేశ, విదేశాల్లో వైద్య సేవలందిస్తున్నారు.

దేశంలోనే మొదటి సారిగా స్థాపించిన వైద్య విశ్వవిద్యాలయంగా ఎన్టీఆర్ యూనివర్సిటీ గుర్తింపు పొందింది. ప్రస్తుతం యూనివర్సిటీ పరిధిలో 356 అనుబంధ కాలేజీలు ఉన్నాయి. యూనివర్సిటీలో చదువున్న వారిలో అధిక శాతం మంది విదేశాల్లో స్థిరపడ్డారు. ఇక్కడి విద్యనభ్యసించి, ఉన్నత స్థాయిలో స్థిరపడిన వైద్యులు ఎందరో ఉన్నారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం నాణ్యమైన వైద్యులను తయారుచేసే ఫ్యాక్టరీగా మారిందని కొందరు నిపుణులు చెబుతున్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ, డాక్టోరల్, డెంటిస్ట్రీ, పీహెచ్‌డీ వంటి 129 కోర్సులు యూనివర్సిటీ అనుబంధ కాలేజీల ద్వారా కొనసాగుతున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంఎస్, బీయూఎంఎస్, ఎంఎస్, ఎండీఎస్, ఆప్టోమెట్రీ వంటి కోర్సులకు తోడు నర్సింగ్, ఆయుర్వేదం వంటి ప్రత్యామ్నాయ మెడికల్ కోర్సులు కూడా అందిస్తున్నారు. యూనివర్సిటీ యూజీసీ, ఐఎన్‌సీ, సీసీహెచ్, సీసీఐఎం, ఎంసీఐ వంటి జాతీయ సంస్థల గుర్తింపు పొందింది. ఈ క్రమంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్య విద్యను అందించే దిశగా యూనివర్సిటీ కృషి చేస్తోంది. ఆరోగ్య పరిరక్షణ విషయమై ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతుండగా, వైద్య విద్యార్థులు కూడా చికిత్సా నైపుణ్యాన్ని





మెరుగుపరుచుకునే దిశగా కృషి చేస్తున్నారు. వైద్య విద్యలో నాణ్యతాప్రమాణాలను మరింత మెరుగుపరడమే లక్ష్యంగా యూనివర్సిటీ కొత్త కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేసింది. రాబోయే కాలంలో ప్రతి సంవత్సరం స్నాతకోత్సవం నిర్వహిస్తూ వైద్య విద్యా రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే యోచనలో యూనివర్సిటీ ఉన్నట్టు సమాచారం.

### విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించడమే లక్ష్యం



విద్యార్థుల్లో సేవా దృక్పథం, నిబద్ధత, నిజాయితీ, అంకిత భావం పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ వైద్య దినోత్సవాల సం దర్భంగా అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్సిటీ 27, 28వ స్నాతకోత్సవాలు శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 11.30 గంటల నుంచి నిర్వహిస్తున్నాం. 2021, 2022 స్నాతకోత్సవాల్లో 120 మంది విద్యార్థులకు 156 పతకాలు, 38 మందికి నగదు బహుమతులు, ఐదుగురికి పీహెచ్‌డీ పట్టాలు, సూపర్ స్పెషాలిటీలో ఢిల్లీ నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఓపీ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నాం. గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారు.

- డాక్టర్ పి.చంద్రశేఖర్, వైస్ చాన్సలర్

# కష్టం మింగేస్తున్నారు!

● జీజీహెచ్ సెక్యూరిటీ ఆవేదన
● మూడు నెలలుగా వేతనం చెల్లించని కాంట్రాక్టు సంస్థ

● వారాంతపు సెలవులకూ జీతం కట్ ● అడిగితే బెదిరింపులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి ఇచ్చే వేతనంలో కాంట్రాక్టరు చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. కాంట్రాక్టు సంస్థ ఒప్పందం ప్రకారం జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్, గార్డులకు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. సెక్యూరిటీ వేతనంలో కోత విధించడంతో పాటు వారాంతపు సెలవులకు జీతం కట్ చేయడంతో పాత, కొత్త జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలల కిందట విజయవాడ కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రి, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, దంత వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో మొత్తం 200 మంది సెక్యూరిటీ సిబ్బందితో అజైల్ సంస్థ ద్వారా విధులు నిర్వహించే వారు. కాంట్రాక్టరు గడువు ముగియడంతో తర్వాత రక్షక్ సెక్యూరిటీ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. కొత్త సంస్థ మేలో బాధ్యతలు స్వీకరించిన మొదటి రెండు నెలలు జీతాలు చెల్లించలేదు. దీనిపై కాంట్రాక్టరును ప్రశ్నించగా కొత్తగా కాంట్రాక్టు దక్కించుకున్నామని, అకౌంట్ బదిలీల్లో అంతరాయం ఏర్పడడంతో జీతాల చెల్లింపులో జాప్యం జరిగిందని సమాధానమిచ్చారు. రెండు నెలల జీతం ఒకేసారి వేసినప్పటికీ ఒప్పందం ఒప్పందం ప్రకారం ఇవ్వలేదు. సిబ్బంది ప్రశ్నించకపోవడంతో మళ్లీ కాంట్రాక్టరు మిన్నకుండిపోయాడు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు వేయడంలో మళ్లీ అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని సెక్యూరిటీ సిబ్బంది వాపోయారు.



లేబర్ యాక్ట్ ప్రకారం నెల జీతానికి పని చేస్తున్న ప్రతి కార్మికుడికి వేతనంతో కూడిన వారాంతపు సెల వు తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం కాంట్రాక్టరు వారాంతపు సెలవులకు వేతనంలో కోత విధిస్తున్నట్టు తెలిసింది. ఒప్పందం ప్రకారం సెక్యూరిటీ వ్యవస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వారికి రూ.18,500 వేతనం నిర్ణయించగా పీఎఫ్ కట్‌చేసి రూ.16,100 ఇవ్వాలి. వారాంతపు సెలవుల్లో(వీక్లీ ఆఫ్) కోత విధిస్తూ కేవలం రూ.13,900 మాత్రమే కాంట్రాక్టు సంస్థ ఇస్తోంది. గార్డులకు మొత్తం రూ.16 వేలు నిర్ణయించగా రూ.14,100 ఇవ్వాలి. కానీ రూ.12,100 మాత్రమే ఇస్తున్నారు. గతంలో శానిటేషన్, సెక్యూరిటీకి ఒకరే కాంట్రాక్టరు. దీనితో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌కు రూ.16,200, గార్డుకు రూ.13,900 ఇచ్చేవారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టు సంస్థ ఇందుకు విరుద్ధంగా చిరుద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. సిబ్బంది ఎవరైనా అడిగితే ఇంతే ఇస్తాం, నచ్చితే చేయండి.. లేకపోతే మానేయండి అని కాంట్రాక్టరు దురుసుగా సమాధానమిస్తున్నారని సెక్యూరిటీ సిబ్బందివాపోయారు. తమకు వచ్చే అరకొర జీతంలో కోతలు విధించడంతో పాటు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవడం కూ డా కష్టంగా ఉందని తమ కష్టాలను చెప్పుకొచ్చారు. ఇంతకుముందు అధికారుల చొరవతో రెండు నెలల జీతం ఒకేసారి చెల్లించారని, మళ్లీ అప్పటి నుంచి జీతం వేయలేదని తమ ఆవేదనను చెప్పుకొచ్చారు.

### నోటీసులిచ్చాం

ఆసుపత్రి అధికారులను వివరణ కోరగా, కాంట్రాక్టరు సిబ్బంది వేతనాల్లో కోత విధిస్తుడడంతో పాటు, వారాంతపు సెలవులకు జీతం కట్ చేస్తున్నట్టు తెలియడంతో సంస్థకు ఇప్పటికే నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. మొదటి రెండు నెలల వేతనాలు ఒప్పందం మేరకు చెల్లించకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు అధికారులు చెప్పారు. తాము బిల్లులు పెండింగ్‌లో ఉంచినప్పటికీ ప్రతి నెలా సిబ్బందికి జీతాలు వేయాల్సిన బాధ్యత కంట్రాక్టరుకు ఉందని, ఇప్పటికే ఈ విషయంపైనా కాంట్రాక్టరును హెచ్చరించినట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## ప్రజల బాధలు పట్టని జగన్‌కు మాట్లాడే హక్కు లేదు : దేవినేని ఉమా

● ప్రతి రైతునూ ఆదుకుంటాం

గొల్లపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ప్రజల పట్ల బాధ్యత లేకుండా, పరదాల మధ్య ఎర్ర కార్పెట్‌పై తిరిగిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తుఫాన్లపై మాట్లాడే నైతిక అర్హత లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌కు ప్రజల బాధలు పట్టవన్నారు.

తుఫాను ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ నిరంతర పర్యవేక్షణలో సహాయక చర్యలను ముందుండి నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమర్థవంతమైన చర్యలు పొరుగు రాష్ట్రాల నాయకులకూ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విపత్తు వల్ల నష్టపోయిన ప్రతి రైతు, ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. దెబ్బతిన్న ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని, పంట నష్టాలకు పారదర్శకంగా పరిహారం ఇస్తామని, ఎవరూ నష్టపోకుండా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉమా పేర్కొన్నారు. జగన్ పాలనలో ఐదేళ్లపాటు ప్రజలు నిర్లక్ష్యాన్ని అనుభవించారని ఉమా విమర్శించారు.



ఏక్తార్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్



ఏక్తా ర్యాలీలో సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత



ఏక్తాదివస్‌లో సాంస్కృతిక ప్రదర్శన

# సమైక్యతా స్ఫూర్తిప్రదాత సర్దార్ పటేల్

● విజయవాడలోని ఏక్తా దివస్‌లో వక్తల ఉద్ఘాటన

విజయవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏక్తా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద శుక్రవారం ర్యాలీని ఎంపీ కేశినేని చిన్ని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. వల్లభాయ్ పటేల్ దేశరక్షణ, సమగ్రత కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. బ్రిటీష్ వారు భారత్‌ను విడిచి వెళ్లాక దేశరక్షణ, సమగ్రత కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనా ర్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, సాదినేని యామిని, ఉప్పలపాటి శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు. విజయవాడ సిటీ: ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏక్తా ర్యాలీని నిర్వహించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడి యం వద్ద నుంచి సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాన్ని ఏకీకరణ చేసిన వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకున్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తాదివస్‌ను పండుగలా జరుపుకుంటున్నామని డీసీపీ వివరించారు.



### పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

విజయవాడ సిటీ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఎన్టీఆర్ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగా శుక్రవారం రాత్రి ఎంజీ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. డీ అడ్రస్ మాల్ నుంచి వ్యాస్ క్యాప్లెక్స్ వరకు వీరి ర్యాలీ కొనసాగింది. తొలుత విద్యార్థులుతో కలిసి పోలీసులు మానవహా రంగా ఏర్పడ్డారు. అరాచక శక్తులను అణచివేసే క్రమంలో ప్రాణాలర్పించిన పోలీసులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, డీసీపీలు కె.జి.వి.సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ లక్ష్మీశ

## అంబేడ్కర్ స్మృతివనం...బెజవాడ మణిహారం

● పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చేలా అభివృద్ధి పనులు
● సమష్టి కృషి, సమన్వయంతో అభివృద్ధిలో భాగస్వాములవుదాం
● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం (సామాజిక న్యాయ మహాశిల్పం) విజయవాడ నగర పర్యాటకానికి మణిహారమని, పర్యాటకులకు మరింత మధురానుభూతులు మిగిల్చేలా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ, సాంఘిక సంక్షేమ శాఖ డైరక్టర్ బి.లావణ్యవేణి, భాషా సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఆర్.మల్లిఖార్జునరావు తదితరులతో కలిసి విజయవాడ నగర పాలక సంస్థ, ఏపీఐఐసీ, సాంస్కృతిక, సాంఘిక సంక్షేమ స మన్వయ శాఖల అధికారుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అజయ్ జైన్ ప్రస్తుతం స్మృతివనాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు, అక్కడి సౌకర్యాలు, వనరుల సమర్థ వినియోగం తదితరాలపై సమావేశంలో చర్చించారు అజయ్‌జైన్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నగర పర్యాటక ప్రాంతాల జాబితాలో ముందు వరుసలో ఉండాలన్నారు. నగరానికి వచ్చే ప్రతిఒక్కరూ స్మృతి వనాన్ని సందర్శించేలా, మహనీయుని ఆశయాల స్ఫూర్తిని, విజ్ఞాన వీచికలను భావితరాలకు అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పర్యాటకులకు ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో పాటు చిన్నారుల ఆట స్థలం, ఆడిటోరియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్, మ్యూజియం తదితరాలకు సంబంధించిన అభివృద్ధి పనులను పటిష్ఠ ప్రణాళికతో త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియను చేపట్టి, నియమనిబంధనలకు అనుగుణంగా పూర్తిచేయాలన్నారు. ఎన్టీ ఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వైబ్రెంట్ విజయవాడతో పాటు జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్డీఓ కావూరి చైతన్య, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్దుల్ రహీం, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రమాదేవి, కేపీసీ ప్రాజెక్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ డిజిటల్ ఐడీ అప్‌డేట్ చేసుకోవాలి

● కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ డిజిటల్ ఐడీలను ఎప్పటికపుడు అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్టీఆర్ కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. అమరావతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో శుక్రవారం జర్నలిస్ట్ కుటుంబాల ఆధార్ మేళాను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్ట్‌ల సంక్షేమ కోరుతూ ఆధార్ మేళాను నిర్వహించిన అమరావతిప్రెస్ క్లబ్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. సామాజిక భద్రత కోసం డిజిటల్ ఐడీలు అవసరం ఉంటుందన్నారు. ఆధార్‌లో తప్పులు ఉంటే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని, పాస్‌పోర్ట్ మంజూరు కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ ఆధార్ మేళా కార్యక్రమంలోనే జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా తన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకున్నారు. మొత్తం 51 మంది జర్నలిస్ట్‌లు కుటుంబ సభ్యులతోఆధార్ మేళాను సద్వినియోగం చేసుకున్నట్లు అమరావతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డెం అప్పాజీ, ప్రధాన కార్యదర్శి సి.సతీష్‌బాబు, కోశాధికారి పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు జి.వి.నారాయణ, కమిటీ సభ్యులు శ్యామ్‌సుందర్, మల్లేశ్వరరావు, మహేష్ తెలిపారు.



ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా

## ఏసీపీ దామోదర్‌ను ఆశ్రయించిన ర్యాపిడో రైడర్స్

గుణదల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ర్యాపిడో సంస్థ తమ శ్రమను దోచుకుంటోందని, సంస్థ అనుసరిస్తున్న నూతన విధానాల వల్ల తమకు పూటగడవడం లేదని పేర్కొంటూర్యాపిడో రైడర్స్ శుక్రవారం సెంట్రల్ ఏసీపీ దామోదర్‌ను కలిసి తమగోడును వెళ్లబోసుకుంటున్నారు. కరెన్సీ నగర్‌లోని సంస్థ కార్యాలయాలకి వెళ్లి సంస్థ నూతన విధానాల వల్ల తమకు ఏమీ మిగలడం లేదని విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. వారి సమస్యను విన్న ఏసీపీ దామోదర్ ఈవిషయమై పటమట పోలీస్‌స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
# నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 1 నవంబరు 2025

వంటిల్లు

తియ్యటి సీతాఫలాన్ని ఇష్టపడని వారుండరు. కొంతమంది దీన్ని నిప్పుల మీద కాల్చుకుని తింటుంటారు. సీతాఫలాలతో బాసుందీ, రబ్డీ, మిల్క్‌షేక్... ఇలా ఎన్నో రకాల రుచులు తయారు చేస్తుంటారు కూడా! అలాంటి వాటిలో కొన్ని విభిన్నమైన తియ్యటి రుచులు మీకోసం...





# సీతాఫలంతో తియ్యగా...

## సీతాఫలం కలాకంద్



**కావాల్సిన పదార్థాలు**

సీతాఫలాలు- రెండు, పన్నీర్- 300 గ్రాములు, పాలపొడి- రెండు చెంచాలు, మిల్క్‌మెయిడ్- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, బాదం- ఏడు, పిస్తా- ఆరు, నెయ్యి- ఒక చెంచా

**తయారీ విధానం**

వెడల్పాటి గిన్నెలో పన్నీర్ వేసి చేత్తో మెత్తగా మెదిపి ఉంచుకోవాలి. సీతాఫలాలను చాపర్‌లో వేసి గుజ్జును గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పన్నీర్, సీతాఫలాల గుజ్జు, మిల్క్‌మెయిడ్, పాలపొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గరిటెతో మెత్తగా మెదుపుతూ కలుపుతూ ఉండాలి. పది నిమిషాల తరువాత మిశ్రమం బాగా దగ్గరకు వస్తుంది. చివరగా యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరిచి పైన డ్రై ఫ్రూట్స్ పలుకులు చల్లాలి. కలాకంద్ చల్లారిన తరువాత ముక్కలుగా కోసి సర్వ్ చేసుకోవాలి.

## సీతాఫలం ఐస్‌క్రీమ్

**కావాల్సిన పదార్థాలు**

సీతాఫలాలు- ఆరు, ఫ్రెష్ క్రీమ్- ఒక కప్పు, పాలపొడి- అర కప్పు, పాలు- ఒక కప్పు, పంచదార పొడి- ఒక కప్పు, వెనీలా ఎసెన్స్- అర చెంచా

**తయారీ విధానం**

సీతాఫలాలను మధ్యకు విరిచి, లోపలి గుజ్జును చాపర్‌లో వేసి చాప్ చేయాలి. తరువాత చెంచాతో గింజలు తీసివేసి గుజ్జును గిన్నెలోకి తీసుకోవాలి. ఒక గిన్నెలో పాలపొడి వేసి, అరకప్పు నీళ్లు పోసి, ఉండలు రాకుండా పేస్టులా కలపాలి. వెడల్పాటి గిన్నెలో ఫ్రెష్ క్రీమ్ వేసి మెత్తగా చిక్కగా మారేవరకూ బ్లెండర్‌తో పది నిమిషాలపాటు బ్లెండ్ చేయాలి. ఆపైన పాలపొడి పేస్టు, పాలు, పంచదార పొడి, వెనీలా ఎసెన్స్ వేసి, నురుగులా వచ్చేవరకూ మరోసారి బ్లెండ్ చెయాలి. తరువాత సీతాఫలాల గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక కంటైనర్‌లో పోసి మూతపెట్టి కనీసం పది గంటలపాటు ఫ్రీజర్‌లో ఉంచాలి. ఇది ఐస్‌క్రీమ్‌లా గడ్డ కట్టిన తరువాత గాజు బౌల్స్‌లోకి తీసి సర్వ్ చేసుకోవాలి.



## సీతాఫలం ఫిర్నీ



**కావాల్సిన పదార్థాలు**

సీతాఫలాలు- రెండు, పాలు- ఒక కప్పు, పంచదార- పావు కప్పు, బాస్మతి బియ్యం- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, బాదం- అయిదు, పిస్తా- ఆరు, జీడిపప్పు- కొద్దిగా, కిస్‌మిస్‌లు- ఆరు, నెయ్యి- మూడు చెంచాలు

**తయారీ విధానం**

ఒక గిన్నెలోకి బాస్మతి బియ్యాన్ని తీసుకొని, శుభ్రంగా కడిగి, నిండా నీళ్లు పోసి, గంట సేపు నానబెట్టాలి. తరువాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీయాలి. సీతాఫలాలను చేత్తో మధ్యకు విరచాలి. చెంచా సహాయంతో గుజ్జును తీసి, చాపర్‌లో వేయాలి. దీనిమీద మూత పెట్టి చాపర్ తాడును నాలుగైదుసార్లు లాగి వదలాలి. గుజ్జు నుంచి గింజలు బయటికి వచ్చేస్తాయి. వాటిని చెంచాతో తీసివేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. తరువాత బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో పాలు పోసి, చిన్న మంట మీద మరిగించాలి. పాలు మరుగుతుండగా బాస్మతి బియ్యం పిండిని వేసి గరిటెతో కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చాక సీతాఫలం గుజ్జు, పంచదార, యాలకుల పొడి వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత స్టవ్ మీద నుంచి దించాలి. ముందుగా వేయించి పెట్టుకున్న డ్రైఫ్రూట్స్ పలుకులు, కిస్‌మిస్‌లు చల్లి ఫిర్నీని సర్వ్ చేసుకోవాలి.

## సీతాఫలం మఫిన్స్



**కావాల్సిన పదార్థాలు**

పాలు- అర కప్పు, నిమ్మరసం- ఒక చెంచా, కొబ్బరిపొడి- అర కప్పు, సీతాఫలం గుజ్జు- ముప్పావు కప్పు, చాక్లెట్ చిప్స్- కొన్ని, పంచదార పొడి- రెండు చెంచాలు, గోధుమ పిండి- అర కప్పు, బేకింగ్ పౌడర్- అర చెంచా, వెనీలా ఎసెన్స్- పావు చెంచా, నూనె- రెండు చెంచాలు, చాక్లెట్ సిరప్- పావు కప్పు

**తయారీ విధానం**

ఒక గిన్నెలో పావు కప్పు పాలు పోసి నిమ్మరసం వేసి కలిపి ఉంచుకోవాలి. వెడల్పాటి గిన్నెలో సీతాఫలం గుజ్జు, పంచదార పొడి, బేకింగ్ పౌడర్, వెనీలా ఎసెన్స్, నూనె వేసి ఆపైన నిమ్మరసం కలిపిన పాలు పోసి గరిటెతో బాగా కలపాలి. తరువాత గోధుమ పిండి, కొబ్బరిపొడి వేసి మిగిలిన పాలు కూడా పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుని సిలికాన్ మౌల్డ్‌లలో నింపి పైన చాకోచిప్స్ చల్లాలి. వీటిని ప్రీ హీటెడ్ ఓవెన్‌లో ఉంచి, 180 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద 25 నిమిషాలపాటు బేక్ చేయాలి. తరువాత దాన్ని బయటికి తీసి చల్లారనివ్వాలి.

పూర్తిగా చల్లారిన మఫిన్స్ మీద చాక్లెట్ సిరప్ చిలకరించి సర్వ్ చేసుకోవాలి.

భోజన కుతూహలం

# వీర్యకణాలు పెంచే పుచ్చపండు!

ఒకప్పుడు పుచ్చకాయలు వేసవి కాలంలోనే వచ్చేవి. కానీ ఇప్పుడు పుచ్చకాయలు ఏడాది పొడవునా దొరుకుతున్నాయి. అందువల్ల దీనిని కేవలం వేసవి పండుగా భావించాల్సిన అవసరం లేదు. మన దగ్గర సంవత్సరంలో మూడువందల రోజులూ వేడి ఉంటుంది. అందువల్ల పుచ్చకాయలు తినటం అందరికీ మంచిదే! 'భోజనకుతూహల' పాకశాస్త్ర గ్రంథం ఈ పుచ్చపండును 'కళింగఫలం'గా పేర్కొంది. దీనిలోని ఔషధ గుణాలను వర్ణించింది. ఆ ఔషధ గుణాలేమిటో చూద్దాం.

- పుచ్చకాయలలో ఉన్న అనేక రకాల పోషకాలు రక్తపోటును నియంత్రిస్తాయి.
- దీనిలో ఉండే లైకోపీన్ అనే పదార్థం గుండెకు మేలు చేస్తుంది. చర్మానికి కాంతిని ఇస్తుంది. విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బీ12, పొటాషియం, మెగ్నీషియం లాంటివి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి.
- పుచ్చకాయను రాత్రి తినకూడదు. రాత్రి తింటే కఫం పెరుగుతుంది. మధ్యాహ్నం తింటే త్వరగా అరిగిపోతుంది కాబట్టి ఇబ్బంది ఉండదు.



- పుచ్చకాయ తొక్కకు.. ఎర్రటి కండకు మధ్య తెల్లటి కండ ఉంటుంది. ఇది కీరదోస మాదిరిగా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. దీనిని నిమ్మరసం, పుదీనాలతో కలిపి జ్యూస్ చేసుకొని తాగితే ఎసిడిటీ తగ్గుతుంది. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ తెల్ల కండను ముక్కలుగా చేసి పప్పుగా కూడా వండుతారు. కొన్ని ప్రాంతాలలో దీనితో హల్వా కూడా చేస్తారు.
- పుచ్చకాయ రసం క్రమం తప్పకుండా తాగితే పురుషులలో జీవకణాలు పెరుగుతాయి.

• గంగరాజు అరుణాదేవి

సంకల్పం

# బాధితులకు భరోసా

చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్న మహిళలు వారు. వేరొకరి ఉన్మాదానికి బలైన బాధితులు. యాసిడ్ దాడిలో రూపురేఖలు కోల్పోయి... జీవచ్ఛవంలా మారిన వారికి ఊపిరి పోసి... కొత్త జీవితాన్ని అందిస్తున్నారు కల్సుమ్ షాదాబ్ వాహబ్. నైపుణ్య శిక్షణ ఇచ్చి, అవకాశాలు కల్పించి, స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహిస్తున్నారు. ఆ మధ్య 'మిలాన్ ఫ్యాషన్ వీక్'లో ర్యాంప్‌పై నడిపించి... వారిలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపారు.





“దాదాపు పదిహేనేళ్ల కిందట... బెంగళూరులోని ఓ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారుల కోసం ఆర్ట్ థెరపీ సెషన్ నిర్వహిస్తున్నాను. ఆ సమయంలో ఓ మహిళ నా కంట పడింది. సగం కాలిపోయిన ముఖం, ముడతలు పడిన చర్మం. పక్కనే ఉన్న నర్సును అడిగాను... "ఆమెకు ఏమైంది?" అని. "యాసిడ్ దాడి బాధితురాలు" అని నర్సు చెప్పింది. అప్పటివరకు నాకు తెలియదు... యాసిడ్ దాడి అంటే ఏమిటో! విచారిస్తే... బెంగళూరులో మా ఇంటికి చేరువలోనే ఆ సంఘటన జరిగిందని తెలిసింది. అది నన్ను మరింత బాధించింది. ఇంటికి వచ్చాక కూడా ఆమె ముఖం నా కళ్లల్లో మెదులుతూనే ఉంది. ఆ సంఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ క్షణమే ఒక నిర్ణయానికి వచ్చాను.. ఇలాంటివారికి అండగా నిలబడాలని.

**బళ్లారి నుంచి బెంగళూరుకు...**

నేను పుట్టి పెరిగిందంతా బెంగళూరులోనే. సైకాలజీలో మాస్టర్స్ చేశాను. పెళ్లి తరువాత నా నివాసం బళ్లారికి మారింది. అక్కడ మావారు నిర్వహించే స్వచ్ఛంద సంస్థ 'హోతూర్ ఫౌండేషన్' బాధ్యతలు చూసుకొనేదాన్ని. ఏ దిక్కూ లేని అనాథలు, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేసే సంస్థ ఇది. అదే సమయంలో వికలాంగులైన చిన్నారుల్లో ఆత్మస్థైర్యం నింపే ఉద్దేశంతో 'కలర్స్ ఆఫ్ హోప్' పేరుతో మరో కార్యక్రమాన్ని చేపట్టాను. దేశ వ్యాప్తంగా కేంద్రాలు ప్రారంభించాను. అందులో భాగంగా అనేక ఆసుపత్రులు తిరిగాను. చికిత్స పొందుతున్న చిన్నారులను పలుకరించేదాన్ని. ఈ క్రమంలోనే బెంగళూరు ఆసుపత్రిలో యాసిడ్ దాడి మహిళను చూశాను. వారి కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో... మేం బళ్లారి నుంచి బెంగళూరుకు వచ్చి స్థిరపడ్డాం.

**సర్జరీలకు కూడా...**

“యాసిడ్ దాడిలో గాయపడిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతుంది. కాలిన గాయాలకు చికిత్సలు, సర్జరీలు చేయించుకోవాలంటే లక్షల రూపాయలతో కూడుకున్న పని. అంత డబ్బు భరించలేక, గాయాలతో జీవించలేక తీవ్ర మనోవేదన అనుభవిస్తుంటారు బాధితులు. కొన్ని సందర్భాల్లో అయినవారు కూడా ముఖం చాటేస్తారు. అందుకే మా సంస్థ ద్వారా వారికి సర్జరీలు చేయిస్తున్నాం. పూర్తి స్థాయిలో వైద్య సాయం అందేలా చూస్తున్నాం. ఆ తరువాత వారు సమాజంలో సాధారణ జీవితం గడిపేలా మానసికంగా సిద్ధం చేస్తున్నాం. 'జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 207 యాసిడ్ దాడి కేసులు నమోదయ్యాయి. కొందరిపై రెండుసార్లు కూడా దాడి జరిగింది. వారికి న్యాయం అందడంలో కూడా తీవ్ర జాప్యం చోటుచేసుకొంటోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలనే లక్ష్యంతో... మేం వారికి న్యాయ సహాయం కూడా అందిస్తున్నాం.”

**వారి కోం ఒక వేదిక...**

యాసిడ్ దాడి బాధితులను గుర్తించి, వారిని ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు నా ప్రయత్నాలు ప్రారంభించాను. తరచూ ఆసుపత్రులకు వెళుతున్నప్పుడు ఒక మహిళను కలిశాను. సగానికి పైగా కాలిన శరీరంతో ఉన్న ఆమె ఎవరినీ కలవడానికి ఇష్టపడటంలేదు. ఎలాగో నేను ఆమె దగ్గరకు వెళ్లి, నాపట్ల నమ్మకం కలిగించాను. అప్పుడు తను చెప్పింది... తనలా ఇంకా ఎంతోమంది యాసిడ్ దాడి బాధితులు ఉన్నారని. సాయం అందించే చేతులు లేక అవస్థలు పడుతున్నారని. వారందరినీ కలిసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాను.

**ఆర్థిక సాయం సరిపోదని...**

ఆరంభంలో బాధిత మహిళలకు ఆర్థిక సాయం చేశాను. కానీ వ్యసనాలకు బానిసలైన వారి భర్తలు... తమ భార్యల చేతుల్లో డబ్బులు లాక్కొని వెళ్లేవారు. దాంతో వ్యూహం మార్చాల్సి వచ్చింది. నేరుగా డబ్బు ఇవ్వకుండా... వారిని సాధికారత వైపు నడిపించాలని నిర్ణయించాను. అందులో భాగంగా నైపుణ్య శిక్షణ ఇప్పించాను. వీటన్నిటికీ ఒక వేదిక ఉంటే బాగుంటుందని 2019లో 'అర లూమైర్'ను స్థాపించాను.

**ఫ్యాషన్‌తో ప్రయాణం...**

దాడి కారణంగా ఆత్మస్థైర్యం కోల్పోయి ప్రపంచం ముందు నిలబడడానికి ఇష్టపడని మహిళలకు తొలుత కౌన్సెలింగ్ ఇచ్చాను. పలు సైకాలజీ వర్క్‌షాప్‌లు నిర్వహించాను. అదేసమయంలో వారిని స్వశక్తి సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు ఫ్యాషన్‌ను ఒక మార్గంగా ఎంచుకున్నాను. ఆ మహిళల్లో కొందరికి కుట్టు పని తెలుసు. కొందరికి ఎంబ్రయిడరీ తెలుసు. వారి నైపుణ్యానికి మరింత పదును పెట్టి, వినూత్న డిజైన్లలో డ్రెస్‌లు రూపొందించేలా తీర్చిదిద్దాం. ఇప్పటివరకు 123 మంది బాధితులను మా సంస్థ ద్వారా ఆదుకున్నాం.

**మిలాన్‌లో మెరుపులు...**

ముఖ్యంగా ఎనభై, తొంభై ఏళ్లనాటి చీరలను రీసైక్లింగ్ చేసి, ఆకర్షణీయమైన బ్లేజర్లుగా మలిచాం. వాటిని గత నెలలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'మిలాన్ ఫ్యాషన్ వీక్'లో ప్రదర్శించాం. ఒకప్పుడు ముఖం దాచుకున్న బాధిత మహిళలు... హుందాగా ర్యాంప్‌పై నడిచారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫ్యాషన్ సంస్థలు, డిజైనర్ల అభినందనలు అందుకున్నారు. అంతేకాదు... సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు స్వశక్తిని నమ్ముకుని, ఆత్మస్థైర్యంతో నిలబడిన వారి గురించి గొప్పగా చూపిస్తూ ఒక చిత్రం కూడా రూపొందించారు. 'ఫ్యాషన్ వీక్‌లో అత్యంత అందమైన సందర్భం ఇది' అంటూ ఆహూతులు ప్రోత్సహించారు. ఇది ఆ మహిళల జీవితంలోనే కాదు, నా జీవితంలో కూడా అరుదైన, మరిచిపోలేని రోజు. ఏదిఏమైనా నా లక్ష్యం ఒక్కటే... దాడివల్ల కాలిన గాయాలతో మానసికంగా కుంగిపోయిన మహిళల బాధను పంచుకొని, వారిని తిరిగి జనజీవన స్రవంతిలో కలపడం. అందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను.”

సెలబ్ ఫిట్

**జీనత్ అమనుల్లా ఖాన్... ఉరఫ్ జీనత్ అమన్. 1970, 80 దశకాల్లో బాలీవుడ్‌ను ఒక ఊపు ఊపిన నటి. అందమైన రూపం... ఆకర్షణీయమైన శరీరాకృతితో ఒకప్పుడు కోట్లాదిమంది అభిమానుల గుండె చప్పుడై వెలిగిన జీనత్... నేటికీ అదే ఫిట్‌నెస్‌తో అలరిస్తున్నారు. 73 మూడేళ్ల వయసులోనూ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా కనిపిస్తున్నారు. తన రోజువారీ కార్యకలాపాలు... ఆరోగ్యకర జీవన ప్రయాణం గురించిన విశేషాలు పంచుకొంటూ... స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తన ఆహార నియమాలు, ఫిట్‌నెస్ గురించి ఇటీవల ఆమె పెట్టిన ఓ పోస్టు అందర్నీ ఆకర్షిస్తోంది.**

# ఏడు పదుల్లోనూ అదే ఉత్సాహం

'మిస్ ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్' కిరీటాన్ని అందుకొని... సినీ రంగ ప్రవేశం చేసిన జీనత్ అతి తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఆరంభంలో తడబడినా... దేవ్‌ఆనంద్ 'హరేరామా హరేకృష్ణ'తో తిరుగులేని నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అది మొదలు అలనాటి బడా కథానాయకుల అందరి సరసనా నటించి... అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్‌గా ఎదిగారు. అయితే వైవాహిక జీవితంలో మానసిక, శారీరక వేధింపులకు గురైన ఆమె... ఆటుపోట్లను తట్టుకొని నిలబడ్డారు. దాదాపు వంద చిత్రాల్లో నటించారు. ఆమె కెరీర్‌లో 'హరేరామ హరే కృష్ణ', 'హీరా పన్నా', 'సత్యం శివం సుందరం', డాన్, 'కుర్బానీ' లాంటి ఎన్నో మెగా హిట్స్ ఉన్నాయి. ఏడు పదులు దాటిన వయసులోనూ జీనత్... అవకాశం వచ్చినప్పుడల్లా తెరపై మెరుస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ తాజా సిరీస్ 'ద రాయల్స్'లో కనిపించారు. సినిమాల్లో చేసినా చేయకపోయినా... నిత్యం ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులను పలకరిస్తుంటారు. అక్కడ ఆమెకు ఫాలోవర్స్ కూడా లక్షల్లో ఉన్నారు. తన వ్యక్తిగత విషయాలతో పాటు ట్రెండీ దుస్తులు ధరించి, ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకొంటారు. మధ్యమధ్యలో ఆరోగ్యకర జీవన విధానానికి అనుసరించాల్సిన మార్గాల గురించి వివరిస్తుంటారు. ఈ వయసులో కూడా తాను ఇంత ఫిట్‌గా, చలాకీగా కనిపించడానికి కారణం ఆహారపు అలవాట్లేనని పేర్కొన్న జీనత్... ఆ విశేషాలను ఇలా చెప్పుకొచ్చారు.





"శరీరం, మనసు ఆరోగ్యం కోసం నిత్యం నేను పోషకాలు ఉన్న ఆహారం మాత్రమే తీసుకొంటా. కానీ కచ్చితమైన ఆహార నియమాలంటూ ఏవీ లేవు. నా దృష్టిలో ఆహారం అనేది ఇంధనం లాంటిది. ఎంత అవసరమో అంతే తీసుకోవాలి. ఆరోగ్యకర జీవనానికి శారీక దారుఢ్యం, మితాహారం ముఖ్యమని, అయితే తినేది తాజాగా ఉండాలని అమ్మ చెప్పేది. నేటికీ అదే నేను అనుసరిస్తున్నాను.

- ఉదయం అల్పాహారంలో నానబెట్టి, తొక్క తీసిన బాదం పప్పు, బ్లాక్ టీ. ఇది జీవక్రియను మెరుగుపరుస్తుంది. గత కొన్నేళ్లుగా చీజ్‌తో కలిపి అవకాడో టోస్ట్ తీసుకొంటున్నా.. ఒకవేళ మన వంటకాల వైపు మనసు మళ్లితే పోహ తింటాను.
- మధ్యాహ్నం కడుపు నిండా భోజనం ఆరగిస్తాను. అయితే సాధ్యమైనంతవరకు శాకాహారానికే ప్రాధాన్యం ఇస్తా. నా భోజనంలో సాధారణంగా పప్పు, సబ్జీతో రోటీ ఉంటుంది. లేదంటే ఆకుకూరలు, పచ్చి బఠానీ, బంగాళదుంప కలిపి చేసిన కూర, పన్నీర్ టిక్కా, ఇంట్లో తయారైన టమాటో పచ్చడితో రోటీ తీసుకొంటాను.
- సాయంత్రం ఐదు గంటలకు కొద్దిగా ఉప్పు, మసాలా వేసి వేయించిన మఖానా తింటాను. తీపి పదార్థాలకు దూరంగా ఉంటాను. అలాగని పూర్తిగా మానేయలేదు. అప్పుడప్పుడూ తింటూనే ఉంటా.
- నా ఆహార నియమాలు కఠినమైనవేమీ కావు. సరళమైనవి, ఎవరైనా అనుసరించ తగినవి. కాకపోతే తీసుకొనే ఆహారం ఆరోగ్యకరమైనది, సమతులమైనది అయివుండాలి. అదొక్కటే నేను చెప్పేది. వీటన్నిటితో పాటు నిత్యం వ్యాయామాలు కూడా ముఖ్యమని మరిచిపోకండి.

# పెదాల నలుపు తగ్గేదెలా?



పోషకాహర లోపం, రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, శరీరంలో తగినంత తేమ లేకపోవడం లాంటి కారణాల వల్ల పెదాలు నల్లగా మారుతుంటాయి. చిన్న చిట్కాలతో పెదాల నలుపును తగ్గించుకోవచ్చు.

- రాత్రి పడుకునేముందు పెదాలకు కలబంద గుజ్జును పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. దీంతో పెదాలమీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.
- ఒక చెంచా నిమ్మరసంలో పావు చెంచా తేనె కలిపి పెదాలకు పట్టించాలి. పావుగంట తరువాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తూ ఉంటే క్రమంగా పెదాలు రంగు తిరుగుతాయి.
- రోజూ ఉదయాన్నే పెదాలకు ఆలుగడ్డ రసం రాసి వేళ్లతో మెల్లగా రుద్దాలి. తరచూ ఇలా చేయడం వల్ల తగినంత తేమ అంది పెదాలు మృదువుగా మారతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల పాలు, అరచెంచా పసుపు వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని పెదాలకు పట్టించి ఆరిన తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే పెదాల నలుపుదనం విరుగుతుంది.
- పెదాలకు కీరదోస రసం రాసినా మంచి ఫలితం కనిపిస్తుంది
- ఒక చెంచా నారింజ తొక్కల పొడిలో ఒక చెంచా తేనె కలిపి పేస్టులా చేయాలి. దీన్ని పెదాలకు పట్టించి పది నిమిషాల తరువాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. రెండు రోజులకు ఒకసారి ఇలా చేస్తుంటే క్రమంగా పెదాలు ఎర్రగా మారతాయి.
- గుప్పెడు గులాబీ రేకులను తీసుకుని పాలు చిలకరిస్తూ మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని పెదాలకు పట్టించి కొద్దిగా ఆరిన తరువాత వేళ్లతో మర్దన చేయాలి. తరచూ ఇలా చేస్తుంటే పెదాల నలుపు తొలగిపోతుంది.

# బిజినెస్



## గోయాజ్‌లో నార్వెస్ట్ వెంచర్ రూ.130 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గోల్డ్-ప్లేటెడ్ సిల్వర్ ఆభరణాల బ్రాండ్ గోయాజ్.. అమెరికా వెంచర్ క్యాపిటల్ సంస్థ నార్వెస్ట్ వెంచర్ పార్టనర్స్ నుంచి రూ.130 కోట్ల నిధులు సమీకరించింది. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు, డిజైన్, తయారీ సామర్థ్యాల విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నట్లు గోయాజ్ తెలిపింది. ప్రస్తుతం గోయాజ్ దేశవ్యాప్తంగా 18 స్టోర్లను నిర్వహిస్తోంది. నార్వెస్ట్ వెంచర్ తమ భాగస్వామిగా మారటం సంస్థ వృద్ధి పథంలో కీలక మైలురాయి అని గోయాజ్ ఫౌండర్, సీఈఓ ప్రియాంక వేములూరి అన్నారు.

## అమెరికా మార్కెట్లోకి నాట్కో ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా మార్కెట్లోకి ఎవెరోలిమస్ టాబ్లెట్లను విడుదల చేసినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. నోవార్టిస్‌కు చెందిన జోర్‌ట్రెస్‌కు ఇది జెనరిక్ ఔషధమని తెలిపింది. పెద్దలకు సంబంధించి కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సలో ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అమెరికాలో మార్కెటింగ్ భాగస్వామి అయిన ఏఎన్‌డీఏ, బ్రెకెన్‌రిడ్జ్ ఫార్మాతో కలిసి ఈ ఔషధాన్ని వెంటనే విడుదల చేయనున్నట్లు నాట్కో ఫార్మా తెలిపింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 1వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 570 | విజయవాడ | 575 |
| వరంగల్ | 572 | గోదావరి | 580 |
| చిత్తూరు | 593 | విశాఖపట్నం | 570 |
| | | డజను గుడ్లు రూ. 78 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 112 | విజయవాడ | 120 |
| వరంగల్ | 112 | గుంటూరు | 124 |
| కరీంనగర్ | 112 | ఒంగోలు | 124 |
| మహబూబ్‌నగర్ | 112 | చిత్తూరు | 116 |
| కర్నూలు | 112 | నెల్లూరు | 121 |
| విశాఖపట్నం | 116 | అనంతపురం | 121 |
| గోదావరి | 120 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,22,680 ▲ | 1,12,450 ▲ | 1,64,000 ▼ |
| విజయవాడ | 1,25,000 ▲ | 1,18,000 ▲ | 1,53,400 ▲ |
| విశాఖపట్నం | 1,24,910 ▲ | 1,11,350 ▲ | 1,65,000 ▼ |
| రాజమండ్రి | 1,23,270 ▲ | 1,13,000 ▲ | 1,50,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,20,800 ▲ | 1,11,140 ▲ | 1,53,500 ▲ |
| ముంబై | 1,20,770 ▲ | 1,10,625 ▲ | 1,49,125 ▲ |

## 100 కోట్ల చదరపు అడుగులు..
# రూ.16.4 లక్షల కోట్లు
### భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై సీఐఐ- నైట్‌ఫ్రాంక్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్) నిల్వ 100 కోట్ల చదరపు అడుగులు మించిపోయిందని భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ), రియల్టీ కన్సల్టింగ్ సేవల సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా సంయుక్తంగా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. ఆ మొత్తం ఆఫీస్ స్పేస్ ప్రస్తుత విలువ 18,600 కోట్ల డాలర్లు (సుమారు రూ.16.4 లక్షల కోట్లు)గా ఉంటుందని నివేదిక అంచనా వేసింది. భారత్ నాలుగో అతిపెద్ద ఆఫీస్ మార్కెట్‌గా ఎదిగిందని, ఈ విభాగంలో వృద్ధి జోరును కొనసాగించేందుకు కొత్త స్థల సముదాయాలను నిర్మించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరంలో 20 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉన్న దేశీయ ఆఫీస్ స్పేస్ పరిమాణం.. గడిచిన 25 ఏళ్లలో ఐదింతలై వంద కోట్ల చదరపు అడుగులకు చేరింది. ఆఫీస్ స్పేస్ విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న, భవిష్యత్ అవసరాలకు సంసిద్ధమైన మార్కెట్‌గా భారత్ అవతరించిందని ఈ అసాధారణ విస్తరణ నొక్కి చెబుతున్నదని సీఐఐ-నైట్‌ఫ్రాంక్ రిపోర్టులో ప్రస్తావించాయి. గత ఏడాది కార్యాలయ స్థలాల స్థూల లీజులు 7 కోట్ల చదరపు అడుగులు దాటాయి. ఈ ఏడాదిలో గడిచిన 9 నెలల్లోనే 6.7 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగిందని నైట్‌ఫ్రాంక్ తెలిపింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలోనూ భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్ నిర్మాణాత్మక శక్తికిది నిదర్శనమని సంస్థ పేర్కొంది.

పరిమిత సరఫరా, పెరుగుతున్న డిమాండ్, డెవలపర్లలో జాగురూకత వంటి అంశాల కారణంగా ప్రస్తుతం భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్ కీలక మలుపు దశలో ఉంది. ఇది స్థలాల విలువ, అద్దె పెరుగుదలకు దారితీయనుందని నివేదికలో ప్రస్తావించింది. మార్కెట్ వృద్ధిని కొనసాగించడంతో పాటు 200 కోట్ల చదరపు అడుగుల మైలురాయిని చేరుకుందుకు భారత్ కొత్త స్థలాల నిర్మాణంతో పాటు ప్రస్తుత స్థలాల ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందని సీఐఐ-నైట్‌ఫ్రాంక్ నివేదిక సూచించింది.

## డిగ్రీ కాదు.. నైపుణ్యం ముఖ్యం
### హైరింగ్‌లో మారుతున్న ట్రెండ్ ▸▸ ట్యాగ్డ్ సీఈఓ దేవాశిష్ శర్మ

న్యూఢిల్లీ: పనిచేసే చోట శరవేగంగా సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగంలో విజయానికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు కూడా మారుతున్నాయి. ఉద్యోగుల్లో వాక్చాతుర్యం, విశ్లేషణాత్మక ఆలోచన వంటి సాఫ్ట్ స్కిల్స్‌కు కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయని డిజిటల్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ట్యాగ్డ్ సీఈఓ దేవాశిష్ శర్మ అన్నారు. మారుతున్న వాతావరణంలో కంపెనీల యాజమాన్యాలు సంప్రదాయ విద్యార్హతల నుంచి ఉద్యోగార్థుల ఆచరణాత్మక నైపుణ్యాలు (ప్రాక్టికల్ స్కిల్స్), ఉద్యోగంలో చేరిన తక్షణమే బాధ్యతలను నిర్వర్తించగలుగుతాడా..? అనే అంశాల పైకి దృష్టి మళ్లిస్తున్నాయని అన్నారు. జాబ్ మార్కెట్లో నిపుణుల కొరతను పరిష్కరించేందుకు ఇండస్ట్రీ, విద్యా సంస్థలతో పాటు విద్యార్థులు కూడా గణనీయంగా ప్రయత్నిస్తున్నారని శర్మ పేర్కొన్నారు. ఉద్యోగార్థులు తమను తాము సిద్ధం చేసుకునేందుకు సాఫ్ట్ స్కిల్స్, సమస్యల పరిష్కారం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలపై దృష్టిసారిస్తున్నారని అన్నారు. యాజమాన్యాలు ముఖ్యంగా బడా కంపెనీలు విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధం చేసేందుకు విద్యా సంస్థలతో కలిసి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక కోర్సులను సైతం డిజైన్ చేస్తున్నాయని అన్నారు.

## వీఎస్ఈజెడ్ ఎగుమతులు రూ.58,505 కోట్లు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి (వీఎస్ఈజెడ్) నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.58,505 కోట్ల ఉత్పత్తులు ఎగుమతి చేసినట్లు జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల తెలిపారు. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఎగుమతుల్లో 4.43 శాతం వృద్ధి నమోదైంది. కాగా సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో ఎగుమతులు రూ.1,17,050 కోట్లుగా ఉన్నాయన్నారు. త్రైమాసిక కాలంలో తెలంగాణలో రెండు ఎస్ఈజెడ్ యూనిట్లు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక యూనిట్‌కు అనుమతులు ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వీటి ద్వారా కొత్తగా రూ.467.5 కోట్ల పెట్టుబడులు రావటంతో పాటు 1,032 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇప్పటివరకు వీఎస్ఈజెడ్ ద్వారా రూ.1,26,635 కోట్ల పెట్టుబడులు రాగా, 6,03,474 మందికి ఉపాధి లభించిందన్నారు.

## సెన్సెక్స్ 466 పాయింట్లు పతనం

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్‌లు, లోహ రంగ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా సెన్సెక్స్ శుక్రవారం 465.75 పాయింట్లు కోల్పోయి 83,938.71 వద్దకు జారుకుంది. నిఫ్టీ 155.75 పాయింట్లు పతనమై 25,722.10 వద్ద ముగిసింది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 273.17 పాయింట్లు, నిఫ్టీ 73.05పాయింట్లు కోల్పోయాయి.

**ఎన్ఎస్ఈ ఐపీఓకు మోక్షం కల్పిస్తాం: సెబీ చీఫ్**

ఇన్వెస్టర్లు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు తప్పక మోక్షం కల్పిస్తామని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. అయితే, ఈ విషయంపై మరింత స్పష్టతనివ్వడం లేదా ఎక్స్ఛేంజీ ఎప్పటికల్లా ఐపీఓకు రావచ్చనే విషయాలను మాత్రం ఆయన ప్రస్తావించలేదు. సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్ వైదొలిగాక పరస్పర విరుద్ధ ప్రయోజనాలను బహిర్గతం చేసే విధానంపై సూచనలు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా పాండే తెలిపారు. ఆ కమిటీ నవంబరు 10 నాటికి నివేదిక సమర్పించవచ్చన్నారు.

## జెన్ టెక్నాలజీస్‌కు రూ.289 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి రూ.289 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఏడాది కాలంలో ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

## మారుతి సుజుకీ లాభం
# రూ.3,349 కోట్లు

**క్యూ2లో 8% వృద్ధి**

**మొత్తం ఆదాయం రూ.42,344 కోట్లు**



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,349 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.3,102 కోట్లు)తో పోల్చితే లాభం 8 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక కాలంలో ఎగుమతులు గణనీయంగా పెరగటంతో మంచి పనితీరును కనబరిచినట్లు ఎంఎస్ఐ తెలిపింది. కాగా సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.37,449.2 కోట్ల నుంచి రూ.42,344.2 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు మాత్రం రూ.33,879 కోట్ల నుంచి రూ.39,018 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది.

**తగ్గిన దేశీయ అమ్మకాలు:** కాగా సెప్టెంబరు త్రైమాసికంలో దేశీయంగా కార్ల విక్రయాలు 5.1 శాతం క్షీణించి 4,40,387 యూనిట్లుగా నమోదయ్యాయని ఎంఎస్ఐ తెలిపింది. సెప్టెంబరు 22 నుంచి జీఎస్‌టీ తగ్గింపు అమల్లోకి వస్తుందన్న కారణంగా వినియోగదారులు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవటమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. అయితే ఎగుమతులు మాత్రం రికార్డు స్థాయిలో 42.2 శాతం పెరిగి 1,10,487 యూనిట్లుగా నమోదైనట్లు వెల్లడించింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయిలో ఎగుమతులు చేపట్టడం ఇదే మొదటిసారని తెలిపింది.

**జీఎస్‌టీ తగ్గింపుతో చిన్న కారుకు మళ్లీ జోష్**

జీఎస్‌టీ తగ్గింపు కారణంగా మళ్లీ చిన్న కార్లకు డిమాండ్ నెలకొందని ఎంఎస్ఐ చైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. భారతీయ వినియోగదారుల అభిరుచి అంతా పెద్ద కార్లకు మళ్లిందన్న వార్తలను జీఎస్‌టీ తగ్గింపు పటాపంచలు చేసిందన్నారు. కంపెనీ ఎంట్రీ లెవల్ చిన్న కార్లయిన ఆల్టో కే10, ఎస్-ప్రెస్సో, వ్యాగన్ ఆర్, సెలేరియో విక్రయాలు 20.5 శాతం పెరగటమే ఇందుకు నిదర్శనమన్నారు. తాజాగా కార్ల తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల పోర్టుఫోలియోను డిమాండ్‌కు తగ్గట్టుగా మళ్లీ మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు భార్గవ చెప్పారు. కాగా ఐదో ప్లాంట్ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రూ.35,000 కోట్ల పెట్టుబడితో ఐదో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మారుతి గత ఏడాది ప్రకటించింది.

## బీపీసీఎల్ లాభంలో 169% వృద్ధి

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం ఏకంగా 169 శాతం వృద్ధి చెంది రూ.6,442.53 కోట్లుగా నమోదైనట్లు బీపీసీఎల్ వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,397.93 కోట్లుగా ఉంది. రిఫైనింగ్ మార్జిన్లు గణనీయంగా పెరగటమే ఇందుకు కారణమని తెలిపింది. సమీక్షా కాలంలో ఒక్కో బ్యారల్ క్రూడాయిల్ రిఫైనింగ్‌పై 10.78 డాలర్లను ఆర్జించినట్లు పేర్కొంది. ఈ కాలంలో మొత్తం రెవెన్యూ రూ.1.21 లక్షల కోట్లుగా ఉంది.

## తగ్గిన బీఓబీ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. సెప్టెంబరు త్రైమాసిక లాభం 8 శాతం క్షీణించి రూ.4,809 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో కీలకమైన ఆదాయ వృద్ధి ఓ మోస్తరుగా ఉండటంతో పాటు బేస్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉండటం పనితీరును దెబ్బతీసిందని బ్యాంక్ పేర్కొంది. ఈ కాలంలో మొత్తం ఆదాయం రూ.35,445 కోట్ల నుంచి రూ.35,026 కోట్లకు తగ్గింది. అయితే వడ్డీ ఆదాయం మాత్రం రూ.30,278 కోట్ల నుంచి రూ.31,511 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏలు 2.5 శాతం నుంచి 2.16 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 0.6 శాతం నుంచి 0.57 శాతానికి తగ్గిందని బ్యాంక్ పేర్కొంది. క్యూ2లో కార్పొరేట్ లోన్ బుక్ 3 శాతం మేర వృద్ధి చెందిందని బీఓబీ ఎండీ, సీఈఓ దేబదత్త చంద్ వెల్లడించారు. ఇప్పటికే బ్యాంక్ రూ.40,000 కోట్ల రుణాలను మంజూరు చేయగా మరో రూ.25,000 కోట్ల రుణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

# స్పోర్ట్స్

## అర్జున్ సాధిస్తాడా?

**నేటినుంచి చెస్ వరల్డ్ కప్**

**బరిలో 80 దేశాల నుంచి 206 మంది ఆటగాళ్లు**



పాంజిమ్ (గోవా): ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్ కప్ శనివారం ఇక్కడ ప్రారంభం కానుంది. 80 దేశాల నుంచి మొత్తం 206 మంది ఆటగాళ్లు టోర్నీలో తలపడుతున్నారు. భారత్ నుంచి ప్రజ్ఞానంద, ప్రపంచ చాంపియన్ గుకేశ్, గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి తదితర స్టార్లు బరిలో నిలిచారు. ఈ వరల్డ్ కప్‌లో తొలి మూడు స్థానాలలో నిలిచిన ఆటగాళ్లు 2026 ఫిడే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నారు. దాంతో ప్రపంచ కప్ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రపంచ చాంపియన్ గుకేశ్‌తో తలపడే ఆటగాడిని నిర్ణయించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ జీఎం అర్జున్‌కు ప్రపంచ కప్ కీలకం కానుంది. ఇక్కడ సత్తా చాటితే అతడు క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అవుతాడు. వరల్డ్ కప్ నాలుగు వారాలపాటు ఎనిమిది రౌండ్లలో సింగిల్ నాకౌట్ విధానంలో జరుగుతుంది. ఒక్కో మ్యాచ్‌లో రెండు క్లాసికల్ గేమ్‌లుంటాయి. ఇవి డ్రా అయితే విజేతను తేల్చేందుకు ర్యాపిడ్, బ్లిట్జ్ టై బ్రేక్స్ నిర్వహిస్తారు. డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్, అమెరికా గ్రాండ్‌మాస్టర్లు నకముర, కరువానా టోర్నీలో పాల్గొనడంలేదు. తెలుగు ఆటగాళ్లు పెంటేల హరికృష్ణ, రాజా రిత్విక్, లలిత్ బాబు, కార్తీక్ వెంకట్రామన్‌తోపాటు అనీష్ గిరి విన్సెంట్ (హాలెండ్), కీమర్ రోచ్ (జర్మనీ), అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్థాన్) కూడా తలపడుతున్నారు. ఇక..మహిళల వరల్డ్ కప్ విజేత దివ్యా దేశ్‌ముఖ్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగుతోంది.



**ట్రోఫీకి ఆనంద్ పేరు**

ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ కప్ విజేతకు ప్రదానం చేసే ట్రోఫీకి ఆనంద్ పేరు పెట్టారు. ఈమేరకు శనివారం జరిగిన టోర్నీ ఆరంభ కార్యక్రమంలో కప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా అఖిల భారత చెస్ సమాఖ్య అధ్యక్షుడు నితిన్ నారంగ్ ప్రకటించారు.

## ఉన్నతి సంచలనం

**నాలుగో సీడ్‌కు షాకిచ్చి సెమీస్‌కు**

**హైలో ఓపెన్‌లో లక్ష్య, ఆయుష్‌కు నిరాశ**

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సింగిల్స్ క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ ఉన్నతి 22-20, 21-13తో నాలుగో సీడ్ సియాంగ్ తి లిన్ (చైనీస్ తైపీ)కి షాకిచ్చింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్య సేన్ 17-21, 21-14, 15-21తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో, ఆయుష్ శెట్టి 21-19, 12-21, 20-22తో కాలె కొలిజానెన్ (ఫిన్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యారు.




## ఢిల్లీకి కబడ్డీ కిరీటం

**ఫైనల్లో పుణెరి పరాజయం**

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబాంగ్ ఢిల్లీ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం పుణెరి పల్టన్‌తో ఉత్కంఠ భరితంగా సాగిన తుది పోరులో దబాంగ్ జట్టు 30-28 తేడాతో నెగ్గింది. ఢిల్లీకిది రెండో ట్రోఫీ. గతంలో ఎనిమిదో సీజన్‌లో విజేతగా నిలిచింది. ప్రస్తుత కోచ్ జోగిందర్ నర్వాల్ అప్పుడు ఆటగాడిగా ఉండడం విశేషం. ఇక లీగ్ దశ ఆద్యంతం అత్యుత్తమ ప్రదర్శనతో టాప్-2లో నిలిచిన ఇరుజట్లు ఫైనల్లోనూ హోరాహోరీగా తలపడ్డాయి. అయితే పుణెరి టీమ్‌కు నిరాశ తప్పలేదు. ఢిల్లీ అద్భుత డిఫెన్స్‌తో ప్రత్యర్థికి చెక్ పెట్టింది. దబాంగ్ రైడర్ నీరజ్ నర్వాల్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. అటు పుణెరి పల్టన్ రైడర్ ఆదిత్య షిండే అత్యధికంగా 10 పాయింట్లతో రాణించినా ఫలితం లేకపోయింది.

## చెత్తగా ఆడి.. చిత్తుగా ఓడి..

**రెండో టీ20లో భారత్‌కు నిరాశ**

- అభిషేక్ మెరుపులు వృధా
- చెలరేగిన హాజెల్‌వుడ్
- ఆస్ట్రేలియా బోణీ




**2** టీ20ల్లో బంతుల పరంగా (40) భారత్‌కిది రెండో అతిపెద్ద ఓటమి. 2008లో ఆసీస్‌పైనే 52 బాల్స్ ఉండగా ఓడింది.

మెల్‌బోర్న్: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాపై రికార్డు స్థాయిలో 339 రన్స్‌ను ఛేదించి వహ్వా.. అనిపించగా, స్టార్లతో కూడిన పురుషుల జట్టు మాత్రం అదే ఆసీస్ చేతిలో చిత్తుగా ఓటమిపాలైంది.. ఫార్మాట్ వేరైనప్పటికీ మహిళల జట్టు చూపిన పోరాటం ముందు సూర్యకుమార్ సేన చిన్నబోయి అభిమానులను నిరాశపర్చింది. శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో భారత్ 4 వికెట్లతో చిత్తయ్యింది. ఆతిథ్య ఆసీస్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి 1-0 ఆధిక్యం అందుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అభిషేక్ (37 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 68), హర్షిత్ రాణా (33 బంతుల్లో 35) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పేసర్లు హాజెల్‌వుడ్‌కు 3.. ఎలిస్, బార్ట్‌లెట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఆసీస్ 13.2 ఓవర్లలో 126/6 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ మార్ష్ (26 బంతుల్లో 46), హెడ్ (15 బంతుల్లో 28) ఎదురుదాడికి దిగడంతో పరుగులు వేగంగా వచ్చాయి. ఈ జోడీ పవర్‌ప్లేలోనే 56/1 స్కోరుతో నిలిచింది. కుల్దీప్ ఓవర్‌లో మార్ష్ 4,6,4,6తో 20 రన్స్ బాది అతడికే చిక్కాడు. ఆ తర్వాత ఇన్‌గ్లిస్ (20) ఫర్వాలేదనిపించాడు. చివర్లో 3 వికెట్లు టపటపా కోల్పోయినా మ్యాచ్ ఫలితం అప్పటికే తేలిపోయింది. హాజెల్‌వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**పేకమేడలా..**

5, 2, 1, 0, 7, 4, 0, 0, 0.. భారత్ ఇన్నింగ్స్‌లో తొమ్మిది మంది బ్యాటర్ల నుంచి వచ్చిన పరుగులివి. జట్టు మొత్తం స్కోరు 125 కాగా.. ఇందులో వీరి భాగస్వామ్యం కేవలం 19 రన్స్ కావడం గమనార్హం. పేసర్ హాజెల్‌వుడ్ తన ఎక్స్‌ట్రా బౌన్స్‌తో బెంబేలెత్తించాడు. ఒకేసారి తన ఓవర్ల కోటా పూర్తి చేయగా 13 పరుగులే ఇచ్చి గిల్ (5), సూర్య (1), తిలక్ (0) వికెట్లు తీశాడు. అలాగే అతను 15 డాట్ బాల్స్ వేయడం విశేషం. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను ఇష్టారీతిన మార్చడం టీమిండియాను దెబ్బ తీసింది. కానీ బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై అభిషేక్ మాత్రం భారీ షాట్లతో చెలరేగాడు. 49/5 స్కోరు దగ్గర శివమ్ దూబే కన్నా ముందే వచ్చిన హర్షిత్.. అభిషేక్‌కు జత కలిశాడు. ఇద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకుని ఆరో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. అభిషేక్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఇక 16వ ఓవర్‌లో హర్షిత్, దూబే (4)ల వికెట్లు తీసి బార్ట్‌లెట్ ఝలక్ ఇవ్వగా.. ఆ తర్వాత టపటపా వికెట్లు నేలకూలడంతో భారత్ పూర్తి ఓవర్లు కూడా ఆడలేకపోయింది.

**స్కోరుబోర్డు**

**భారత్:** గిల్ (సి) మార్ష్ (బి) హాజెల్‌వుడ్ 5, అభిషేక్ (ఎల్బీ) ఎలిస్ 68, శాంసన్ (ఎల్బీ) ఎలిస్ 2, సూర్యకుమార్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజెల్‌వుడ్ 1, తిలక్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజెల్‌వుడ్ 0, అక్షర్ (రనౌట్) 7, హర్షిత్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 35, దూబే (సి) ఇన్‌గ్లిస్ (బి) బార్ట్‌లెట్ 4, కుల్దీప్ (సి సబ్) ఎబాట్ (బి) స్టొయినిస్ 0, వరుణ్ (నాటౌట్) 0, బుమ్రా (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.4 ఓవర్లలో 125 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-20, 2-23, 3-32, 4-32, 5-49, 6-105, 7-109, 8-110, 9-125, 10-125; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 4-0-13-3, బార్ట్‌లెట్ 4-0-39-2, ఎలిస్ 3.4-0-21-2, స్టొయినిస్ 4-0-24-1, ఓవెన్ 1-0-13-0, కునేమన్ 2-0-14-0.

**ఆస్ట్రేలియా:** మార్ష్ (సి) అభిషేక్ (బి) కుల్దీప్ 46, హెడ్ (సి) తిలక్ (బి) వరుణ్ 28, ఇన్‌గ్లిస్ (ఎల్బీ) కుల్దీప్ 20, డేవిడ్ (సి అండ్ బి) వరుణ్ 1, ఓవెన్ (సి) శాంసన్ (బి) బుమ్రా 14, స్టొయినిస్ (నాటౌట్) 6, షార్ట్ (బి) బుమ్రా 0, బార్ట్‌లెట్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం:** 13.2 ఓవర్లలో 126/6. **వికెట్ల పతనం:** 1-51, 2-87, 3-90, 4-112, 5-124, 6-124; **బౌలింగ్:** బుమ్రా 4-0-26-2, హర్షిత్ 2-0-27-0, వరుణ్ 4-0-23-2, కుల్దీప్ 3.2-0-45-2.




(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒకే ఒక్క ఇన్నింగ్స్ ఆమెను దేశ మహిళా క్రికెట్‌లో రారాణిగా చేసింది. ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్‌కు ముందు జెమీమా రోడ్రిగ్స్ ఎదుర్కొన్న ఒత్తిడి అంతా..ఇంతా..కాదు. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో రెండు డకౌట్లు, మరో రెండింటిలో 30ల్లో అవుట్. దాంతో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు ఆమెను పక్కనపెట్టేశారు. ఇది చాలదన్నట్టు 25 ఏళ్ల జెమీమాపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్, ఆటకంటే ఆమెకు ఇతర విషయాలపై ఎక్కువగా ఆసక్తి ప్రదర్శిస్తున్నదన్న తీవ్ర విమర్శలు. గతంలోనూ జెమీమా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. మూడేళ్ల కిందట న్యూజిలాండ్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచ కప్ జట్టులో ఆమెకు చోటు దక్కలేదు. తదనంతరం కూడా రోడ్రిగ్స్ జట్టుకు ఎంపిక కాలేకపోయింది. ఇవన్నీ ఇలా ఉండగానే..ముంబైలోని ఖార్ జింఖానా క్లబ్‌లో జెమీమా తండ్రి ఇవాన్ క్రైస్తవ మత ప్రచారం నిర్వహించినట్టు విమర్శలొచ్చాయి. అక్కడ అతడు మత మార్పిడులకు పాల్పడినట్టు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దాంతో ఖార్ జింఖానా మేనేజ్‌మెంట్ ఆ క్లబ్‌లో జెమీమా సభ్యత్వాన్ని రద్దు చేసింది. అసలే జట్టులో స్థానం కోల్పోయి వేదనలో ఉన్న జెమీమా ఈ పరిణామాలలో మరింత ఒత్తిడిలో కూరుకుపోయింది. ఇక ఈసారి వరల్డ్ కప్‌లోనూ ఆరంభంలో వైఫల్యాలు ఎదుర్కొంది. దరిమిలా ఆమెపై మరోసారి విమర్శల జడివాన ప్రారంభమైంది. వాటిని పట్టించుకోకుండా ఆమె తనకు తాను కర్తవ్యబోధ చేసుకుంది. విమర్శలకు బ్యాటుతోనే బదులివ్వాలని నిశ్చయించుకుంది. ఈక్రమంలో న్యూజిలాండ్‌పై మ్యాచ్‌లో అజేయ హాఫ్ (76)తో తానేమిటో నిరూపించుకుంది. ఆ మనోబలమే ఏడుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా జట్టుతో సెమీఫైనల్లో తాను ఆకాశమే హద్దుగా విజృంభించేందుకు తోడ్పడింది. రికార్డు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు షఫాలీ, మంధాన త్వరగా అవుట్ కావడంతో భారత జట్టు విజయంపై అభిమానుల్లో ఏమూలో సందేహం నెలకొంది. అయితే కెప్టెన్ హర్మన్ తోడుగా ఆసీస్ బౌలర్లపై రోడ్రిగ్స్ విరుచుకుపడింది. కీలక తరుణంలో కౌర్ నిష్క్రమించినా జెమీమా ఏమాత్రం వెరవలేదు. దీప్తీశర్మ, రిచా ఘోష్ చివరగా అమన్‌జోత్ కౌర్ అండగా జట్టుకు చిరస్మరణీయ విజయం అందించింది. భారత మహిళా క్రికెట్ చరిత్రలోనే ఓ అద్భుత విజయాన్ని సాక్షాత్కరింపజేసిన జెమీమా మ్యాచ్ అనంతరం బోరున విలపించింది. ఆమెలో గూడుకట్టుకున్న ఆవేదనకు అది అద్దం పట్టింది. ఏమైనా..ఒకే ఒక ఇన్నింగ్స్‌తో జెమీమా టీమిండియాలో సూపర్‌స్టార్‌గా మారింది.

## పంత్ విఫలం

**భారత్ 'ఎ' 234 ఆలౌట్**

బెంగళూరు: కెప్టెన్ రిషబ్ పంత్ సహా స్టార్లతో కూడిన భారత్ 'ఎ' జట్టు బ్యాటింగ్‌లో విఫలమైంది. దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికార టెస్టులో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్‌లో పంత్ సేన 234 పరుగులకే ఆలౌటైంది. ఆయుష్ మాత్రే (65), బదోని (38), సాయి సుదర్శన్ (32) మినహా అంతా విఫలమయ్యారు. కెప్టెన్ పంత్ (17) కూడా స్వల్ప స్కోరుకే పరిమితమయ్యాడు. సుబ్రయేన్‌కు 5, సిపమ్లాకు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా 'ఎ' రెండో రోజు ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 30 పరుగులతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 309 పరుగులకు ఆలౌటైంది.

## ఆ ఒక్కమాటే చెప్పా!

**కోచ్ మజుందార్**

నవీముంబై: 'మ్యాచ్‌ను విజయవంతంగా ముగించండి' అని మాత్రమే తాను చెప్పినట్టు మహిళల జట్టు కోచ్ అమోల్ మజుందార్ వెల్లడించాడు. 'వారికి నేను హితబోధ చేయలేదు. మ్యాచ్‌ను విజయవంతంగా ముగించాలని మాత్రమే చెప్పా. టోర్నీలో చాలా మ్యాచ్‌లను చక్కగా ఆరంభించాం. అయితే చివరకు తడబాటుకులోనై చేజార్చుకున్నాం. కానీ సెమీఫైనల్లో అలా జరగకూడదని చెప్పా' అని మజుందార్ వివరించాడు.

# డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

- ఇద్దరు మహిళా అధ్యాపకుల వేధింపులే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఓ టీచర్ లైంగిక వేధింపుల అంశం ప్రస్తావన
- వాట్సాప్ చాటింగ్‌ల వివరాలు అందజేత


సాయితేజ (ఫైల్)

ఎం.వి.పి.కాలనీ (విశాఖపట్నం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు ఇద్దరు మహిళా అధ్యాపకుల వేధింపులే కారణమని సహచర విద్యార్థులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు... స్థానిక ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టార్‌లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ కోన సూరిబాబు పెద్ద కుమారుడు సాయితేజ (22) సమతా డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలో స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు తనను నిత్యం వేధిస్తున్నారని, పరీక్షల్లో జవాబులు బాగా రాసినా మార్కులు వేయడం లేదని, రికార్డులు అధికంగా రాయిస్తున్నారని విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పాడు. అధ్యాపకుల వేధింపులపై యాజమాన్యంతో మాట్లాడేందుకు సాయితేజ తల్లిదండ్రులు, మామయ్య శుక్రవారం ఉదయం కాలేజీకి వెళ్లారు. అక్కడ ఉండగానే వారు ఇంట్లో ఉన్న సాయితేజతో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతడు స్పందించలేదు. దీంతో ఇంటికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### క్లాస్ టీచర్ లైంగిక అవసరాల కోసం ఒత్తిడి!

కుటుంబసభ్యులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఓ అధ్యాపకురాలి లైంగిక వేధింపుల అంశాన్ని ప్రస్తావించారు. దానికి విద్యార్థితో ఇద్దరు మహిళా అధ్యాపకుల వాట్సాప్ చాటింగ్‌లను జత చేశారు. స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు, క్లాస్ టీచర్ కలసి తనను వేధిస్తున్నట్టు సాయితేజ పలుసార్లు తమకు చెప్పాడని పేర్కొన్నారు. క్లాస్ టీచర్, స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు మంచి మిత్రులని.. క్లాస్ టీచర్ లైంగిక అవసరాల కోసమే సాయితేజపై స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు ఒత్తిడి తెచ్చే వారని ఆరోపించారు. పరీక్షల్లో బాగా రాసినా మార్కులు వేయకుండా, రికార్డులపై ఉద్దేశపూర్వకంగా సంతకం పెట్టకుండా వేధించేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు సాయితేజ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు క్లాస్ టీచర్ వాట్సాప్ మెసేజ్‌లపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన దురదృష్టకరమని, విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కళాశాల యాజమాన్యం పేర్కొంది. కాగా, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం, కమ్యూనిస్టు నాయకులు కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. నిష్పాక్షిక విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చి పంపించారు.

## మేయర్ దంపతుల హత్య కేసులో..

# ఐదుగురికి ఉరిశిక్ష

### చిత్తూరు కోర్టు సంచలన తీర్పు.. మేనల్లుడే ప్రధాన హంతకుడు

చిత్తూరు లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో పదేళ్ల కిందట సంచలనం రేపిన మేయర్ దంపతుల హత్య కేసులో ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ, జిల్లా కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. 2015 నవంబరు 17న అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్‌ను మున్సిపల్ కార్యాలయంలోని వారి చాంబర్‌లోనే చంపేశారు. అనురాధను తుపాకీతో కాల్చగా, మోహన్‌ను కత్తులతో నరికి చంపారు. అప్పట్లో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. మోహన్ మేనల్లుడు శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూయే ఈ ఘాతుకానికి పాల్పడటం మరింత కలకలం రేపింది. కాల్పులకు ప్రత్యక్ష సాక్షి సతీశ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు చింటూతోపాటు 23 మందిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించారు. ఈ కేసులో 133 మంది సాక్షులుండగా, 57 మందిని కోర్టు విచారించింది. పదేళ్లపాటు సుమారు 352 సార్లు ఈ కేసు వాయిదా పడింది. ఈ నెల 24వ తేదీన కోర్టు చింటూ సహా ఐదుగురిపై నేర నిర్ధారణ జరిపింది. మిగతా నిందితులపై కేసు కొట్టివేసింది. గురువారం చింటూ తరఫు న్యాయవాది విజయచంద్రారెడ్డి పలు కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల పత్రాలను జిల్లా న్యాయమూర్తికి అందించారు. సుమారు నాలుగు గంటల సేపు వాదనల్ని విన్న జడ్జి.. మరునాటికి వాయిదా వేశారు. శుక్రవారం చింటూతోపాటు వెంకటా చలపతి, జయప్రకాశ్ రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్‌లకు ఉరిశిక్ష విధిస్తూ తుదితీర్పు వెలువరించారు. ఏ1 చింటూ బాధిత కఠారి కుటుంబీకులకు రూ.50 లక్షలు, ఆ దాడిలో గాయపడిన సతీశ్ (కేసులో ప్రత్యక్ష సాక్షి)కు రూ.20 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించారు. అలాగే ఏ2, ఏ3, ఏ4, ఏ5లకు రూ.11,500 చొప్పున జరిమానా విధించారు.


మోహన్, అనురాధ (ఫైల్)


ఉరిశిక్ష పడ్డ నిందితులు వెంకటాచలపతి, జయప్రకాశ్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్, చింటూ

### రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నారనే..

మేయర్ దంపతుల హత్యకు దారితీసిన కారణాలను పోలీసులు చార్జిషీట్‌లో కోర్టుకు వివరించారు. ఆ చార్జిషీట్‌లోని అంశాలను అనుసరించి..

మేయర్ అనురాధ, మోహన్‌లకు ఆయన మేనల్లుడు చింటూ అన్నివిషయాల్లో అండగా ఉండేవాడు. వారి కోసం తాను చేస్తున్న ఉద్యోగాన్ని కూడా వదులుకుని నమ్మినబంటులా పనిచేసేవాడు. అయితే, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం కంతలచెరువు వద్ద ఉన్న మోహన్ క్వారీ విషయంలో తొలిసారి చింటూకు ఆశాభంగమైంది దానిని తనకు ఇవ్వాలని చింటూ అడిగాడు. ఇంట్లో మాట్లాడి తర్వాత చెబుతానని మోహన్ అనడంతో.. చింటూ అహం దెబ్బతింది. చిత్తూరు నగరపాలక సంస్థ మార్కెట్ వేలం వ్యవహారం చింటూను మరింత ఆగ్రహానికి గురిచేసింది. రూ.16లక్షలుగా ఉన్న మార్కెట్ వేలాన్ని రూ.90 లక్షలకు పాడించి తనను ఆర్థికంగా ఇబ్బంది పెట్టారంటూ అత్తామామలపై కోపాన్ని పెంచుకున్నాడు. తాను గంగనపల్లె రోడ్డులో కొన్న స్థలానికి దారి విషయంలో సహకరించలేదని అనురాధ, మోహన్‌నుంచి చింటూ దూరం జరిగాడు. తన వెంట ఉండే కుర్రాళ్లతో చిత్తూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టు పనులకు చింటూ టెండర్లు వేయించాడు. ఆ పనులు కూడా వేరే కాంట్రాక్టర్లకు పోవడంతో మరింత పగ పెంచుకున్నాడు. తాను రాజకీయంగా ఘర్షణ పడిన సీకేబాబుతో తన మామ లోలోపల కలిసిపోయాడని చింటూ అనుమానం పెంచుకున్నాడు. అత్తామామలను అంతమొందిస్తేనే రాజకీయంగా ఎదుగుతామని, లేదంటే తనకు మనుగడే ప్రశ్నార్థకరమవుతుందనే నిర్ణయానికి చింటూ వచ్చాడు.

### ముఖానికి బురఖాలు..బ్యాగుల్లో కత్తులు...

మేయర్ దంపతుల హత్యకు హంతకులు పక్కాగా ప్లాన్ చేశారు. ప్రధాన నిందితులు చింటూ, వెంకటా చలపతి, జయప్రకాశ్ రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్ బురఖాలు వేసుకుని 2015 నవంబరు 17వ తేదీన చిత్తూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బ్యాగులో ఆయుధాలు, వాటిపై కూరగాయలతో వారిని మరికొందరు అనుసరిస్తూ లోపలకు వెళ్లారు. మేయర్ అనురాధ చాంబరులోకి మొదట చింటూ ప్రవేశించాడు. తన ముఖానికి ఉన్న బురఖాను తీసి... 'నేనే చింటూను' అని గట్టిగా అరుస్తూ, వెంట తెచ్చుకున్న లేడీస్ హ్యాండ్ బ్యాగులోని పిస్టల్‌తో మేయర్ అనురాధను పాయింట్ బ్లాంక్‌లో కాల్చాడు. ఆమె అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆమె భర్త, చింటూ మేనమామ కఠారి మోహన్ బయటకు పరిగెత్తారు. ఆయనను పీఏ రూమ్ వద్ద వెంకటేశ్ కత్తితో నరికాడు. కత్తి గాయంతోనే మోహన్ కాన్ఫరెన్సు హాల్లోకి పరిగెత్తారు. అక్కడ పొంచి ఉన్న మంజునాథ్, జయ ప్రకాశ్‌రెడ్డి ఆయనను కత్తులతో నరికారు. చింటూ, వెంకటాచలపతి పిస్టళ్లతో కాల్పులు జరిపినా మోహన్‌కు బుల్లెట్ తగల్లేదు. ఇదంతా జరుగుతున్నప్పుడు సతీశ్ అనే వ్యక్తి మేయర్ చాంబర్‌లో ఉన్నారు. మేయర్‌ను సతీశ్ కాపాడే ప్రయత్నం చేయగా, మంజునాథ్ ఆయన వీపు మీద కత్తితో పొడిచాడు. నర సంహారం పూర్తి చేసుకుని వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. నెత్తుటి మడుగులో పడి ఉన్న అనురాధ, మోహన్‌లతోపాటు సతీశ్‌ను కార్యాలయ సిబ్బంది చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మేయర్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మోహన్, సతీశ్‌లను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగానే మోహన్ మరణించారు. బతికి బయటపడ్డ సతీశ్ ఈ కేసులో ప్రధాన సాక్షిగా నిలిచారు. కాగా, ప్రధాన నిందితుడు చింటూకు నేర చరిత్ర ఉంది. 2007లో అప్పటి చిత్తూరు ఎమ్మెల్యే సీకే బాబుపై రెండుసార్లు హత్యాయత్నం జరగ్గా, తెర వెనుక చింటూ ఉన్నారని పోలీసులు కేసు కూడా పెట్టారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగళ్‌కు చెందిన ఏ2 వెంకటాచలపతిని పోలీసులు సీకే బాబు హత్యాయత్నం కేసులో కూడా నిందితుడిగా చూపించారు. చింటూకు చలపతి మిత్రుడు. ఏ3 జయప్రకాశ్‌రెడ్డి చింటూ వద్ద ఆఫీసు బాయ్‌గా కాగా, ఏ4 మంజునాథ్ అతని వంట మనిషి. ఏ5 వెంకటేశ్ చింటూ కారు డ్రైవర్. వీరిలో వెంకటాచలపతి మినహా ఎవరికీ పెళ్లి కాలేదు. వీరిలో ముగ్గురికి ఆ ఘటనకు ముందు నేర చరిత్ర లేదు.

### బాధిత కుటుంబానికి బాబు అండ

అనురాధ దంపతుల హత్య సమయంలో సీఎంగా ఉన్న చంద్రబాబు వారి కుటుంబాలకు అండగా నిలిచారు. అనురాధ కోడలు హేమలతకు మేయర్ పదవి ఇచ్చారు. గత ఏడాది టీడీపీ తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి రాగానే హేమలతకు చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ పదవిని ఇచ్చి ప్రోత్సహించారు.


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

## నాడు పటేల్.. నేడు మోదీ

- సర్దార్ సంస్థానాలను విలీనం చేస్తే.. జమ్మూకశ్మీర్‌ను పీఎం తీసుకొచ్చారు: మాధవ్

విజయవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశాన్ని సమైక్యంగా ఉంచడానికి ఆనాడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ సంస్థాలను విలీనం చేస్తే... నేడు ప్రధాని మోదీ స్వతంత్ర ప్రతిపత్తితో ఉన్న జమ్మూకశ్మీర్‌ను దేశంలో విలీనం చేశారని బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ ఎంజీ రోడ్డులో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు శుక్రవారం ఏక్తా ర్యాలీని నిర్వహించారు. పటేల్ కారణంగా నేడు దేశమంతా సమైక్యంగా ఉందని, ప్రజలందరూ స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేయాలని మాధవ్ పిలుపునిచ్చారు. దీనికి ముందు బీజేపీ కార్యాలయంలోను పటేల్ జయంతిని నిర్వహించారు.

## రాయితీ బకాయిలు పూర్తిగా చెల్లించాలి

- సీఎం చంద్రబాబుకు దళిత పారిశ్రామిక వేత్తల విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక రాయితీ బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు.. పారిశ్రామిక రాయితీ బకాయిల నిధులు దశల వారీగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేశారు. అంతకుముందు శుక్రవారం ఉదయం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం గేటు బయట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ నాయకులు ఈడ్పుగంటి అనార్‌బాబు, ఈరా రాజశేఖర్, పినమాల నాగకుమార్, వి.భక్తవత్సలం, కనపర్తి విజయరాజు, అన్నవరపు అవినాశ్, తానేటి సత్యానందం, స్వరూపరాణి, ప్రియాంక తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## వాణిజ్య పన్నుల శాఖ చిత్తూరు జేసీపై విచారణ

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ చిత్తూరు డివిజన్ జాయింట్ కమిషనర్ (జేసీ) ఎ.రవీంద్రనాథ్‌రెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కిందిస్థాయి సిబ్బంది ఆయనపై పలు ఆరోపణలు చేయడంతో మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు విచారణాధికారిని నియమించామని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యదర్శి తెలిపారు.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## భయపడొద్దు... పోలీసులున్నారు

### డీప్‌ఫేక్ బాధితులకు చిరంజీవి భరోసా
### సజ్జనార్ ఆధ్వర్యంలో ఘనంగా ఏక్తా దివస్ రన్



'డీప్‌ఫేక్...సైబర్ నేరాలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ప్రజలకు పోలీసులు అండగా ఉన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడమే కాదు దాని దుర్వినియోగాన్ని అరికట్టడమూ అంతే ముఖ్యం' అని హీరో చిరంజీవి అభిప్రాయపడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జాతీయ ఐక్యతా దినోత్సవం(ఏక్తా దివస్)ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిరంజీవితో పాటు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. టెక్నాలజీని దుర్వినియోగం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఇటీవల ఆయన డీప్‌ఫేక్‌పై సైబర్ క్రైమ్‌లో చేసిన ఫిర్యాదును మీడియా ప్రస్తావించగా.. డీప్‌ఫేక్ అనేది సమాజానికి గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ అంశాన్ని సీపీ సజ్జనార్, డీజీపీ శివధర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారని, వారు సైబర్ నేరగాళ్లపట్ల కఠినంగా వ్యవహరిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి కఠినమైన చట్టం చేయాలని అభిప్రాయపడ్డారు. 'యూనిటీ ఇన్ డైవర్సిటీ' అనే పటేల్ సందేశాన్ని పోలీసులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.

-హైదరాబాద్ సిటీ(ఆంధ్రజ్యోతి)

## ఓ నీలి మేఘం.. పెంచింది వేగం!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈనెల 7న తెలుగు సహా పలు భాషల్లో విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కురిసే వాన' అనే ప్రణయ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరాలు సమకూర్చారు. కపిల్ కపిలన్ మైమరపించేలా ఆలపించారు. 'కురిసే వాన తడిపేయాలన్న భూమే ఏదో... సరదా పడుతూ పురి విప్పేస్తున్న నెమలే ఏదో... ఓ నీలి మేఘం, పెంచింది వేగం.. ఆ జాబిలమ్మ చెంత చేరి పంత పాడి, కమ్మితే మైకం...లాయి లాయి లాయిలే...' అంటూ వినగానే ఆకట్టుకునేలా సాగుతుందీ గీతం.

## 'తెలంగాణ రైజింగ్'కు సహకరిస్తా

సల్మాన్‌ఖాన్




'తెలంగాణ రైజింగ్' నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు తనవంతు సహకారం అందించనున్నట్లు బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ తెలిపారు. గురువారం ముంబైలో ఓ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డిని.. సల్మాన్ ప్రత్యేకంగా కలిశారు. ఆ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని సల్మాన్ చెప్పినట్లు ఓ ప్రకటనలో సీఎం కార్యాలయం తెలిపింది.

-హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)


నిర్మాత అల్లు అరవింద్ తనయుడు... హీరో శిరీష్, నయనికల నిశ్చితార్థం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

## చిన్ని గుండెలో అన్ని ఆశలా



రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా మహేశ్ బాబు పి. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈనెల 28న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా మేకర్స్ 'చిన్ని గుండెలో అన్ని ఆశలా..' అంటూ సాగే మూడో గీతాన్ని విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని మెర్విన్, సత్య యామిని పాడారు. వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చారు.




## తొలిసారి కెమెరా ముందుకు



నందమూరి బాలకృష్ణ చిన్న కూతురు, విశాఖపట్నం ఎంపీ భరత్ సతీమణి నందమూరి తేజస్విని తొలిసారి కెమెరా ముందుకొచ్చారు. ఓ వాణిజ్య ప్రకటనలో నటించారు. ఓ ప్రముఖ ఆభరణాల సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న తేజస్విని ఇందులో భాగంగా ఆ సంస్థకు సంబంధించిన వాణిజ్య ప్రకటనలో నటించారు. నటనలోనూ, నృత్యంలోనూ తన ప్రతిభను చాటుకున్నారు.

## నిన్నొదిలి కాసేపైనా ఉంటానా..



అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంటగా నూతన దర్శకుడు నాని కాసరగడ్డ తెరకెక్కించిన చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. ఈనెల 21న విడుదలవుతోంది. తాజాగా 'కన్నొదిలీ..కలనొదిలీ కనుపాపే ఉంటుందా..నిన్నొదిలీ, నే కదిలీ కాసేపైనా ఉంటానా...' అంటూ సాగే పాటను ఆవిష్కరించారు. ఈ ప్రేమ గీతాన్ని దేవ్ పవార్ రాయగా, భీమ్స్ సిసిరోలియో అద్భుతంగా స్వరపరిచారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఆలపించడం ఈ పాటకు అదనపు ఆకర్షణను తీసుకొచ్చింది. అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంట చూడ చక్కగా ఉంది.



## నాన్న ప్రేమే కథగా

త్రినాథ్ కటారి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు మీ ఎదవ'. బళ్లారి శంకర్ నిర్మాత. సాహితీ అవంచ కథానాయిక. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా త్రినాథ్ కటారి మాట్లాడుతూ 'నాన్న బిడ్డలకు పంచే ప్రేమే మా సినిమాకు కథ. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తుంది. చక్కని ప్రేమకథతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అని చెప్పారు. యువతకు చక్కని సందేశం ఇచ్చే చిత్రమిది, పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ చెప్పారు.

## ఉప రాష్ట్రపతి సీపీఆర్‌తో గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం ఉప రాష్ట్రపతి నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉపరాష్ట్రపతిని శాలువాతో సత్కరించి, శ్రీవెంకటేశ్వరుని ప్రతిమని గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధిపై ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు.

## సాహిత్య అకాడమీ కార్యదర్శిగా శ్రీనివాసరావు పదవీవిరమణ

న్యూఢిల్లీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు శుక్రవారం పదవీవిరమణ చేశారు. 1988లో సాహిత్య అకాడమీలో ఎల్డీసీగా చేరిన శ్రీనివాసరావు అంచెలంచెలుగా కార్యదర్శిగా ఎదిగారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం, పెద ప్రోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు హయాంలో సాహిత్య అకాడమీ పలు జాతీయ, అంతర్జాతీయ సాహిత్యోత్సవాలను నిర్వహించింది. ప్రపంచంలోనే అతి పెద్ద సాహిత్యోత్సవం నిర్వహించిన సంస్థగా గిన్నీస్ రికార్డు సాధించింది. వేలాది పుస్తకాలు ప్రచురించింది. సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి సచ్చిదానందన్‌తో పాటు అనేకమంది రచయితలు, అధికారులు, సిబ్బంది ఆయన సాహిత్య రంగంలో క్రియాశీలకంగా ఉండాలని ఆశిస్తూ సందేశాలు పంపారు.

## విపత్తు సమయాల్లోనూ జగన్ రాజకీయం: ధూళిపాళ్ల

మొంథా తుఫాను వంటి విపత్తు సమయాల్లో ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ రాజకీయం చేస్తూ చేసిన వ్యాఖ్యలు చాలా బాధ కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. 'జగన్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎన్నో తుఫాన్లు వచ్చాయి. వేలాది ఎకరాల పంట నష్టం జరిగింది. కానీ ఆయన ఎప్పుడూ పంటచేలో దిగి నష్టాన్ని పరిశీలించిన దాఖలాల్లేవు. రెడ్ కార్పెట్ పరుచుకుని బాధితులను పరామర్శించిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు' అని నరేంద్ర పేర్కొన్నారు. కాగా, తుఫాన్ కూడా మానవ తప్పిదం వల్లే అంటున్న జగన్ మానసిక పరిస్థితి ఏమిటో ప్రజలే అర్థం చేసుకోవాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారిని ఆదుకోవాల్సింది పోయి శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## ఈసీఆర్ఎఫ్ డ్యాంకు పచ్చజెండా

» గ్యాప్-2 డిజైన్లకు జలసంఘం ఆమోదం

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ప్రధాన డ్యాం అయిన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణానికి అవరోధాలు తొలగిపోయాయి. ఈ డ్యాం గ్యాప్-2లో 480 మీటర్ల నుంచి 890 మీటర్ల దాకా ప్రధాన డ్యాం నిర్మాణ పనుల డిజైన్లకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) శుక్రవారంఆమోదం తెలిపింది. ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వ ప్రైమావేరా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తూ షెడ్యూల్ మేరకు డయాఫ్రం వాల్, అదే సమయంలో సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం సన్నాహక పనులు చేపడుతున్నారు. కానీ ప్రధాన డ్యాం డిజైన్లు ఇప్పటి వరకు జలసంఘం పరిశీలనలోనే ఉన్నాయి. డిసెంబరునాటికి వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉందని.. సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను 2027 జూన్ నాటికి పూర్తి చేయాలంటే.. డిజైన్లను త్వరగా ఆమోదించాలని జలవనరుల శాఖ కోరింది. ఈ నేపథ్యంలో గ్యాప్-2 పరిధిలోని డిజైన్లకు జలసంఘం ఆమోదం తెలిపింది.

## 'వరికెలపూడిశెల' పర్యావరణ సర్వేకు టెండర్లు

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో వరికెలపూడిశెల ఎత్తిపోతల పథకం అటవీ, పర్యావరణ అనుమతులకు సంబంధించి సర్వే నిర్వహించేందుకు టెండర్లు పిలవాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. ఈ పథకం ద్వారా నాగార్జున సాగర్ నుంచి వెల్దుర్తి మండలం గంగులకుంట గ్రామ పరిధిలో తొలుత 24,900 ఎకరాలకు సాగునీటిని అందించాలని సంకల్పించారు. ఆ తర్వాత ఆయకట్టు పరిధిని 84,500 ఎకరాలకు పెంచారు. ఇందుకోసం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు పొందాల్సి ఉంది. టెండరు దక్కించుకునే సంస్థ.. పర్యావరణ, అటవీ శాఖల పరిధిలోకి ఈ పథకం వస్తుందో, రాదో నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సి ఉంటుంది. ఒకవేళ ఆయకట్టు అటవీ భూముల పరిధిలోకి వస్తే ప్రత్యామ్నాయ భూములు అప్పగించడంపైనా సూచనలు చేయాల్సి ఉంటుంది. సర్వే చేపట్టడానికి రూ.1.02 కోట్ల అంచనా వ్యయాన్ని జల వనరుల శాఖ ఖరారు చేసింది.

## రేపే 'జీశాట్-7ఆర్' ప్రయోగం

» ఇస్రో బాహుబలి ఎల్వీఎం3-ఎం5తో నింగిలోకి



సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. అత్యంత బరువైన పేలోడ్లను అంతరిక్షంలోకి మోసుకెళ్లే ఇస్రో బాహుబలిగా పేరుగాంచిన ఎల్వీఎం3-ఎం5 (మార్క్3) రాకెట్ ద్వారా జీశాట్-7ఆర్ (సీఎంఎస్-03) ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. భారత సైనిక అవసరాల కోసం ఈ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఇస్రో అభివృద్ధి చేసింది. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం షార్‌కు చేరుకుని శాస్త్రవేత్తలతో కలిసి ప్రయోగ ఏర్పాట్లలో పాలుపంచుకున్నారు. ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ఆదివారం సాయంత్రం 5:26 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది. దీనికోసం 24 గంటలు ముందు.. శనివారం సాయంత్రం 5:26 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) షార్‌లోని బ్రహ్మప్రకాష్‌లో హాలులో జరిగింది. అనంతరం రాకెట్ ప్రయోగ పనులను లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)కు అప్పగించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన ల్యాబ్ వారు సమావేశమై చర్చించి.. ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇస్రో 4,400 కిలోల బరువైన సమాచార ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. రాకెట్ నింగిలోకి ఎగిరాక తన మూడు దశలను పూర్తి చేసుకుని శిఖర భాగాన ఉన్న సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని 16.09 నిమిషాలకు కక్ష్యలోకి చేర్చేలా డిజైన్ చేశారు. శుక్రవారం ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించి రిహార్సల్‌ను పూర్తి చేశారు.

# అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్టు

**డిజిటల్ అరెస్టు పేరుతో మహిళా న్యాయవాదికి బెదిరింపు.. రూ.52 లక్షలు కొల్లగొట్టిన ముఠా**

» ఏలూరు పోలీసులకు ఫిర్యాదు
» రంగంలోకి మూడు బృందాలు
» యూపీ, ఢిల్లీ, మహారాష్ట్రలో 8 మంది అరెస్టు
» బంగ్లాదేశ్‌కు పారిపోయిన కీలక సూత్రధారులు
» దేశంలో రూ.100 కోట్లకు పైగా స్వాహా

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మహిళా న్యాయవాదికి అంతర్రాష్ట్ర సైబర్ ముఠా ఫోను చేసింది.. అమెరికాలో ఉన్న ఆమె కుమారులు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారంటూ డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించింది.. ఆమెను భయపెట్టి రూ.52 లక్షలు ఆన్‌లైన్ ద్వారా లాగేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరుకు చెందిన మహిళా న్యాయవాది రమాదేవి(66)కి సెప్టెంబరు చివరి వారంలో వాట్సాప్ ద్వారా వీడియో కాల్ వచ్చింది. అవతల యూనిఫాం వేసుకున్న నకిలీ పోలీసులు.. 'మీ బ్యాంకు అకౌంట్ నంబర్ ఇదేనా.? మీ ఆధార్ కార్డు ఇదే కదా.. మీ పిల్లలు అమెరికాలో ఉన్నారు కదా..! వాళ్లు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు.. మీతో పాటు వాళ్లు కూడా అరెస్టవుతారు' అని బెదిరించాడు. కాసేపట్లో మరొక యూనిఫాం అధికారి వీడియో కాల్ చేసి.. మీ పిల్లల భవిష్యత్ పాడవుతుంది.. ఎవరికీ చెప్పకుండా సమస్యను పరిష్కరించుకోవాలని బేరం పెట్టాడు.. ఇంకొకడు లైన్లోకి వచ్చి వేరే రూపంలో బెదిరించాడు.. ఇలా నాలుగు రోజుల పాటు ఆమెను బెదిరించి రూ.52 లక్షలు కాజేశారు. ఆమె బాధతో రోజూ మాట్లాడే బంధువులకు కూడా ఫోన్ చేయలేదు. వారికి అనుమానమొచ్చి ఆరా తీశారు. ఆమె అసలు విషయం చెప్పగా... అదంతా సైబర్ నేరగాళ్ల పని అని వారు గ్రహించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయడంతో.. ఈ ముఠాకు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ అటు నుంచి బంగ్లాదేశ్ వరకూ లింకులు బయటపడ్డాయి. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ ముగ్గురు సీఐలతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### ఉత్తరాదికి బృందాలు..

ఈ మూడు బృందాలు ఆ 3 రాష్ట్రాలకు వెళ్లాయి. అక్కడ క్షుణ్ణంగా విచారించడంతో అసలు సూత్రధారులిద్దరూ యూపీ నుంచి ఢిల్లీకి.. అక్కడి నుంచి బంగ్లాదేశ్‌కు పారిపోయినట్లు తేలింది. 15 మందితో కూడిన ఈ ముఠా యూపీలోని ఒక ఇల్లు అద్దెకు తీసుకుని.. పోలీసు యూనిఫాం ధరించి రమాదేవిని బెదిరించారు. ఈ సైబర్ కేటుగాళ్ల కోసం పలు రాష్ట్రాల్లో గాలించిన ఏలూరు పోలీసు బృందాలు ఎట్టకేలకు 8 మందిని.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పర్వీస్ సోనవనే (43), శర్మ(24), నితిన్ మిశ్రా అలియాస్ విక్రమ్(20), హర్షిత్ మిశ్రా అలియాస్ జై సింగ్(21), అభిషేక్ కాశ్యప్(22), గోపాల్ యాదవ్(24).. మహారాష్ట్రకు చెందిన సందీప్ సురేశ్ అలోని(55), హిమత్‌రావు పంజార్(42)లను అరెస్టు చేసి విచారించాయి. ఈ ముఠా బంగ్లాదేశ్‌కు చెందిన కొందరితో, నైజీరియా గ్యాంగ్‌తో కుమ్మక్కై రెండేళ్లుగా పలు రాష్ట్రాల్లో ఆరేడు వందల మందిని మోసగించి, బెదిరించి రూ.100 కోట్లకు పైగా వసూలు చేసినట్లు వెల్లడైంది.

### ముఠా పనిచేసేది ఇలా..

ఎక్కడికక్కడ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని.. రిక్షా వాళ్లు, కూలీలకు డబ్బులిచ్చి.. బ్యాంకు అకౌంట్లు తెరుస్తారు. పాస్ బుక్, ఏటీఎం కార్డు, సిమ్ వారి పేర్లతోనే తీసుకుంటారు. ఇందుకోసం వారికి రూ.10 వేల నుంచి 15 వేల వరకు చెల్లిస్తారు. వ్యాపారం కోసమని ఆ అకౌంట్లు వాడుకుంటారు. రూ.కోట్లు వసూలు చేసి.. ఆ అకౌంట్లలోని మొత్తాన్ని బంగ్లాదేశ్‌కు.. అటు నుంచి నైజీరియా ముఠాలకు చేరవేస్తున్నారు. ఈ ముఠాలోని 8 మందితోపాటు 10-15 వేలకు బ్యాంకు అకౌంట్లు అమ్ముకున్నవారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అసలు సూత్రధారుల కోసం వేట కొనసాగిస్తున్నారు.

# తక్షణం ఆదుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుఫాన్ ప్రభావం పడిందని.. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా మదింపు చేసినట్లు పేర్కొంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్రప్రభుత్వం తీసుకున్న సహాయ చర్యలనూ వివరించింది. సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యాలయం నుంచి 'మొంథా' గమనాన్ని పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలను తెలియజేసింది. '19 జిల్లాలకు ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించామని.. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంది' అని తెలిపింది. నష్టం తీవ్రతకు అద్దం పట్టేలా ఫొటోలను నివేదికకు జతపరచింది. అత్యధికంగా రహదారులు, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నష్టం సంభవించిందని.. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది.

### నివేదికలో శాఖల వారీగా నష్టమిదీ..

- వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్లలోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. రూ.829 కోట్ల మేర రైతులు నష్టపోయారు. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుఫాన్ ప్రభావం పడింది.
- 12,215 హెక్టార్లలో రూ.40 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 23,979 మంది రైతులకు నష్టం వాటిల్లింది.
- ఆక్వా రంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను నష్టపోయారు. 2,261 పశుసంపదను పశుపోషకులు కోల్పోయారు.
- 4,794 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లు, 311 కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ నష్టం రూ.2,774 కోట్ల వరకు ఉంది. 18 జిల్లాల్లోని 862 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ శాఖకు రూ.454 కోట్ల నష్టం జరిగింది. 48 పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. వీటి పునరుద్ధరణకు రూ.109 కోట్లు ఖర్చవుతుంది.
- రాష్ట్రవ్యాప్తంగా 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా.. 26,575 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 429 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల నష్టం జరిగింది.
- జలవనరుల శాఖకు రూ.234 కోట్ల నష్టం.
- 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమైనట్లు ప్రాథమికంగా గుర్తించాం. అంగన్వాడీలు, పాఠశాలలు, వైద్యశాలలు, చేనేత మగ్గాలు.. వీటన్నింటికీ కలిపి రూ. 122 కోట్లు నష్టం వాటిల్లింది. తుఫాన్ బాధితుల కోసం 1,464 చోట్ల సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి.. 1,36,907 మందికి పునరావాసం కల్పించాం. సహాయ చర్యల కోసం ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.32 కోట్లు ఖర్చుపెట్టింది.



కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంకలో పంటచేల వద్ద రైతు సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

### నష్టం తగ్గింపునకు చర్యలు: మంత్రి అచ్చెన్న

మొంథా నేపథ్యంలో పంట నష్టాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాల వ్యవసాయ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. "రైతుల కష్టానికి ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మండల వ్యవసాయ అధికారి స్థాయిలో పంట నష్టం అంచనాలో కచ్చితత్వంతో వివరాలు సేకరించాలి. పంట నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి. పొలాల్లో నీటిని తొలగించడం ద్వారా పంటలను కాపాడాలి. తెగుళ్ల వ్యాప్తి తగ్గించడానికి, పంటల్ని రక్షించేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించేలా చూడాలి."అని మంత్రి ఆదేశించారు.

## 3 జిల్లాల్లో 37 కరువు మండలాలు

» 12 తీవ్ర, 25 మధ్యస్థ ప్రభావిత ప్రాంతాలు
» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాల సమయంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైన మూడు జిల్లాలోని 37 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అగళి, ఆమడగూరు, గాండ్లపెంట, హిందూపురం, మడకశిర, ముదిగుబ్బ, నంబులపూలకుంట, ఓబులదేవరచెరువు, రామగిరి, రొళ్ల, తలుపుల, తనకల్లు మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా, ఇదే జిల్లాలోని అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, ధర్మవరం, గుడిబండ, కదిరి, కనగానపల్లి, కొత్తచెరువు, లేపాక్షి, నల్లచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, సోమందేపల్లి, ప్రకాశం జిల్లా కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లె, వాల్మీకీపురం, కురుబలకోట, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కరువు కమిటీ సిఫారసు మేరకు వీటిని ప్రకటించింది. కరువు ప్రభావిత మండలాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రైతులు రుణ సౌకర్యాలు పొందటానికి, సహాయ కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా నిర్దిష్ట ప్రాంతాలను తెలిపేలా మండలాల వారీగా గెజిట్‌లు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పార్టీ అండ లేకుండా నెగ్గగలరా?

(మొదటి పేజీ తరువాయి)

- మూడుసార్లు సీఎంగా చేసిన పనివిధానానికి.. 4వ సారి సీఎంగా చేస్తున్న దానికి చాలా తేడా ఉంది. ఇప్పుడున్నంత వేగం గతంలో లేదు.
- పించన్ల పంపిణీలో టీడీపీ నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలి. - సీఎం చంద్రబాబు

వ్యక్తిగతంగా పోటీ చేసి గెలవొచ్చన్నారు. పార్టీ అండ లేకపోతే వారి పరిస్థితేంటో అప్పుడు అర్థమవుతుందని చెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు సుమారు 4 గంటలు అక్కడే గడిపారు. పార్టీ నేతలతో వివిధ అంశాలపై చర్చించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ వివాదంపై ఈ సందర్భంగా తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ కేశినేని శివనాథ్ (చిన్ని)ని పిలిపించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. క్రమశిక్షణ కమిటీ ముందుకు విడివిడిగా రప్పించి వివరణ తీసుకోవాలని.. దానిపై తనకు నివేదిక ఇవ్వాలన్నారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక ఇద్దరితోనూ మాట్లాడతానని, విభేదాలు కొలిక్కిరాకుంటే కఠిన చర్యలకు వెనుకాడనని తేల్చిచెప్పారు. ఎవరైనా సరే పార్టీ టికెట్ ఇచ్చిన తర్వాత పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని, పార్టీ లైన్ దాటితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. భగవద్గీతపై వ్యాఖ్యలు చేశారంటూ జరుగుతున్న ప్రచారంపైనా సీఎం స్పందించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు ఆచితూచి మాట్లాడాలని.. వారు మాట్లాడే మాటలు రాష్ట్రం మొత్తం ప్రభావం చూపుతాయని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇప్పటికే గాడిలో పెట్టామని.. ఆటోపైలట్ మోడ్‌లో పెట్టామన్నారు. గ్రామ సచివాలయాల పేరును స్వర్ణాంధ్ర సెంటర్లు లేదా స్వర్ణాంధ్ర కేంద్రాలుగా మార్పు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపైనా నాయకులతో సీఎం చర్చించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

### సుశిక్షిత శ్రేణులను తయారుచేయాలి..

పార్టీ శ్రేణులను సుశిక్షితులుగా తయారు చేయడంపై దృష్టి సారించాలి. రాజకీయాల్లోకి రావడం అంటే కేవలం డబ్బు సంపాదన కోసమేనన్న ఆలోచనను తుడిచివేయాలి. ఆర్థిక స్థిరత్వం కోసం వేరేమార్గం చూసుకోవాలి. ప్రజాసేవకే రాజకీయాల్లోకి రావాలి. ఈ దిశగా క్యాడర్‌కు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. మద్యం వ్యాపారంలో ఎక్కువ మంది రాజకీయ నాయకులు ఉంటున్నారు. దానిద్వారా సంపాదించిన డబ్బు ఉండదు. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం కేసు దానికి ఉదాహరణ. ఇక వారంలో ఒకరోజు పార్టీ కార్యాలయానికి కేటాయిస్తా. ప్రభుత్వపరంగా.. పార్టీ పరంగా రెండింటికీ సమయం కేటాయిస్తా. కార్యాలయానికి వస్తే సొంతింటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది.

### జగన్‌కు అది అలవాటే!

జగన్‌కు బురదజల్లడం అలవాటే. కోడికత్తి డ్రామా, వివేకా హత్య, గులకరాయి డ్రామా.. ఇవన్నీ తానేచేసి మనపై బురదజల్లాడు. తుఫాన్‌పై ఇప్పుడు విమర్శలు చేస్తున్నాడు. ప్రజలను మోసం చేసి మభ్యపెట్టి రాజకీయం చేద్దామన్న ఆలోచనే తప్ప.. వారికి మంచి చేసి రాజకీయం చేద్దామన్న ఆలోచన జగన్‌కు లేదు. సోషల్ మీడియాలో వైసీపీ ఫేక్ ప్రచారాలకు.. వాస్తవాలతో దీటుగా సమాధానమివ్వాల్సిందే. దీనికోసం సంబంధిత నిపుణులను నియమించుకోవాలి. సోషల్ మీడియాలో సమర్థంగా పనిచేయకపోతే వైసీపీ చేసే దుష్ప్రచారాలనే ప్రజలు వాస్తవాలని నమ్మే ప్రమాదముంది. తుఫాన్‌ను దీటుగా ఎదుర్కోవడానికి ప్రభుత్వం చేసిన కృషిని మన పార్టీ నేతలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోయారు. లండన్ పర్యటన ముగించుకుని వచ్చాక జిల్లా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీని ప్రకటిస్తా. (పల్లాతో) జాబితాలు సిద్ధంగా ఉన్నాయి.. లండన్ నుంచి వచ్చిన తర్వాత నా వద్దకు వస్తే ఓ గంట కూర్చుని జాబితాలు ఖరారు చేద్దాం.



శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌కు వచ్చిన సీఎం చంద్రబాబు.. ప్రజాదర్బార్‌లో భాగంగా దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న దృశ్యం

### ప్రజలను కలిసే తీరిక కూడా లేదా?

కొంతమంది ఎమ్మెల్యేలు సీఎంఆర్ఎఫ్ మంజూరు లేఖలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలను కలిసే తీరిక కూడా వారికి లేదా? వారి జాబితా ఇవ్వండి. వారితో నేనే మాట్లాడతా. ఎమ్మెల్యేలందరూ ఆదివారం(2న) తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. నష్టం అంచనాలను సరిగా వేస్తున్నారా.. పరిహారం సరిగా అందిందా లేదా వంటి విషయాలపై ప్రజలతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి.

## నేటి సాయంత్రానికల్లా రైతుకు ఊరట

**వ్యవసాయ క్షేత్రాల్లోని నీళ్లను మళ్లించండి**

» ఉపగ్రహం సాయంతో ముంపు పొలాలను గుర్తించండి
» ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలి
» అత్యుత్తమ పనితీరు కనపర్చిన 100 మందిని సన్మానించుకుందాం
» సాయంపై ప్రధానితో మాట్లాడతా: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా చూడాలి. నీట మునిగిన పంట పొలాలను యుద్ధ ప్రాతిపదికన కాపాడాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. తుఫాన్ అనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు మునిగాయో గుర్తించండి. శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలి. నియోజకవర్గాల వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేయండి. ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడికి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లాలి. 34 గంటల్లో డ్రెయినేజీ వ్యవస్థని మెరుగుపర్చాలి. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని, పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు చర్యలు చేపట్టాలి. కేంద్ర సాయంపై నేను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడతా. మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పని చేసి, ప్రతిభ చూపిన వారిని సన్మానించాలి. శనివారం ఉదయం 10 గంటలకు 100 మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా నదిలో ప్రస్తుత పరిస్థితిపై సీఎం వాకబు చేశారు. కృష్ణాలో వరద ఉధృతి తగ్గిందని అధికారులు ఆయనకు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా... 60 శాతం మేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని అధికారులు విన్నవించారు.

## మళ్లీ బెంగళూరుకు జగన్..

» తలలు పట్టుకుంటున్న వైసీపీ నేతలు

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వారాంతపు విడిది కోసం వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి బెంగళూరు ఎస్టేట్‌కు శుక్రవారం వెళ్లిపోయారు. మొంథా తుఫాన్ తీరందాటిన తర్వాత, తీరగ్గా బుధవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి జగన్ వచ్చారు. ఆ రోజంతా ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. మరునాడు, గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు, ముఖ్యనేతలతో ప్రత్యేకంగా తుఫానుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ నేపథ్యంలో ఉచిత పంటల బీమా స్కీమ్ అమలు చేయకుండా రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు ముంచేశారంటూ ఆ సమావేశంలో ఆయన ఆవేశపడ్డారు. మెడికల్ కాలేజీలపై తలపెట్టిన ర్యాలీని వాయిదా వేస్తున్నట్టు అదే సమావేశంలో జగన్ తెలిపారు. ఈ సమావేశం ముగిసి 24 గంటలు గడవకుండానే...శుక్రవారం వారాలబ్బాయిలా బెంగళూరు ఎస్టేట్‌కు జగన్ వెళ్లిపోయారు. ఆ మాటకొస్తే నేతలతో భేటీని కూడా మనస్ఫూర్తిగా అయన నిర్వహించలేదు. పార్టీ తరఫున తుఫాను బాధితులకు ఆర్థిక సహాయం చేసే కార్యాచరణనుగానీ, బాధితుల సహాయార్థం ఆ పార్టీ తరఫున విరాళంగానీ ఆయన ప్రకటించలేదు. సింపిల్‌గా....పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం, బీమా మొత్తం అందేలా సహకరించాలంటూ నేతలకు సూచించారు. తాను మాత్రం రాష్ట్రం దాటేశారు. దీంతో అధినేత తీరు ఏమిటో అర్థం కాక ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

# రాజధాని పనుల్లో వేగం పెరగాలి!

**నిర్దేశిత సమయానికి నిర్మాణాలు పూర్తి కావాలి.. నాణ్యతా ప్రమాణాలూ పక్కాగా పాటించాల్సిందే**

» సీఆర్డీఏ సమీక్షలో చంద్రబాబు ఆదేశాలు
» త్వరలో రాజధాని రైతులతో సీఎం సమావేశం

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతి, సుందరీకరణ, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు? శ్రామిక శక్తి ఏ మేరకు ఉంది? నిర్మాణాలకు అవసరమైన సామగ్రి, యంత్రాలను ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనే దానిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఏ భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని.. ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టంచేశారు. నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని చెప్పారు. కొన్ని నిర్మాణ సంస్థలు ఇంకా శ్రామిక శక్తి, యంత్రాలను పూర్తి స్థాయిలో కేటాయించలేదని, ఆయా సంస్థలు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, ఈ మేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

### పచ్చదనం, సుందరీకరణపై రాజీపడొద్దు..

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంత వరకు పూర్తయిందనే దానిపై సీఎం ఆరా తీశారు. ఈ విషయంలో రైతులకు ఏమాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను ఆదేశించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని, ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలో రాజధాని రైతులతో సమావేశమవుతానని సీఎం చంద్రబాబు తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నామో.. గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. పచ్చదనం, సుందరీకరణ వంటి విషయాల్లో రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి ప్రపంచ శ్రేణి నగరం లుక్ రావాలంటే హైరైజ్ బిల్డింగులు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఆర్థిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




క్యాంపు కార్యాలయంలో సీఆర్డీఏపై నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

## టీటీడీ 'పరకామణి' కేసులో
# సీఐడీ డీజీకి హైకోర్టు నోటీసులు

- టీటీడీ ఈవో, నాటి సీవీఎస్‌వో సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్ తదితరులకు కూడా
- లోక్ అదాలత్‌లో చోరీ కేసు రాజీ వ్యవహారంపై విచారణ



అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణిలో జరిగిన చోరీ వ్యవహారంపై నమోదు చేసిన కేసులో అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) వై.సతీశ్‌కుమార్‌ను నిందితుడు రవికుమార్‌తో రాజీకి అనుమతిస్తూ లోక్ అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు సుమోటోగా నమోదు చేసిన కేసుపై శుక్రవారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీఐడీ డీజీ, టీటీడీ ఈవో, సీవీఎస్‌వో, తిరుపతి 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, పరకామణి అప్పటి ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్, నిందితుడు సీవీ రవికుమార్‌కు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను నవంబరు 17కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందు శమంతతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని సమర్పించిన వినతిని టీటీడీ ఈవో పరిగణనలోకి తీసుకోకపోవడంతో జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పరకామణిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి సీవీ రవికుమార్ డాలర్ల రూపంలో పెద్దఎత్తున నగదు, బంగారాన్ని అపహరించారని, ఈ విషయంలో నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్నారని తెలిపారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి పరకామణిలో చోరీకి సంబంధించి నమోదైన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశించారు. ఈ మొత్తం వ్యవహారంలో టీటీడీ బోర్డు, టీటీడీ అధికారులు, దర్యాప్తు అధికారి, పరకామణి అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ పాత్రపై దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారు ఆ ఆస్తులను ఆదాయానికి తగ్గట్లే ఆర్జించారా? అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించారు. ఆస్తులను రిజిస్ట్రేషన్, ఇతర మార్గాలలో వేరొకరికి దఖలు పరిచారా? అనే విషయంపై కూడా దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చాల్సింది ధర్మాసనమేనని, అందువల్ల ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు వీలుగా ఉత్తర్వుల ప్రతిని సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని సీజే.. న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందుతో కూడిన ధర్మాసనానికి అప్పగించారు.

## బెల్టు షాపులపై మరింత నిఘా

- ఎక్సైజ్ అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం
- ఇప్పటి వరకూ 25 జిల్లాలు నాటుసారా రహితం
- మరో 15 రోజుల్లో కాకినాడ జిల్లా కూడా..



అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులపై నిఘా మరింతగా పెంచి దాడులు నిర్వహించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా బెల్టు దుకాణాలు కనిపించకూడదని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మద్యం సీసాలు నిజమైనవేనా అని నిర్ధారించుకునే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఇప్పటివరకూ 1.69లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని, యాప్ ద్వారా 4,60,415 సీసాలను వినియోగదారులు స్కాన్ చేశారని ఆ శాఖ డైరెక్టర్ చామకూరి శ్రీధర్ వివరించారు. నకిలీ మద్యంపై అవగాహన పెంచడంలో భాగంగా ప్రతి మద్యం షాపు వద్ద వెయ్యి కరపత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. షాపులు, బార్ల వద్ద యాప్ వినియోగంపై పోస్టర్లు అంటించామని చెప్పారు. మద్యం అమ్మే లైసెన్సీలు కూడా స్కాన్ చేసిన తర్వాతే అమ్ముతున్నారని పేర్కొన్నారు. నవోదయం 2.0లో భాగంగా ఇప్పటివరకూ 25 జిల్లాలను నాటుసారా రహితంగా ప్రకటించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ మంత్రికి వివరించారు. మరో 15 రోజుల్లో కాకినాడ జిల్లాను కూడా నాటుసారా రహితంగా మారుస్తామని చెప్పారు. నకిలీ మద్యం నివారణ, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో శాఖ పనితీరు పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూనే అక్రమాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కొల్లు రవీంద్ర సూచించారు.

## ఏపీఆర్‌డీసీ డైరెక్టర్లుగా 16 మంది నియామకం

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టర్లుగా 16 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన 16 మందిని ఆర్డీసీ చట్టం మేరకు డైరెక్టర్లుగా నియమించింది. వారు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారని ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వు(జీఓ45)లో పేర్కొన్నారు.

## దేవదాయ శాఖ భూముల సద్వినియోగానికి కమిటీ

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఉన్న దేవదాయ శాఖ భూముల ద్వారా ఆలయాలకు ఆదాయం వచ్చే విధంగా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ దేవదాయ శాఖ ఎక్స్ ఆఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు ప్రధాన ఆలయాలకు సంబంధించిన భూములు అయితే ఆలయ ఈవో, లేదంటే మల్టీజోన్‌కు చెందిన జాయింట్ కమిషనర్ ఉంటారు. ఈ కమిటీ పట్టణ ప్రాంతాల్లో ఉన్న దేవదాయ శాఖ భూములను ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై సమీక్ష చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది..

## రాష్ట్ర పోలీసులకు 'దక్షతా పదక్' పురస్కారం

- ఏపీ, తెలంగాణ నుంచి ఐదుగురు చొప్పున ఎంపిక

న్యూఢిల్లీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ ఏటా ప్రకటించే 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' అవార్డులకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 10మంది పోలీసులు ఎంపికయ్యారు. ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, నిఘా, ఫోరెన్సిక్ సైన్స్ రంగాల్లో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించిన పోలీసు సిబ్బందికి ఏటా అక్టోబరు 31న ఈ అవార్డులను కేంద్రం ప్రకటిస్తుంది. 2025కి గాను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్), కేంద్రం పోలీసు సంస్థలు (సీపీవో)కు చెందిన 1,466 మంది సిబ్బందికి ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. ఈ జాబితాలో ఏపీ, తెలంగాణ నుంచి ఐదుగురు చొప్పున ఉన్నారు. ఏపీ నుంచి... దర్యాప్తు విభాగంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, అదనపు ఎస్పీ వి. భీమారావు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, ఎస్ఐ ఎండీ నసీరుల్లాతో పాటు ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఫణిభూషణ్ ఎంపికయ్యారు.

స్పెషాలిటీ ఆస్పత్రుల్లో..

# 'ఎన్టీఆర్' వైద్య సేవల పునరుద్ధరణ

- మంత్రి హామీతో 'ఆషా' నిర్ణయం
- రూ.2,700 కోట్ల బకాయిలకు 'వన్ టైం సెటిల్‌మెంట్'
- నవంబరు నెలాఖరులోగా చెల్లిస్తాం
- 10లోగా ఇంకో 250 కోట్లు విడుదల చేస్తాం
- చర్చల సందర్భంగా సత్యకుమార్ వెల్లడి
- దీంతో బంద్‌ను నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటన




ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం ప్రతినిధులతో చర్చిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ వైద్య సేవ' కింద ఆరోగ్య సేవలను పునరుద్ధరిస్తున్నట్లు ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రకటించాయి. వాటికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు చెల్లించాల్సిన రూ.2,700 కోట్ల బకాయిలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ వెల్లడించడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం ఉదయం సచివాలయంలోని తన చాంబర్లో ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులతో మంత్రి జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబుతో చర్చించామని, వన్ టైం సెటిల్‌మెంట్ విధానంతో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని సత్యకుమార్ తెలిపారు. వన్ టైం చెల్లింపులు చేసేలోపే మరో రూ.250 కోట్లు ఆస్పత్రులకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ' కింద తీసుకునే నిర్ణయాల్లో ఆషా ప్రతినిధులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ట్రస్ట్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల పరిశీలనకు యుద్ధ ప్రాతిపదికన సుమారు 50 మంది వైద్యులను నియమిస్తున్నామన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున రోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలు కొనసాగించాలని కోరారు. 'ఆస్పత్రులు సమ్మె చేపట్టిన నాటి నుంచి రూ.488 కోట్లు విడుదల చేశాం. మరో విడత రూ.250 కోట్లు విడుదల చేస్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ట్రస్టు నుంచి వాటికి రూ.4,143 కోట్లు చెల్లించాం. ఇందులో జగన్ ప్రభుత్వం పెట్టిపోయిన బకాయిలే రూ.2,403 కోట్ల వరకు ఉన్నాయి. మా హయాంలో ఇప్పటివరకు ట్రస్టు ద్వారా జరిగిన వైద్య సేవలకు మొత్తం రూ.1,739 కోట్లు చెల్లించాం. ఆస్పత్రులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే బిల్లులు చెల్లిస్తున్నాం' అని మంత్రి వివరించారు. ఆషా ప్రతినిధులు మాట్లాడుతూ.. బకాయిలు పెరిగిపోయి.. ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారడంతోనే తాము ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్‌ను స్వాగతిస్తున్నామని, కానీ వెంటనే మరో రూ.250 కోట్లు విడుదల చేస్తే ఆస్పత్రులకు ఉపశమనం లభిస్తుందని చెప్పారు. దీనికి మంత్రి అంగీకరించారు. 10వ తేదీకల్లా రూ.250 కోట్లు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ఆయన చొరవ చూపడంతో గత 20 రోజులుగా నిలిపివేసిన వైద్య సేవలను తక్షణమే కొనసాగిస్తామని ప్రతినిధులు హామీఇచ్చారు.

### వైద్య సేవలు పునరుద్ధరణ..: ఆషా

స్పెషాలిటీ ఆస్పత్రులు చేపట్టిన వైద్యం బంద్‌ను నిలిపివేస్తున్నామని ఆషా అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. మంత్రితో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నుంచే ఆస్పత్రుల్లో వైద్య సేవలు పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా తమ బకాయిలు మొత్తం చెల్లించడానికి అంగీకరించిందని, నవంబరు నెలాఖరు నాటికి రూ.2,700 కోట్ల బకాయిలూ విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని.. నవంబరు 10నాటికి మరో రూ.250 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని వెల్లడించారు. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో తమ ప్రతినిధులకూ భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. శస్త్రచికిత్సల ప్యాకేజీల పెంపునకూ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. బీమా విధానంపై భేటీల్లో ప్యాకేజీల పెంపుపై చర్చిస్తామని చెప్పారు.

## మెడికల్ పీజీ కోర్సుల్లో ఇన్‌సర్వీస్ వైద్యులకు 20% సీట్లు

- నాన్-క్లినికల్ విభాగాల్లో 30 శాతం

మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న వైద్యులకు 20శాతం క్లినికల్ విభాగాల సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ విద్యాసంస్థల చట్టం-1983కి సవరణలు చేస్తూ ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. క్లినికల్ విభాగాల్లో ఇన్‌సర్వీస్ కోటా వైద్యులకు 15శాతం సీట్లు రిజర్వ్ చేసినట్లు ప్రభుత్వం ఇప్పటికే జీవో 99 విడుదల చేసింది. అయితే పీహెచ్‌సీ వైద్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇన్‌సర్వీస్ కోటా రిజర్వేషన్‌ను 20శాతానికి పెంచుతామని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఆ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇన్‌సర్వీస్ కోటాలో క్లినికల్ విభాగాల్లో 20 శాతం, నాన్ క్లినికల్ విభాగాల్లో 30 శాతం సీట్లను ఇవ్వనున్నారు.




పట్టుబడిన శ్వేత నాగు, పాముకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడు

## శ్వేత నాగుకు శస్త్రచికిత్స

మల్కాపురం (విశాఖపట్నం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయం సమీపంలోని నేవీ క్యాంటీన్‌లో శ్వేతనాగు శుక్రవారం కలకలం రేపింది. దీంతో అక్కడివారు భయంతో స్నేక్ క్యాచర్ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి దాన్ని చాకచాక్యంగా పట్టుకున్నారు. పట్టుబడిన శ్వేతనాగు సుమారు 8 అడుగుల పొడవు ఉంది. దానికి బలమైన గాయం కావడంతో నాగరాజు వెంటనే దాన్ని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువెళ్లారు. పామును పరీక్షించిన డాక్టర్ సునీల్.. ఎముక బయటకు రావడాన్ని గమనించి, సుమారు గంటకు పైగా శ్రమించి శస్త్రచికిత్స చేశారు. చీరుకుపోయిన చర్మాన్ని కలుపుతూ 8 కుట్లు వేశారు. రెండు రోజులు పామును జాగ్రత్తగా చూసుకోవాలని, ఆ తర్వాతే సురక్షిత ప్రదేశంలో విడిచిపెట్టాలని సూచించారు. దీంతో నాగరాజు దాన్ని తన వద్ద భద్రపరిచారు. తాను 13 ఏళ్లుగా పాములు పడుతున్నానని, ఇలాంటి శ్వేతనాగును ఇప్పటివరకూ చూడలేదని నాగరాజు అన్నారు.

## తూర్పు నౌకాదళం కమాండింగ్-ఇన్-చీఫ్‌గా సంజయ్ భల్లా



విశాఖపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంఢార్కర్ శుక్రవారం పదవీ విరమణ చేయనుండడంతో భల్లాను నియమించారు. ఐఎన్‌ఎస్ సర్కార్స్ మైదానంలో కొత్త దళాధిపతి సంజయ్ భల్లా సైనిక వందనం స్వీకరించి నేవీ దళాలను సమీక్షించారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లాగ్ ఆఫీసర్లు, వివిధ విభాగాలకు బాధ్యత వహిస్తున్న కమాండింగ్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సంజయ్ భల్లా 1989 జనవరిలో నేవీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఈ 36 ఏళ్ల సర్వీసులో ఆయన అనేక బాధ్యతలు నిర్వర్తించారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌లో ప్రత్యేక కోర్సు చేసిన తరువాత ఆయన పలు ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకల్లో నిపుణుడిగా వ్యవహరించారు. 2022లో నిర్వహించిన ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌లలో టాక్టికల్ కమాండ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టడానికి ముందు నేవల్ హెడ్ క్వార్టర్స్‌లో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా పనిచేశారు. ఆయన సేవలకు అతి విశిష్ఠ సేవా మెడల్, నౌ సేనా మెడల్‌ను ప్రభుత్వం బహూకరించింది.

## భోగాపురం వద్ద ఐటీ పార్కుకు టాటా ఇంజనీర్స్ స్థల పరిశీలన

- సదుపాయాలపై అధికారులతో చర్చ
- భోగాపురం, భీమిలి ప్రాంతాల వైపు పారిశ్రామికవేత్తలు మొగ్గు

భోగాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు మరికొన్ని నెలల్లో ప్రారంభం కానుండటంతో భోగాపురం, భీమిలి పరిధిలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు మొగ్గు చూపుతున్నారు. శుక్రవారం విజయనగరం జిల్లా పోలిపల్లి రెవెన్యూ పరిధిలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారి పక్కన ఉన్న భూములను టాటా కంపెనీకి చెందిన టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్(టీసీఈ) సీనియర్ మేనేజర్ అభినాశ్, ఏజీఎం కిరణ్‌కుమార్ పరిశీలించారు. మ్యాప్ ద్వారా ఇక్కడి భూముల వివరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ వారికి తెలియజేశారు. స్థానిక భూములు, నీటి వనరులు, ఎయిర్‌పోర్టు సదుపాయం, రవాణా వంటివి ఐటీ పార్కు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. విద్యుత్తు లైన్ల ఏర్పాటుపై విద్యుత్తు శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావును టీసీఈ సీనియర్ మేనేజర్ అభినాశ్, ఏజీఎం కిరణ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. అలాగే నీటి వసతిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠనాయుడుతో చర్చించారు. ఐటీ పార్కు ఏర్పాటుకు సుమారు 500 ఎకరాలు అవసరం కాగా, ఈ ప్రాంతంలో 324 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో మరో చోట స్థల పరిశీలన చేయనున్నట్లు సమాచారం.

## కర్నూలు బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం..
# 27 మందిపై కేసు



- ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందూరి గోపీకృష్ణ వైసీపీ సోషల్ మీడియాపై నమోదు
- బెల్ట్ షాపుల్లో మద్యం తాగడం వల్లనే ప్రమాదమంటూ తప్పుడు పోస్టులు
- ప్రజలను తప్పుదారి పట్టించి, అశాంతి సృష్టించే దురుద్దేశంతోనేనని ఫిర్యాదు

కర్నూలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రైవేటు బస్సు ప్రమాద ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన 27 మందిపై కేసు నమోదు చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం తాగడం వల్లనే ప్రమాదం జరిగిందంటూ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతీసేలా పోస్టులు పెట్టారనే ఫిర్యాదుపై శుక్రవారం కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ జాబితాలో వైసీపీ సోషల్ మీడియాతో పాటు వైసీపీ అధికార ప్రతినిధి ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందూరి గోపీకృష్ణ తదితరులు ఉన్నారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన పేరపోగు వేణుములయ్య ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించడంతో పాటు అశాంతిని సృష్టించాలనే దురుద్దేశంతో రాజకీయ ప్రేరేపిత పోస్టులు పెట్టి వ్యాప్తి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 352, 353(1), 196(1), 61(2) బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తేజోమూర్తి వెల్లడించారు.

### ఇదీ జరిగింది..

గత నెల 24న తెల్లవారుజాము మూడు గంటల సమయంలో కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44పై ప్రైవేటు బస్సు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రోడ్డుపై పడి ఉన్న పల్సర్ బైక్‌ను వి.కావేరి ట్రావెల్స్ బస్సు తోసుకొని వెళ్లడం, ఆ వెంటనే మంటలు చెలరేగి బస్సు కాలిపోయిన ఘటనలో 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతయ్యారు. అంతకుముందు స్నేహితులు శివశంకర్, ఎర్రిస్వామిలు పల్సర్ బైక్‌పై డోన్‌కు వెళ్తుండగా అర్ధరాత్రి 2:45 గంటల సమయంలో డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకర్ శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డివైడర్‌ను ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్‌పై ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వెళ్లడం వల్ల మంటలు చెలరేగాయి. ప్రమాదం జరగడానికి ముందు బైకర్ శివశంకర్, ఎర్రిస్వామిలు 23వ తేదీ గురువారం రాత్రి పెద్దటేకూరు గ్రామంలో ప్రభుత్వ లైసెన్స్‌డ్ శ్రీరేణుక ఎల్లమ్మ వైన్స్ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తాగారు. వారు మద్యం కొనుగోలు చేస్తున్న సీసీ ఫుటేజీలను ఎక్సైజ్ శాఖ అధికారులు విడుదల చేశారు. ఇది జరిగిన సంఘటన. అయితే బెల్ట్ షాపుల్లో మద్యం తాగడం వల్లనే ప్రమాదం జరిగిందని, జాతీయ రహదారి వెంబడి విచ్చలవిడిగా బెల్ట్ షాపులు అక్రమంగా ఏర్పాటు చేశారంటూ ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని 27 మందిపై పేరపోగు వేణుములయ్య ఫిర్యాదు చేశారు. రాజకీయ, సామాజికవర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు భంగం కలిగించాలనే దురుద్దేశంతోనే ఈ పోస్టులు పెట్టారని ఆధారాలతో సహా ఫిర్యాదులో పేర్కొన్నారు.

### వీరిపైనే కేసు..

సీవీ రెడ్డి, కందూరి గోపీకృష్ణ, ఆరే శ్యామల (వైసీపీ అధికార ప్రతినిధి), వైసీపీ అఫీషియల్ పేజీ, నవీన్ వైఎస్‌జే వైజాగ్, వెంకీ వెంకీ, యూట్యూబ్ చానల్ యువ టీవీ, కుమార్‌రెడ్డి ఆవుల, డాక్టర్ చిరంజీవి, జగనన్న కనెక్ట్, రాహుల్, దర్శన్, రామ్, శ్రీధర్‌రెడ్డి అవుతు, బిలాల్ వైసీపీ, తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, కరుమూరి వెంకటరెడ్డి, నారాయణ పోతుల, వారియర్స్ వైఎస్ జగన్, మీడియా పేజీ తెలుగు ఎన్‌ఆర్‌ఐ బులిటెన్ బోర్డు, ధరణి, ఏపీ పాలిటిక్స్, మకిధ, కాటసాని అభిమాని రాఘవేంద్రరెడ్డి, సత్తిబాబు వైసీపీ తదితరులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన!

- కర్నూలు 'వి.కావేరి' బస్సు దుర్ఘటనపై రవాణా అధికారుల కమిటీ సమగ్ర విచారణ
- నిబంధనలు ఉల్లంఘిస్తూ స్లీపర్‌గా మార్పు
- బస్సులో లేని అగ్నిమాపక యంత్రాలు
- యథేచ్ఛగా కార్గో సరుకుల రవాణా
- నేడు కేసు దర్యాప్తు అధికారులకు నివేదిక!

కర్నూలు/విజయవాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ ప్రమాదంపై నలుగురు రవాణాశాఖ అధికారులతో నియమించిన కమిటీ ఇప్పటికే సమగ్ర విచారణ చేపట్టింది. బస్సు కొనుగోలు నుంచి రిజిస్ట్రేషన్, ఆల్ట్రేషన్, ప్రమాదానికి కారణాలు, బస్సు డ్రైవర్ మానసిక పరిస్థితి..? వరకు ఇలా అన్ని సమగ్ర వివరాలు సేకరించింది. రోడ్డు రవాణా శాఖ అధికారులు శనివారం సమగ్ర వివరాలతో కేసు దర్యాప్తు అధికారులకు నివేదిక ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నివేదిక పోలీసు దర్యాప్తునకు ఎంతో కీలకమని భావిస్తున్నారు. తెలంగాణ, డామన్ డయ్యు, ఒడిశా రవాణా శాఖ అధికారులు, బస్సు తయారు చేసిన స్కానియా కంపెనీ ప్రతినిధుల నుంచి వివరాలు తీసుకున్న వివరాల ఆధారంగా.. ప్రమాదానికి కారణమైన వి.కావేరి ట్రావెల్ బస్సు ఆల్ట్రేషన్ చేసి నిబంధనలు అతిక్రమించినట్లు రవాణా శాఖ అధికారుల కమిటీ గుర్తించింది. వి.కావేరి ట్రావెల్‌కు చెందిన డీడీ01 ఎన్9490 నంబరు గల మల్టీ యాక్సిల్ స్కానియా ఏసీ స్లీపర్ బస్సును 2018లో తెలంగాణలో రిజిస్ట్రేషన్ చేయించారు. 53 ఏసీ సీటర్ బస్సుగా అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత సీటర్ బస్సును 43 సీప్లర్ బెర్తులుగా ఆల్ట్రేషన్ చేయించి 2023లో కేంద్ర పాలిత ప్రాంతమైన డామన్ డయ్యులో, ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒడిశాలో రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. అయితే 43 సీట్ల బస్సుగానే రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. ఏసీ సీటింగ్ బస్సుగా రిజిస్ట్రేషన్ చేయించిన యాజమాన్యం ఏసీ స్లీపర్ బస్‌గా రోడ్డుపై తిప్పుతున్నారని, రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించినట్లు కమిటీ గుర్తించింది. అలాగే బస్సులో అగ్నిమాపక పరికరాలు లేవని గుర్తించారు. నిబంధనలు అతిక్రమించి యథేచ్ఛగా కార్గో సరుకుల రవాణా చేస్తున్నట్లు గుర్తించింది. విచారణలో వెలుగు చూసిన లోపాలు, బస్సు ఆల్ట్రేషన్‌తో నిబంధనలు ఉల్లంఘన తదితర వివరాలతో సమగ్ర నివేదికను శనివారం దర్యాప్తు అధికారులకు, రోడ్డు రవాణా శాఖ రాష్ట్ర కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. నివేదిక అందగానే దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానానికి అందజేస్తామని, పరారీలో ఉన్న బస్సు యజమానిని అరెస్టు చేసే అవకాశం లేకపోలేదని పోలీసు అధికారులు పేర్కొన్నారు.

### ఫోరెన్సిక్ బృందాల పనితీరు భేష్: డీజీపీ

కర్నూలు బస్సు దహనం ఘటనలో మృతదేహాలను శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో అనతి కాలంలోనే గుర్తించిన ఏపీ ఫోరెన్సిక్ బృందాలను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అభినందించారు. శుక్రవారం తన కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. బస్సు ప్రమాదంలో మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయిన విషయం తెలిసిందే. డీజీపీ ఆదేశాల మేరకు ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్ పాలరాజు డీఎన్‌ఏ, భౌతిక, రసాయన విశ్లేషణలతో కూడిన 16 ఫోరెన్సిక్ బృందాలతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భౌతిక, రసాయన విశ్లేషణ బృందాల నివేదికలు ప్రమాదానికి కారణాలపై స్పష్టత ఇవ్వడంలో కీలకంగా మారాయి. డీఎన్‌ఏ బృందాలు మృతదేహాల అవశేషాలను జాగ్రత్తగా సేకరించడంలో, బాధిత కుటుంబసభ్యుల రక్తనమూనాలు సేకరించి డీఎన్‌ఏ పరీక్షల కోసం ఏపీఎఫ్‌ఎస్‌ఎల్‌కు తరలించే ప్రక్రియను ఫోరెన్సిక్ అధికారులు సమన్వయం చేశారు. కేవలం 13 గంటల్లోనే 19 మృతదేహాల డీఎన్‌ఏ ప్రొఫైల్స్ అభివృద్ధి చేసి, వాటిని వారి బంధువులకు నమూనాలతో సరిపోల్చి నివేదికలను వేగవంతంగా అందించారు.



ఏపీ ఫోరెన్సిక్ బృందాన్ని అభినందిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా

## లిక్కర్ స్కామ్ కేసులో 11 మంది ఆస్తుల జప్తు!

- సిట్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి
- దర్యాప్తు బృందం అడిగిన వివరాలు ఇవ్వాలని చెన్నై రిజిస్ట్రేషన్స్ ఐజీకి ఆదేశం



విజయవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో 11 మంది నిందితుల ఆస్తులను జప్తు చేసుకోవడానికి సిట్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మద్యం కేసు దర్యాప్తునకు సంబంధించి సిట్ అడిగిన వివరాలను ఇవ్వాలని చెన్నై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీని ఆదేశించింది. శుక్రవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పు వెలువరించారు. మద్యం కేసులో నిందితులు చెన్నై కేంద్రంగా వ్యవహారాలను చక్కబెట్టారు. అక్కడ కంపెనీలను ఏర్పాటు చేసి బ్యాంక్ ఖాతాలు తెరిచారు. బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారు. ఈ వివరాల కోసం సిట్ అధికారులు చెన్నైలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీకి పలుమార్లు లేఖలు రాశారు. అనేక మెయిల్స్ పంపారు. అక్కడి నుంచి స్పందన రాకపోవడంతో సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనితో పాటు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 111, 126 ప్రకారం నిందితులకు సహకరించిన 11 మంది ఆస్తులను జప్తు చేయడానికి అనుమతి ఇవ్వాలని పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది.

## మారిటైమ్ బోర్డు సీఈవో అధ్యక్షతన ప్రోత్సాహకాల పరిశీలన కమిటీ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మారిటైమ్ పాలసీ (2024-29) అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మారిటైమ్ యాజమాన్య నిర్వహణా సంస్థలకు కల్పించే ప్రోత్సాహకాల దరఖాస్తుల పరిశీలనకు కమిటీ ఏర్పాటుచేస్తూ మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీలో బోర్డు సీఈవో చైర్మన్‌గా, చీఫ్ నాటికల్ ఆఫీసర్, పోర్టు ఆఫీసర్లు, ఏపీఎంబీ చీఫ్ ఇంజనీరు, ఏపీఎండీ ఈసీ అండ్ సీఏవోతో పాటు అంతర్గత జలరవాణా శాఖ, ఏపీఐఐసీ, మత్స్యశాఖ, ఇంధన శాఖ, పర్యాటక శాఖ ప్రతినిధులు, సంబంధిత జిల్లా కలెక్టరు సభ్యులుగా ఉంటారు. పోర్టు ఆధారిత వాణిజ్య సంస్థలకందించే ప్రోత్సాహకాల దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలిస్తుంది.

## ఐపీఎస్ అధికారి సంజయ్‌కు రిమాండ్ పొడిగింపు



విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖలో నిధులు దుర్వినియోగం చేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న ఆయనకు రిమాండ్ గడువు ముగియడంతో పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు ఈ నెల 14వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

# సైబర్ నేరాలతో ప్రపంచానికి ముప్పు


- దీనిపై పోరాడేందుకు యువత సాంకేతికతను ప్రయోగించాలి
- 'టెక్నో వీఐటీ2025'లో థాయ్‌లాండ్ డిప్యూటీ కమిషనర్



విద్యార్థుల ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలిస్తున్న రాచా అరిబర్గ్, జీవీ సెల్వం, ప్రిన్స్ జయకుమార్

చెన్నై, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో భారత్, థాయ్‌లాండ్‌తో పాటు ప్రపంచానికి ముప్పు నెల కొందని, దీనిపై పోరాడేందుకు యువత సాంకేతికతను ప్రయోగించాలని చెన్నైలోని థాయ్‌లాండ్ డిప్యూటీ కమిషనర్ రాచా అరిబర్గ్ పిలుపునిచ్చారు. 'వీఐటీ చెన్నై'లో 'టెక్నో వీఐటీ 2025' పేరుతో ఏర్పాటైన మూడు రోజుల ప్రపంచ స్థాయి సాంకేతిక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా రాచా అరిబర్గ్ మాట్లాడుతూ.. అత్యధికులు సాంకేతిక జ్ఞానాన్ని మంచి ప్రయోజనాల కోసం వినియోగిస్తుండగా.. కొందరు మాత్రం దానిని చెడు ప్రయోజనాల కోసం ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ టెక్నాలజీ ద్వారా విభజన నెలకొందని, ఇది యువకులకు-వృద్ధులకు మధ్య అంతరాన్ని సృష్టిస్తోందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు యువత వృద్ధులతో కొంత సమయం గడపాలని, లేకుంటే వారు తమ దైనందిన జీవితంలో సాంకేతికతను ఉపయోగించడంలో వెనుకబడిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ.. యూఎస్‌లో కొత్త విధాన మార్పుల కారణంగా భారతీయ విద్యార్థులు అక్కడ చదువుకునే అవకాశాలు తగ్గాయని, ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థుల సంఖ్య 44 శాతం తగ్గిందన్నారు. ఆవిష్కరణలకు భారత్ తల్లి లాంటిదని, భారతీయ విద్య పరిశోధన ఆధారితమైందన్నారు. టెక్నో విట్ వంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఒక గొప్ప అవకాశమని తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన హెచ్‌సీఎల్ టెక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రిన్స్ జయకుమార్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల అభివృద్ధిలో ఎంతో వేగం ఉదని, గత 30 ఏళ్లలో భారత్ ఐటీ సేవల రంగంలో ప్రపంచానికి రాజధానిగా నిలిచిందన్నారు. టెక్నో వీఐటీ టెక్నాలజీ ఫెస్టివల్‌లో రోబో షో, డ్రోన్ షోతో సహా 150కి పైగా టెక్నాలజీ సంబంధిత కార్యక్రమాలు జరుగుతున్నాయి. విజేతలకు మొత్తం రూ.10 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నారు. భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, మలేసియా, ఉజ్బెకిస్తాన్, పోలాండ్ తదితర దేశాలకు చెందిన 10 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

## పోలవరం నిర్వాసితులకు నేడు 1000 కోట్ల పరిహారం



- వేలేరుపాడులో చెక్కులు అందించనున్న నిమ్మల
- ఈ ఏడాది జనవరిలోనూ 900 కోట్లు

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు శుభవార్త. సహాయ పునరావాసం కింద రాష్ట్రప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లను వారికి చెల్లించనుంది. మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం ఏలూరు జిల్లా వేలేరుపాడులో వారికి చెక్కులు పంపిణీ చేయనున్నారు. కేంద్రం ఆదేశాలతో పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా తెరచిన ఖాతా నుంచి సొమ్ము వారి అకౌంట్లకు చేరుతుంది. ఖాతాల్లో జమయినవెంటనే లబ్ధిదారు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం సహాయ పునరావాసం కింద పరిహారం చెల్లించడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో రూ.900 కోట్లను వారి ఖాతాల్లో జమచేసింది. ఫోన్లలో వచ్చిన మెసేజ్‌లు చేసి వారు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడీ చెల్లింపుల కార్యక్రమాన్ని బహిరంగంగా నిర్వహించి వారి ఆనందంలో పాలుపంచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుముందు 2016లోనూ చంద్రబాబు సర్కారే పరిహారం చెల్లించింది. జగన్ తన ఐదేళ్ల హయాంలో పైసా కూడా ఇవ్వలేదు. పైగా పోలవరం ప్రాంతంలో ముఖ్యమంత్రి హోదాలో పర్యటించినప్పుడు నిర్వాసితులు పరిహారం చెల్లించాలని కోరితే.. అది తన చేతుల్లో లేదని.. కేంద్రం నిధులిస్తేనే ఇస్తానని ఆయన తెగేసి చెప్పారు.

# రైతుల్లో గడువు గుబులు!

**పంట నష్టంపై హడావుడిగా ఎన్యూమరేషన్.. తుఫాన్‌తో 1.38 లక్షల హెక్టార్లలో పంట మునక**

- 2 రోజుల్లోనే నివేదికకు సిబ్బందికి ఆదేశం
- శుక్రవారంతో ముగిసిన ఆ గడువు
- కానీ, చాలా ప్రాంతాల్లో ముంపులోనే పంటలు
- నీరు దిగకుండానే పంట నష్టంపై అంచనా
- దీనివల్ల నష్టపోతామని రైతుల ఆవేదన

(ఆంధ్రజ్యోతి- అమరావతి)

మొంథా తుఫాన్ కారణంగా వివిధ జిల్లాల్లో జరిగిన పంట నష్టం అంచనా గడువుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మంగళవారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటగా, ఆ ప్రభావంతో బుధవారం భారీవర్షాలు కురిశాయి. గురువారం పంట నష్టంపై ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభించగా, శుక్రవారం లోగా నివేదిక ఇవ్వాలని (రెండు రోజుల్లోనే) ప్రభుత్వం ఆదేశించడంతో.. చాలాచోట్ల గందరగోళం నెలకుంది. పంట దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రాలన్నీ తక్కువ సమయంలో ఎన్యూమరేషన్ సిబ్బంది పరిశీలించడం కష్టంగా మారగా, గడువు సమీపించంతో అంచనాలు హడావుడిగా తయారు చేశారన్న విమర్శ వినిపిస్తోంది. తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో 1.38లక్షల హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. దీని వల్ల 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిని, రూ.829కోట్ల మేర రైతులు నష్టపోయారని, దాదాపు 1.74లక్షలమంది రైతులపై తుఫాన్ ప్రభావం పడిందని కేంద్రానికి పంపిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇప్పటికీ సగం విస్తీర్ణంలో కూడా పంట నష్టం అంచనా పూర్తి కాలేదని సమాచారం. పంట నష్టాన్ని ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఏపీ ఎయిమ్ యాప్‌ల ద్వారా నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు ప్రకటించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 1.38లక్షల హెక్టార్లలో నష్టం జరగ్గా, 70శాతం వరకు వరి పంటలోనే జరిగిందని చెప్తున్నారు. గురు, శుక్రవారాలు తెరపిచ్చి, ఎండకాసినా.. చాలా చోట్ల వరి పొలాల్లో ఇంకా నీరు నిలిచి ఉంది. ముఖ్యంగా వరి పైరు నేలవాలి ఉంది. కొంత

ఎన్టీఆర్ జిల్లాలో వర్షానికి నల్లగా మొడిబోయిన పత్తి చేను



గింజపాలుపోసుకునే దశలో, ఇంకొంత పొట్ట, కోత దశలో ఉండటంతో నేల వాలిన పైరులో ధాన్యపు గింజలు మొలకలొస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. అయినా.. కొన్ని చోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది ముంపులో ఉన్న పొలాలను దూరంగాచూసి, నష్టాన్ని అంచనా వేస్తున్నారు. మరికొన్ని చోట్ల నీరుందని వదిలేశారంటున్నారు.

**నిబంధనలు అలా.. సిబ్బంది ఇలా...**

పంటదశ, ముంపు తీవ్రతను బట్టి నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది. కానీ గడువు తక్కువగా ఉందని, పై అధికారులు త్వరగా ఎన్యూమరేషన్ చేయమంటున్నారని.. క్షేత్రస్థాయి సిబ్బంది హడావుడిగా పంట నష్టాన్ని నమోదు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 33 శాతంకన్నా ఎక్కువ పంట నష్టపోయి, ఈ-క్రాప్‌లో నమోదైన వాస్తవ రైతులను పరిగణనలోకి తీసుకోవాలని వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించింది. 33 శాతం పైన దెబ్బతిన్న పంటలతో పాటు ఇసుక మేటలు, నేల కోత పడిన క్షేత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దీంతో నష్ట పరిశీలన కీలకంగా మారింది. భూమికోత, ఇసుక మేటలు బయట పడాలంటే ముంపు పూర్తిగా తొలగాల్సి ఉండగా, మరోవైపు పొలాల్లోని నీరంతా శనివారంలోగా బయటకు పంపాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగడానికి సమయం చాలదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమౌతోంది. అయినా సమయం తక్కువగా ఉందని.. ప్రస్తుతమున్న ముంపును చూసి మొత్తం మునిగిందనడం, లేదా.. ఏ వ్యవసాయ క్షేత్రం ఎవరిదో క్షేత్రస్థాయిలో గుర్తించకుండా నివేదిక తయారు చేస్తే.. నష్టపోతామని కొందరు రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. వాస్తవంగా పంట నష్టపోయిన రైతులకే పరిహారం వస్తుందని వ్యవసాయశాఖ ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో నష్టాన్ని గుర్తించేందుకు గడువు పెంచాలని సిబ్బంది, రైతులు అంటున్నారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్‌లో నమోదు కాకపోయినా రైతులను ప్రస్తుత నష్టం అంచనాలోకి తీసుకోవాలని వ్యవసాయశాఖ సూచించింది. కాకినాడ, కోనసీమ, నెల్లూరు జిల్లాల్లో పంట నష్టాన్ని ఉపగ్రహ చిత్రాలు, ఇతర సాంకేతిక సమాచారం ఆధారంగా అంచనా వేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే, వాస్తవంగా పంట నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి చేరకపోతే.. పంట నష్టపోవడంతో పాటు పరిహారాన్ని(ఇన్‌పుట్ సబ్సిడీ) కోల్పోవాల్సి వస్తుంది. అందువల్ల ఎన్యూమరేషన్ గడువును పెంచాలని కోరుతున్నారు.

**ఆ ఆంక్షలపై అన్నదాతల్లో ఆందోళన**

పంట నష్టం కింద నమోదు చేసుకుంటే.. ఆ భూమిలో పండిన పంటను అమ్ముకోవడానికి వీల్లేకుండా గత ప్రభుత్వం ఆంక్షలు పెట్టిందని కృష్ణా జిల్లాలో కొందరు వరి రైతులు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సారి అలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని కోరారు. దీనిపై మంత్రి వ్యవసాయ, సివిల్ సప్లయిస్ శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆదేశించారు.

# నీ సంగతి చూస్తా..!

- జైలు నుంచి బయటికొచ్చాక నాశనం చేస్తా
- కోర్టు ప్రాంగణంలో నిడిగుంట అరుణ వీరంగం
- ఫిర్యాదుదారుడిని చూడగానే రెచ్చిపోయిన కిలేడీ'



అరుణను కోర్టు హాలులోకి వేగంగా తీసుకువెళ్తున్న పోలీసులు

విజయవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'నువ్వు నాకు డబ్బులిచ్చావా? ఎప్పుడిచ్చావు? కంగారు పడకు.. నీ సంగతి చూస్తా. జైలు నుంచి బయట కొచ్చిన తర్వాత నిన్ను నాశనం చేస్తా'.. వైసీపీ హయాంలో నెల్లూరు జిల్లాను శాసించిన కిలేడీ' నిడిగుంట అరుణ శుక్రవారం విజయవాడ కోర్టుల ప్రాంగణంలో చేసిన వీరంగం ఇది. ఆమెపై ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి రమేశ్‌బాబు అనే వ్యక్తి చూసి.. పోలీసుల సమక్షంలోనే అరుణ ఊగిపోయింది. రమేశ్ నుంచి వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.24.50 లక్షలను రెండు విడతలుగా అరుణ వసూలు చేసింది. ఈ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఒంగోలు జిల్లా జైల్లో ఉన్న అరుణను పీటీ వారెంట్‌పై విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి రమేష్‌బాబు అక్కడికి వెళ్లారు. కోర్టు ప్రాంగణంలో అతన్ని చూసిన అరుణ చిందులేసింది. "నువ్వు నాకు డబ్బులిచ్చావా? ఎక్కడిచ్చావు.. కంగారు పడకు.. బయటికి వచ్చిన తర్వాత నీ సంగతి చూస్తా. నిన్ను నాశనం చేస్తా" అంటూ చిందులు వేసింది. దీంతో పోలీసులు ఆమెను వేగంగా కోర్టు హాలు వద్దకు తీసుకెళ్లారు.

**ఇదీ కేసు..:** ఎన్టీఆర్ జిల్లా వీరులపాడుకు చెందిన వాసిరెడ్డి రమేశ్‌బాబు విజయవాడలో ఉంటున్నారు. వైసీపీ హయాంలో ఒక యువకుడికి ఎస్ఐ ఉద్యోగం, మరో మహిళకు అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం పర్మినెంట్ చేయడానికి ఇబ్రహీంపట్నంలో ఉండే సురేంద్ర అనే వ్యక్తిని కలిశాడు. ఆయన.. మంగళగిరి పోలీసు కార్యాలయంలో పనిచేసే బంగారి అనే వ్యక్తి పేరు చెప్పాడు. తర్వాత పది రోజులకు బంగారి ఫోన్ చేసి రమేశ్‌బాబును విజయవాడలోని ఓ హోటల్‌కు రమ్మని చెప్పాడు. ఎస్ఐ పోస్టుకు రూ.18.50 లక్షలు, అంగన్‌వాడీ పోస్టుకు రూ.6 లక్షలు అవుతుందని రేటు చెప్పాడు. ఈ మేరకు 2021 మార్చి 19న నిడుగుంట అరుణ, బుల్లెట్ బాబు అనే ఇద్దరు కారులో విజయవాడ వచ్చి కలవగా, రమేశ్‌బాబు వారికి రూ.12 లక్షలు ఇచ్చాడు. మరో పది రోజుల తర్వాత బుల్లెట్‌బాబు వచ్చి రూ.12.50 లక్షలు తీసుకున్నాడు. పని జరగకపోడంతో ఆ మొత్తం తిరిగివ్వమని రమేశ్‌బాబు పలుమార్లు నెల్లూరు వెళ్లి అరుణను అడిగితే అనుచరులతో బెదిరించింది. దీనిపై రమేష్‌బాబు ఈ ఏడాది అక్టోబరు 13న సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ఇప్పటికే ఒంగోలు జిల్లా జైల్లో ఉన్న అరుణను పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి శుక్రవారం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో తిరిగి ఒంగోలు జైలుకు తరలించారు.

## మా ఇంటికి సీఎం సార్ వస్తున్నారు


- శ్రీసత్యసాయి జిల్లాలో లబ్ధిదారుల ఆనందం
- నేడు పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, జిల్లా అధికారులు

పుట్టపర్తి, కదిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వస్తున్నారు. గ్రామంలో చింతలయ్య, రెడ్డెమ్మ, మేడా మల్లయ్య ఇళ్లకు వెళ్లి వారికి స్వయంగా పింఛన్లను అందజేస్తారు. ముఖ్యమంత్రి తమ ఇంటికి వస్తున్నారని తెలుసుకుని లబ్ధిదారులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కాగా, తాడేపల్లి మండలం ఉండవల్లి నుంచి చంద్రబాబు శనివారం ఉదయం 11.15 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. కదిరి నియోజకవర్గంలోని పెద్దన్నవారిపల్లికి మధ్యాహ్నం 12.45కి చేరుకుంటారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌లను అందజేసిన తరువాత గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. గ్రామ ప్రజల సమస్యలను ప్రజా వేదికలో సీఎం అడిగి తెలుసుకుంటారు. అనంతరం టీడీపీ శ్రేణులతోనూ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. పెద్దన్నవారిపల్లి నుంచి హెలీకాప్టర్‌లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి, శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి లండన్‌కు బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పరిశీలించారు. సీఎం పర్యటనకు ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## టీ మంత్రిగా క్రికెటర్ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం



మంత్రిగా ప్రమాణాస్వీకారం అనంతరం అజారుద్దీన్‌ను అభినందిస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీమిండియా మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్లో అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అల్లా సాక్షిగా ప్రమాణం చేసిన ఆయన జై తెలంగాణ, జైహింద్ అంటూ నినదించారు. ప్రమాణ స్వీకారం అనంతరం వేదికపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు, ఇతర నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## అంబాసిడర్ కారు.. మనసు పెట్టేశారు సారు!

- ఆ కారుతో 3 దశాబ్దాల అనుబంధం.. గుర్తుచేసుకున్న సీఎం

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల క్రితం తాను ఉపయోగించిన అంబాసిడర్ కారుతో ఉన్న అనుబంధాన్ని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 393 నంబరుతో ఉండే ఈ కారు ఆయన సొంత వాహనం. దీనిలోనే ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఆయన విస్తృతంగా పర్యటించేవారు. 393 అంబాసిడర్ అంటేనే చంద్రబాబు బ్రాండ్ కార్ అనేలా గుర్తింపు పొందింది. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ఉన్న చంద్రబాబు భద్రత పరంగా ఆధునిక వాహనాలు వినియోగిస్తున్నా, తన సొంత కారును మాత్రం అపురూపంగానే చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లో ఉన్న ఈ కారును ఇకనుంచి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఉంచనున్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయానికి వచ్చి, తిరిగి వెళ్తున్న సమయంలో ఆనాడు తాను వాడిన అంబాసిడర్‌ను చంద్రబాబు పరిశీలించారు. ఆ కారులో తన ప్రయాణ స్మృతులను గుర్తు చేసుకున్నారు.




అంబాసిడర్ కారును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# లండన్ పర్యటనకు చంద్రబాబు

### నేటి రాత్రి సతీమణి భువనేశ్వరితో కలసి వెళ్లనున్న ముఖ్యమంత్రి

- ఐవోడీ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికైన భువనేశ్వరి
- ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్‌లో హెరిటేజ్ ఫుడ్స్‌కు 'గోల్డెన్ పీకాక్'
- 4న రెండు అవార్డుల కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం దంపతులు

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పర్యటనలో భాగంగా సతీమణి భువనేశ్వరితో కలిసి సీఎం చంద్రబాబు శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ భువనేశ్వరికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నవంబరు 4న డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 అవార్డు అందించనుంది. అలాగే, హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును కూడా అదే వేదికపై భువనేశ్వరి అందుకోనున్నారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి చంద్రబాబు హాజరవుతారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో చైర్మన్ గోపీచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ చైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా, సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్ ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల చైర్మన్ సంజీవ్ గోయెంకా వంటి ప్రముఖులు గతంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార, సామాజిక, పరిపాలనా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారు.

## భువనేశ్వరి ప్రజాసేవకు పట్టం



ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో చేసిన కృషికి గాను సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. భారత్‌లోని ప్రముఖ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) ఆమెను డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు-2025కు ఎంపిక చేసింది. ఈ అవార్డుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ప్రజాసేవ, సామాజిక ప్రభావం, నాయకత్వం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను ఏటా ఈ అవార్డులను ఐవోడీ ఎంపిక చేస్తుంది. భువనేశ్వరి నేతృత్వం వహిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు.. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, విపత్తు సాయం తదితర అంశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఎన్టీఆర్ విద్యార్థి సహాయ పథకాలు, విపత్తు నిర్వహణ సేవలు, మహిళల ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మన్నన పొందుతున్నాయి. ప్రత్యేకించి తలసేమియా రోగులకు ఉచితంగా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్స్ నిర్వహించడటంతో పాటు దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువైన భువనేశ్వరి ప్రజాసేవా నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు.

**ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌గా హెరిటేజ్ ఫుడ్స్**

మహిళా నాయకత్వానికి భువనేశ్వరి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కార్పొరేట్ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్‌కు వైస్ చైర్‌పర్సన్, ఎండీగా ఉన్న ఆమె ఆ సంస్థను పారదర్శకత, సామాజిక బాధ్యతతో నడిపిస్తున్నారు. హెరిటేజ్‌ను దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన బ్రాండ్‌గా తీర్చిదిద్దారు. సంస్థ ఎదుగుదల, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలతోపాటు కోట్ల మంది వినియోగదారులకు హెరిటేజ్ ఉత్పత్తులు చేరువ చేయడంలో భువనేశ్వరి కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకించి హెరిటేజ్ ద్వారా రైతుల సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. వాణిజ్య రంగంలో అందిస్తున్న సేవలకు గాను దేశంలోని అత్యంత శక్తిమంతమైన మహిళా వ్యాపారవేత్తల్లో భువనేశ్వరి ఒకరని 2013లోనే ఫార్చ్యూన్ ఇండియా పేర్కొంది. ఎఫ్ఎంసీజీ రంగంలో అత్యుత్తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెరిటేజ్ ఫుడ్స్‌కు కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో దక్కిన గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హోదాలో భువనేశ్వరి అందుకోనున్నారు.

**పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీలు**

లండన్‌లో వ్యక్తిగత పర్యటన అనంతరం పలు కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొననున్నారు. విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి లండన్‌లోని పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రవాసాంధ్రులతో ఆయన భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను వారికి వివరిస్తారు. 6న సీఎం తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

## సివేరి సోమ కుమారుడికి గ్రేడ్-1 డీటీ పోస్టు

- నాడు నక్సల్స్ చేతిలో బలైన అరకు మాజీ ఎమ్మెల్యే సోమ
- సీఎం హామీ మేరకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు



సురేష్‌కుమార్

అమరావతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల దాడిలో మరణించిన నాటి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడు సురేష్‌కుమార్‌కు రెవెన్యూ శాఖలో గ్రేడ్-1 డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2018, సెప్టెంబరు 28న నాటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఉన్న సివేరి సోమలను మావోయిస్టులు హత్యచేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన సీఎం చంద్రబాబు.. సర్వేశ్వరరావు, సివేరి సోమ కుమారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ప్రకటించారు. సర్వేశ్వరరావుకు ఇద్దరు కుమారులు కాగా, చిన్నకుమారుడిని అప్పట్లోనే డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. సివేరి సోమ కుమారుడికి అప్పటికింకా తగిన వయస్సు, విద్యార్హతలు లేవు. ప్రస్తుతం సివేరి సోమ కుమారుడు సురేష్ కుమార్ ఎంబీఏ పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను జోన్-1లో డైరెక్ట్ రిక్రూటీ కోటాలో గ్రేడ్-1డిప్యూటీ తహశీల్దార్‌గా నియమిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఉత్తర్వులు (జీఓ-399) జారీ చేశారు. ఈ మేరకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఉక్కు పరిశ్రమల సామర్థ్యం పెంపుపై దృష్టి

- స్వీడన్ మంత్రితో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో దేశంలో 2030 నాటికి 30 కోట్ల టన్నుల ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో స్వీడన్ మంత్రి సారా మోడిగ్‌తో భేటీ అయ్యారు. స్వీడన్ మెటలర్జికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా మధ్య పరిశోధన సహకారాన్ని విస్తరించాలని, భాగస్వామ్యంలో పనిచేయాలని నిర్ణయించారు. వినూత్న ఉక్కు సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా పరిశ్రమ సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఉక్కుకు ప్రపంచ మార్కెట్లో డిమాండ్ మందగిస్తున్నప్పటికీ, భారత్‌లో భారీగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా దేశీయ ఉక్కు డిమాండ్ ఏటా 11-13 శాతం చొప్పున పెరుగుతోందన్నారు. ఈ భేటీలో స్వీడన్ రాయబారి జాన్ థెస్లెఫ్, కేంద్ర ప్రభుత్వ అధికారి వినయ్‌కుమార్, స్వీడిష్ ప్రతినిధి బృందం సభ్యులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.